22-4Pg1exHMNWJQE.qxd:22-4Pg1exHMNWJQE.qxd 01/01/01 9:46 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 80 పేజీలు: 12 వెల: 6.50

అమెరికాను దెబ్బతీస్తే సహించను: ట్రంప్
రాజీపడిన ఎన్నికల సంఘం: రాహుల్
9లో



శక్తివంతమైన జాతిగా మన తెలుగుజాతిని నిలుపుదాం

ఇసుక, క్లీన్ ఎనర్జీ, నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎమ్ఎస్ఎంఇ పాలసీలను ప్రకటించాం

- సిఎం చంద్రబాబు

# ప్రపంచ ఆవిష్కరణలకు వేదికగా ఎపి

**విజయవాడ, ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ఆవిష్కరణలకు, అవకాశాలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్నదే తన తపన అని, థింక్ గ్లోబల్లీయాక్ట్ - గ్లోబల్లీ విధానంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం తెలుగు ప్రజల రక్తంలోనే ఉందన్నారు. దేశభక్తి చాటేలా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు చేయిచేయి కలుపుదామని తనతో పాటు, అందరూ ఇందులో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు తన కుటుంబసభ్యులతో కలిసి యూరప్‌దేశాల పర్యటనకు వెళ్లారు.ఆయన నిన్న యూరప్ పర్యనట్లో అంతర్భాగంగా అక్కడే కుటుంబసభ్యులతో కలిసి తన పుట్టిన రోజు జరుపుకున్నారు.ఆయనకు రాష్ట్రీయంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అభినందనలు లభించాయి.వారందరికి సిఎం చంద్రబాబు సామాజిక మాధ్యమాల ద్వారా ధన్యవాదాలు తెలిపారు.నేటి అర్ధరాత్రి తరువాత యూరప్ పర్యటన ముగించుకుని ఆయన ఢిల్లీ చేరుకుంటున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా ఆయన టిడిపి కార్యకర్తలకు,ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మనమంతా తిరుగులేని విజయాలు సాధించాలన్నారు. పేదరికం లేని సమాజం స్థాపించాలనేదే తన సంకల్పమని అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

ప్రతి సంపన్న వ్యక్తి పేదవాడి శ్రేయస్సు కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదరిక నిర్మూ టలన కోసం పీ4 తెచ్చామని చెప్పారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదల జీవితాలు మార్చడం కోసం పనిచేస్తున్నామని పేర్కొన్నారు. 2047నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా తెలుగు జాతిని నిలపాలన్నదే తన అభిలాష అన్నారు. అందరికీ అవకాశాలు కల్పించేలా, ప్రతి పౌరుడి భవిష్యత్తుకు భరోసానిచ్చేలా పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. అందరి ఆదరాభిమానాలు, నమ్మకం తనలో బాధ్యతను, నిబద్ధతను మరింత పెంచాయన్నారు. ప్రజల భవిష్యత్ కలలు, ఆకాంక్షల సాకారానికి నిరంతరం కష్టపడి పనిచేస్తానని మాటిస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి, తెలుగు ప్రజల అభ్యున్నతికి పునరంకితం అవుతానన్నారు. స్వర్ణాంధ్ర2047 విజన్‌ను >>2



# పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు

## దీర్ఘకాలిక అస్వస్థతతో సుదీర్ఘ పోరాటం

**వాటికన్‌సిటీ, ఏప్రిల్ 21:** ప్రపంచ క్రైస్తవుల ఆరాధ్యదైవం పోప్ ఫ్రాన్సిస్ తుదిశ్వాస విడిచారని వాటికన్ వర్గాలు ప్రకటించాయి. పోప్ తన జీవితమంతా చర్చి సేవకు అంకితమయ్యారని వెల్లడించాయి. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన ఆయన, 2013లో 266వ పోప్‌గా నియమితులయ్యారు. లాటిన్ అమెరికా దేశాల నుంచి పోప్‌గా నియమితులైన తొలి వ్యక్తిగా ఆయన నిలిచారు. పోప్ ఫ్రాన్సిస్ పేదల పట్ల ఎంతో దయతో ఉండేవారు. ఆయన పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శించేవారు, వాతావరణ మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేసేవారు. చిన్నప్పుడే ఊపిరితిత్తుల్లోని ఓ భాగాన్ని తొలగించిన ఆయన తరచూ అస్వస్థతకు లోనవుతున్నారు. వాస్తవానికి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఫ్రాన్సిస్ యువకుడిగా ఉన్నప్పుడే ఆయన ఊపిరితిత్తుల్లోని ఓ భాగాన్ని తొలగించారు. 2025 ఫిబ్రవరిలో ఆయన శ్వాసకోశ సమస్యలతో జెమెల్లి ఆసుపత్రిలో చేరారు. అది డబుల్ న్యుమోనియాగా మారింది. ఆయన 38 రోజులపాటు ఆసుపత్రిలోనే ఉండి, తరువాత కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. అయితే తన అధికారిక నివాసానికి వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం, పోప్ ఫ్రాన్సిస్ సెయింట్ మేరీ మేజర్ బాసిలికాకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఈ ఏప్రిల్ 20న ఆయన ఈస్టర్ సందర్భంగా క్రైస్తవులకు సందేశం కూడా ఇచ్చారు. కాగా ఇప్పుడు 88 ఏళ్ల వయస్సులో ఆయన మరణించారు.పోప్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఈస్టర్ సందర్భంగా చాలా రోజు తర్వాత ఆయన ప్రజల్లోకి వచ్చారు. దాదాపు నెల రోజుల పాటు ఆసుపత్రి చికిత్స తర్వాత పోప్ మార్చి 24న తన నివాసం కాసా శాంటా మార్టాకు తిరిగి వచ్చారు. ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చిన తరువాత తనను చూడాటానికి వచ్చిన ప్రజలకు కూడా ఆయన ఆశీర్వాదం >>2

# జస్టిస్ మన్మథరావు కర్ణాటక హైకోర్టుకు బదలీ

## సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు ఉత్తర్వులు జారీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్21:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల హైకోర్టులలో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తుల బదలీ జరిగింది. సుప్రీం కోర్టు కొలీజియం చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ బదలీలను ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల ప్రకారం, తెలంగాణ నుంచి ఇద్దరు, ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఒక న్యాయమూర్తి ఇతర రాష్ట్రాల హైకోర్టులకు బదలీ అయ్యారు. తెలంగాణ హైకోర్టులో సేవలందిస్తున్న న్యాయమూర్తులలో జస్టిస్ కె. సురేందర్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. మరో న్యాయమూర్తి జస్టిస్ పి. శ్రీసుధను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అదేవిధంగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగాఉన్న జస్టిస్ కె. మన్మథరావును కూడా కర్ణాటక హైకోర్టుకు బదలీ చేశారు. ఈ బదిలీలకు సంబంధించి సుప్రీం కోర్టు కొలీజియం గతంలో సిఫార్సులు >>2

# ధరణి పరిరక్షణ సమష్టి బాధ్యత

## వైద్య, ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** ధరణి మాత ఆరోగ్య రక్షణ మనందరి సమష్టి బాధ్యత అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంత్రి కీలక వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టు చేసారు.మానవాళి సుఖజీవనాభిలాష నానాటికీ పెరుగుతుండటంతో తత్పర్యవసానంగా నిరంతర దాడులకు గురవుతుందన్నారు. దాంతో సమతుల్యం కోల్పోతూ అను నిత్యం ఆరోగ్య క్షీణతకు గురవుతున్న పుడమి తల్లి మౌనంగా రోదిస్తోంది. మానవాళితో పాటు లక్షలాది రకాల జంతువులు, పక్షులు, మొక్కలకు ఆశ్రయమిచ్చే ధరణి మాత బలహీనమవుతూ బేలగా మారుతోంది. ఎల్లలు లేని గనుల తవ్వకాలు, కనుమరుగవుతున్న పచ్చదనం, మాయమవుతున్న జీవ వైవిధ్యం, అడుగంటుతున్న భూగర్భ జలాలు, కలుషితమవుతున్న నదీ జలాలు, పెరిగిపోతున్న ఎడారీకరణ, విజృంభిస్తున్న వాయు కాలుష్యం, అతివేగంగా సంభవిస్తున్న పర్యావరణ మార్పులు మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఉష్ణోగ్రతలు పెరగడంతో కబళించడానికి సిద్ధమవుతున్న సముద్ర జలాలు వంటి సమస్యలు ధరణి మాత ఉనికికి, తద్వారా మానవాళి మనుగడకు పెను సవాళ్లుగా మారుతున్నాయి. ఈ సమస్యల పట్ల ప్రజల్లో చైతన్యాన్ని కల్పించి, సమిష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ ద్వారా భూ మాతను మరియు >>2



# తొలిసారి లక్షదాటిన బంగారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** బులియన్ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. చరిత్రలో ఎన్నడూలేని విధంగా బంగారం ధరలు చుక్కలనంటుతున్నాయి. సోమవారం బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల మేలిమి బంగారం పన్నులతో కలిపి లక్షరూపాయలకు చేరింది. అమెరికా, చైనా మధ్య వాణిజ్యయుద్ధం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు బంగారంవైపే ఎక్కువ ఆసక్తిచూపుతున్నారు. ఈక్రమంలో అంతర్జాతీయ విపణిలో ఔన్స్ బంగారంధరలు సోమవారం 3405 డాలర్లుపలికింది. ఈ ధరల క్రమాన్ని అనుసరించి దేశీయంగా లక్ష రూపాయల మార్కును చేరింది. >>2



సోమవారం న్యూఢిల్లీలో అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

# ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 500 బిలియన్ డాలర్లు

## అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌తో ప్రధానిమోడీ భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సహకారంలో అన్ని కీలకరంగాల్లో నమోదయిన ప్రగతిని ఈసందర్భంగా ఇరువురునేతలు సమీక్షించారు. అమెరికా భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి మేలుచేసేవిధంగా చర్చలుజరిగాయని అనంతరం ప్రకటించారు. రెండుదేశాల ప్రజల శ్రేయస్సును ఆకాంక్షించే చర్చలు కూడా చోటు చేసుకున్నట్లు తెలియవచ్చింది. ప్రధానిగా ఇంధన రంగం, రక్షణ, వ్యూహాత్మక అధునాతన టెక్నాలజీలు ఇతర కీలక రంగాల్లో రెండుదేశాల పరస్పర సహకారం, వాణిజ్యం అంశాలే వీరిమధ్య చర్చకు వచ్చాయని తర్వాత అధికారిక >>2

# అనంతబాబు డ్రైవర్ కేసుపై ఎబివి ఆరా!

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 21(ప్రభాతవార్త) :** వీధి సుబ్రహ్మణ్యం కేసులు సిట్‌కు అప్పగించి సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షి ంచాలని విశ్రాంత డిజిపి ఎబి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్సీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోరు డెలివరీ చేసిన కేసు వివరాలు తెలుసుకునేందుకు ఆయన కాకినాడ జిల్లాకు విచ్చేశారు. సోమవారం ఉదయం పెదపూడి మండలం జి మామిడాడ గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను కలసి ఆయన వివరాలు సేకరించారు. వారితో కలిసి కాకినాడ వచ్చి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి >>2

# ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రుల బృందం

**విజయవాడ, ఏప్రిల్21, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధాని నరేంద్రమోడి మే 2నఅమరావతి రాజధాని పనులు పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం విజయవాడలోని జలవనరుల శాఖ రైతు శిక్షణా కేంద్రంలో మంత్రుల బృందం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించింది. ఈసందర్భంగా రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమానికి వచ్చే వారందరికీ ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో ముఖ్యంగా ఆహారం, తాగునీరు వంటి వసతుల కల్పనలో ఎంత మాత్రం రాజీ పడరాదని అధికారులకు స్పష్టం చేశారు.

ప్రధాని సభా ప్రాంగణానికి చేరుకునే రహదారులను మెరుగుపరచాలని మంత్రి కేశవ్ అధికారులకు స్పష్టం చేశారు.రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ ప్రధాని పర్యటన రోజు ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా చూడాలని పోలీస్ తదితర శాఖల అధికారులను ఆదేశించారు.ప్రధాని సభకు వచ్చే సామాన్య ప్రజలకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పించడంలో ఏమాత్రం రాజీ పడవద్దని స్పష్టం చేశారు. వరకూ చాలా గ్రామీణ రహదారులై ఉన్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. >>2

# రేపు పదవ తరగతి పరీక్ష ఫలితాలు

**విజయివాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదలకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఏప్రిల్ 23వ తేదీన ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అధికారిక వెబ్ సైట్, వాట్సాప్ (మన మిత్ర), లీప్ యాప్‌లలో ఫలితాలు చూసుకోవచ్చని వివరించారు. మార్చి 2025, ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. ఆ రోజు ఉదయం 10.00 గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఫలితాలను అధికారిక వెబ్ సైట్లు,'మన మిత్ర' (వాట్సాప్), ఎల్ఇఎపి మొబైల్ యాప్‌లలో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఇక అభ్యర్థులు ఫలితాలను వాట్సాప్‌లో 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని..వారి రోల్ నంబర్‌ను నమోదు చేయడం ద్వారా వారి ఫలితాల పిడిఎఫ్ కాపీని పొందవచ్చు. అలానే సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఎల్ఇఎపి మొబైల్ యాప్ ఉపాధ్యాయులు, విద్యార్థుల లాగిన్‌ల ద్వారా కూడా ఫలితాలు పొందే సౌలభ్యం కలిగించినట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ >>2

# హైకోర్టులో వంశీకి మళ్లీ చుక్కెదురు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** భూ కబ్జా కేసుకు సంబంధించి వైఎస్సార్సీ నాయకుడు,మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీకి హైకోర్టులో చుక్కెదురయింది. ఈ కేసులో ఆయన దాఖలుచేసిన బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. కేసుకు సంబంధించి ప్రభుత్వంనుంచి ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో, కేసును హైకోర్టు వారం పాటు వాయిదా వేసింది. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి విజయవాడ జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. వంశీపై ఈ కేసుతో పాటు గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు కూడా ఉన్నాయి.

# 'సిట్' అదుపులో కసిరెడ్డి



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డిని (కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి) సిట్ పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సిట్ పోలీసులు, విజయవాడ తీసుకువస్తున్నారు. ఇప్పటికే సిట్ విచారణకు హాజరవుతున్నట్లు రాజ్ కసిరెడ్డి ఆడియో విడుదల చేసారు. విచారణకు హాజరవుతున్నట్లు సిట్ అధికారులకు రాజ్ కసిరెడ్డి సమాచారం ఇచ్చారు. రాజ్ కసిరెడ్డి దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చినట్లు తెలుస్తోంది.

**మంగళవారం ఉదయం సిట్ విచారణకు:**

ఎపి మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గత కొంత కాలంగా పోలీసులకు ఆచూకీ తెలియకుండా ఆయన తిరుగుతున్నారు. తాజాగా ఇవ్వాళ మధ్యహ్నం కసిరెడ్డి మరో ఆడియో సందేశాన్ని విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో సిట్ విచారణకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. >>2

# జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## 8 మంది మావోయిస్టుల హతం

## మృతుల్లో మావోయిస్టు అగ్రనేత వివేక్



మరణించిన వివేక్ (ఫైల్)

**హైదరాబాద్, ఏప్రిల్ 19, ప్రభాతవార్త:** మావోయిస్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఓవైపు ఛత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర బలగాలు వరుసగా బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని ముప్పేట కట్టడి చేస్తున్న తరుణంలో జార్ఖండ్‌లోని బొకారోలో సోమవారం ఉదయం నక్సల్స్ స్థావరంపై సిఆర్‌పిఎఫ్ బలగాలు జరిపిన దాడిలో ఎనిమిది మంది మావోయిస్టులు మరణించారు. మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేతల్లో ఒకరైన ప్రయాగ్ మాంజి అలియాస్ వివేక్ సహా ముగ్గురు వున్నట్లు జార్ఖండ్ డిజిపి అనురాగ్ గుప్తా మీడియాకు తెలిపారు. జార్ఖండ్‌లోని బొకారో జిల్లా లాల్‌పానియా ప్రాంతంలోని లుగు పర్వతాల వద్దగల అటవీ ప్రాంతంలో నక్సలైట్ల >>2

22-4pg2exHMNWJQE.qxd:22-4pg2exHMNWJQE.qxd 01/01/01 9:44 AM Page 1





రాజస్థాన్‌లోని బికనీర్‌లో సోమవారం బెంగాల్ అల్లర్లకు నిరసనగా విహెచ్‌పి కార్యకర్తలు ప్రదర్శన చేస్తున్న దృశ్యం

## మా పాలసీలు వెయ్యేళ్ల
# భవిష్యత్తుకు ప్రణాళికలు
## సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21:** తమ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తాము తీసుకుంటున్న నిర్ణయాలు.. దేశ భవిష్యత్తును మరో వెయ్యేళ్ల పాటు తీర్చిదిద్దనున్నట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 17వ సివిల్ సర్వీసెస్ డేసందర్భంగా ఆయన ప్రసంగించారు. భారత్‌లో ఆశావాహ సమాజం ఆశయాలు.. అసాధారణ రీతికి చేరుకుంటున్నాయని, ఆ కలల్ని నిజం చేసేందుకు అమితమైన వేగంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. సమగ్ర దేశాభివృద్ధి ముఖ్యమని, ప్రతి గ్రామం.. ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడిని వదలకుండా అభివృద్ధి సాగాలన్నారు. ప్రభుత్వ స్కీములు ప్రజలకు చేరిన తీరును బట్టి.. పరిపాలనా నాణ్యత తెలుస్తుందన్నారు. ప్రజలకు అన్ని స్కీములు చేరితే అప్పుడు ఆ ప్రభావం గ్రౌండ్ స్థాయి నుంచి మారుతుందన్నారు. గత పదేళ్లలో భారత్ అసాధారణ రీతిలో మార్పులను చవిచూసిందన్నారు. పరిపాలన, పారదర్శకత, ఆవిష్కరణ అంశాల్లో భారత్ కొత్త ప్రమాణాలను నెలకొల్పిందన్నారు. ఇది టెక్నాలజీ యుగమని, అయితే వ్యవస్థలను సమర్థవంతంగా మేనేజ్ చేయడమే పరిపాలన అని ప్రధాని తెలిపారు. భారతదేశ సమగ్ర అభివృద్ధి అంటే ఏ గ్రామం, ఏ కుటుంబం, చివరికి ఏ పౌరుడు కూడా వెనుకబడి ఉండకూడదు అని మోదీ పేర్కొన్నారు.మన బ్యూరోక్రసీ, విధాన రూపకల్పన అవుట్‌డేటెట్ వ్యవస్థల ఆధారంగా పనిచేయదు. అందుకే ఈ రోజు మా ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు రానున్న 1000 సంవత్సరాల భవిష్యత్‌ను ప్రభావితం చేస్తాయని మోడీ అన్నారు. భారతదేశంలో యువత, రైతులు, మహిళలు, వారి కలలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి, అసాధారణమైన వేగం చాలా అవసరం అని ప్రధాని అన్నారు. ప్రభుత్వ పథకాలు ఎంతగా ప్రజలకు అందుతున్నాయో, క్షేత్రస్థాయిలో వాటి నిజమైన ప్రభావం ఎంత ఉందో అన్నదానిని బట్టి, పాలనలో నాణ్యత తెలుస్తుంది. గత పదేళ్లలో భారతదేశం క్రమానుగతంగా పెరుగుతున్న మార్పును దాటి, ప్రభావవంతమైన పరివర్తనను చూసింది.

# డ్రైవర్ కేసుపై ఎబివి ఆరా!

>> బాధిత కుటుంబానికి ఇంకా అందవలసిన ఆర్థిక సహాయం గూర్చి చర్చించారు. జిల్లా ఎస్పీని కలిసి కేసు పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అప్పటి ఎస్.పి,ఇన్చార్జి, డి.ఎస్.పి రెగ్యులర్ డి.ఎస్.పి,మరియు టూ టౌన్, సర్పవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సక్రమంగా కేసు విచారణ చేయిపట్టలేదని అప్పటి ఛార్జ్ సీటు చూస్తే తేటతెల్లమైందన్నారు. ఈ కేసును సిట్ కప్పగించి మొదటి నుంచి దర్యాప్తు చేసి దోషులను గుర్తించి అరెస్టు చెయ్యాలన్నారు. నిరక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు పిట్టా వరప్రసాద్, సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు వీధి సత్యనారాయణ, వీధి నూకరత్నం,తమ్ముడు వీధి నవీన్ కుమార్, ఆర్పిఐ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాసరావు, చైతన్య ఆర్గనైజేషన్ అధ్యక్షులు కడలి సత్యమూర్తి, కడలి కిషోర్, కోడి కత్తి శీను తదితరులు పాల్గొన్నారు.

# 500 బిలియన్ డాలర్లు

>> ప్రకటన వెలువరించారు. జాతీయ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అంశాలు కూడా వీరిమధ్య చర్చకు వచ్చాయి. చర్చల్లోభాగంగానే ప్రధాని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ భారతపర్యటనకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. గతంలో 2013లో జోబైడెన్ ఉపాధ్యక్షుడుగా ఉన్న కాలంలో మాత్రమే అమెరికా ఉపాధ్యక్షుల పర్యటన జరిగింది. ట్రంప్ అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత ఉపాధ్యక్ష హోదాలో జెడివాన్స్ భారత్ తొలిపర్యటనగా చెప్పువచ్చు. 2030 నాటికి రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు పెంచాలని నిర్ణయించారు. నాలుగురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన జెడివాన్స్ దంపతులకు ఎయిర్‌పోర్టులో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టులోనే గౌరవవందనం స్వీకరించిన తర్వాత అక్కడినుంచి బయలుదేరి న్యూఢిల్లీలోనే ఉన్న స్వామినారాయణ్ మందిరాన్ని సందర్శించారు. భారత దేశ సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా వారసత్వ సంపదకు చిహ్నంగా అక్షరధామ్ ఆలయాన్ని నిర్మించారని వాన్స్ వ్యాఖ్యానించారు. ఆలయ ప్రాంగణంలో పొందుపరిచిన సామరస్యం కుటుంబ విలువలు కాలాతీత జ్ఞానం వంటి సందేశాలను చూసిన వాన్స్ ఉషావాన్స్ నిర్మాణ నైపుణ్యాన్ని అభినందించారు. ఈ పర్యటన అమెరికా, భారత్‌లమధ్య ఉన్న సంబంధాలను బలోపేతంచేయడానికి కొనసాగుతున్న విశ్వాసం శాంతి ఐక్యత ఉమ్మడి విలువలను పెంపొందిస్తాయని వారన్నారు. ఈ అందమైన ప్రదేశానికి నన్ను నా కుటుంబాన్ని స్వాగతించడంలోనే మీ ఆతిథ్యం, దయకు మీ అందరికీ ధన్యవాదాలని మీరు ఖచ్చితత్వం, శ్రద్ధతో అందమైన ఆలయాన్ని నిర్మించడం భారత దేశానికి గొప్ప ఘనతను సాధించిందన్నారు. మోడీతో జరిగిన భేటీలో విదేశాంగమంత్రి జైశంకర్, కార్యదర్శి విక్రమం మిస్రీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, అమెరికాలో భారత రాయబారి వినయ్‌మోమణ్ క్వాత్రాలు ఉన్నారు. భేటీ అనంతరం ప్రధాని ఇచ్చిన విందుకు జెడివాన్స్ దంపతులు హాజరయ్యారు. ప్రధాని నివాసానికి వచ్చిన వాన్స్ కుటుంబాన్ని ప్రధానిమోడీ సాదరంగా ఆహ్వానించి తోడ్కొనివెళ్లారు. అనంతరం అక్కడినుంచి జయపురకు వెళ్తారని విదేశాంగశాఖ ప్రకటించింది. విలాసవంతమైన రాంభాగ్‌ప్యాలెస్ హోటల్‌లో బసచేస్తారు. అబర్‌కోట సందర్శన అనంతరం ఇంటర్నేషనల్ సెంటర్‌లో ప్రసంగిస్తారు. ట్రంప్ హయాంలో భారత్, అమెరికా విస్తృత సంబంధాలపై మంగళవారం జరిగే సదస్సులో ఉపన్యసిస్తారు. 23న వాన్స్‌కుటుంబంతోకలిసి ఆగ్రాకు వచ్చి తాజ్‌మహల్, భారతీయ కళలకు సంబంధించినశిల్పాగ్రామ్‌ను సందర్శిస్తారు. తిరిగి 24న జయపురకువెళ్లే వాన్స్ అక్కడినుంచే అమెరికా బయలుదేరి వెళతారు.

# వేదికగా ఎపి

>> ప్రజల మద్దతు, సహకారం, సమిష్టి కృషితో ఆ కలను నిజం చేస్తానన్నారు. సమాజంలో అసమానతలు పోవాలని పేదధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గాలని సిఎం వివరించారు. ప్రజాసేవ చేసేందుకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చిన తెలుగు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో తెలుగువారు ఉన్నారని వారంతా మార్గదర్శి బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రానికి ఎంత రెవెన్యూ వస్తే అంత మొత్తాన్ని సంక్షేమానికి ఖర్చు చేయొచ్చనని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు."ఎక్స్" వేదికగానే సిఎం చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కీలక సమాచారాన్ని వెల్లడించారు.ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని స్పష్టం చేసారు. సూపర్ సిక్స్ పథకాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.రాబోయే రోజుల్లో ఎక్కువ మూలధన వ్యయం చేస్తామన్నారు. ఆదాయం మార్గాలను అన్వేషిస్తామన్నారు. మళ్లీ అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేస్తామని అన్నారు. మూడుసార్లు సిఎంగా ఉన్నప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడు వస్తున్నాయి. ఇప్పటికీ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కంట్రోల్‌లోకి రాలేదు. ఆర్థిక వ్యవస్థ మరింత దారి తప్పకుండా గాడిన పెడతామని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. కేంద్రం ఆదుకోబట్టే కొంతమేరకు ముందుకెళ్తున్నాం. అమరావతి, పోలవరం పనులు సాగుతున్నాయి. స్టీల్ ప్లాంట్‌కు నిధులు ఇచ్చారు అని ముఖ్యమంత్రి తెలిపారు. సుదీర్ఘమైన కసరత్తు చేసి రాష్ట్ర భవిష్యత్తు కోసం స్వర్ణాంధ్ర 2047 విజన్ ను సిద్ధం చేశాం. అప్పటికి వృద్ధి రేటు 15 శాతం నమోదైతే తలసరి ఆదాయం 45,787 డాలర్లకు చేరుతుందన్నారు. ఎపికి 15 శాతం పైగా గ్రోత్ రేట్ సాధిస్తేనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలు నెరవేరతాయి. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం. తొలి 100 రోజుల్లోనే అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్న విషయం గమనించాలన్నారు. 204పైగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేసి రూ.5లకే పేదలకు భోజనం పెడుతున్నాం. మెగా డిఎస్సీని ప్రకటించాం. రాష్ట్రాభివృద్ధికోసం ఉచిత ఇసుక, క్లీన్ ఎనర్జీ, నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎమ్ఎస్ఎంఈ పాలసీలను ప్రకటించాం. ఉద్యోగులకు సమయానికి పెన్షన్లు, జీతాలు అందిస్తున్నాం. రాష్ట్ర సొంత ఆదాయం 2018-19కి 17.10 శాతం ఉంటే 2022-23కి 9.80 శాతానికి పడిపోయింది. ప్రభుత్వ అప్పులు 16.5 శాతం పెరిగాయి. రెవెన్యూ లోటు 2018-19 మధ్య 13.4 శాతం ఉంటే 2022- 23కి 16.2కు పెరిగింది. కార్పొరేషన్ల ద్వారా కూడా అప్పులు చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు మళ్లించారు. గత ప్రభుత్వం పెట్టిన పాత బకాయిలు రూ.22,252 కోట్లు విడుదల చేశాం. ఇంకా చెల్లించాల్సినవి చాలా ఉన్నాయి. 10 నెలల కాలంలో ప్రత్యేక దృష్టి పెట్టి రూ.6,35,568 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం. దీని ద్వారా 4,10,125 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎన్నికల ముందు మేము చెప్పిన 20 లక్షల ఉద్యోగాల కోసం కసరత్తు చేస్తున్నామన్నారు.గూగుల్ వంటి ప్రముఖ సంస్థల రాకతో 10 లక్షల కోట్ల వరకూ పెట్టుబడులు వస్తాయి. అన్ని వ్యవస్థలను పునరుద్ధరించి పరుగులు పెట్టించేలా కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. స్కూళ్లు తెరిచే నాటికి తల్లికి వందనం పథకం అమలు చేసేలా ప్రణాళికలు చేపట్టారు. ఎటువంటి జాప్యం లేకుండా కార్పొరేట్ వైద్యం అందేలా హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుపై బడ్జెట్ లో ప్రస్తావించారు. ఈ ఏడాదిలోనే 25 లక్షలతో ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా పథకం అమలు చేయనున్నామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవను కొనసాగిస్తూనే ఆరోగ్య బీమా పథకం అమలు చేస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 7 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. టిడ్కో ద్వారా 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం నిమిత్తం ఎస్సీలకు అదనంగా 50 వేలు, ఎస్టీలకు అదనంగా 75 వేలు ఇవ్వనున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు అందించే సాయాన్ని 10వేల నుంచి 20 వేలకు ప్రభుత్వం పెంచింది. దీపం 2.0 కింద నిధుల కేటాయించారు. ఆదరణ పథకం పునఃప్రారంభించిన కూటమి ప్రభుత్వం, నిధులు కేటాయింపునకు కట్టుబడి ఉందని తెలిపింది.మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం కోసం రూ.4,332 కోట్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖకు రూ.1,228 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,506 కోట్లు, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమానికి రూ.19,264 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.18,847 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.13,862 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.6,318 కోట్లు, జలవనరుల శాఖకు రూ.18,019 కోట్లు, పరిశ్రమలు, వాణిజ్యశాఖకు రూ.3,156కోట్లు, ఇంధనశాఖకు రూ.13,600కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.8,785 కోట్లు, యువజన పర్యాటక, సాంస్కృతిక శాఖకు రూ.469 కోట్లు గృహ మంత్రిత్వశాఖకు రూ.8,570 కోట్లు, తెలుగు భాష అభివృద్ధి, ప్రచారం కోసం రూ.10 కోట్లు, మద్యం, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రం కోసం నవోదయ 2.0 కార్యక్రమానికి రూ.10 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ.6,300 కోట్లు, పోలవరం కోసం రూ.6,705 కోట్లు, జల్‌జీవన్ మిషన్ కోసం రూ.2800 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

# పదవ తరగతి పరీక్ష ఫలితాలు

>> 1వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించింది. ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6,19,275 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంగ్లిష్ మీడియంలో 5,64,064 మంది, తెలుగు మీడియంలో 51,069 మంది పరీక్షలు రాశారు. ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 6,49,884 మంది విద్యార్థులు ఫీజుకట్టారు. కానీ వారిలో 6,19,275 మంది పరీక్షలు రాశారు. ఈ పదో తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాల మూల్యాంకనం మొత్తం 26 జిల్లాల్లో ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమై.. ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింది. ఇక మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసే ప్రక్రియ కూడా ముగిసింది. దీంతో ఫలితాల విడుదలకు ప్రభుత్వ రంగం సిద్ధం చేసింది.

## హైకోర్టుకు బదలీ

>> చేసింది. తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఈ ప్రక్రియపూర్తయింది. బదిలీ అయిన న్యాయమూర్తులు త్వరలో తమ కొత్త బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు హేమంత్ చందన్ గౌడ్‌ను మద్రాస్ హైకోర్టుకు, కృష్ణన్ నటరాజన్‌ను కేరళకు, సంజయ్‌గౌడ్‌ను గుజరాత్‌కు, దీక్షిత్ శ్రీకృష్ణ శ్రీపాద్‌ను ఒడిశా హైకోర్టుకు బదిలీ చేశారు.

## 'సిట్' అదుపులో కసిరెడ్డి

>>మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కసిరెడ్డి కొద్ది రోజుల క్రితం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. న్యాయస్థానం దీనిపై విచారణ చేపట్టింది. మధ్యంతర రక్షణ కల్పించాలంటూ రాజ్ కసిరెడ్డి తరఫు న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అందుకు అంగీక రించలేదు. ఈ కేసులో తదుపరి విచార ణను వారానికి వాయిదా వేసింది. మంగళవారం తాను విచారణకు హాజరవుతానంటూ కసిరెడ్డి ఆడియో విడుదల చేశారు.

## వారం - వర్జ్యం

తేది : 22-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.నవమి సా.6.07
శ్రవణ మ.12.39
వర్జ్యం సా.4.33-6.07
దు.ఉ.8.19-9.09, రా.11.27-12.17
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** శ్రమతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. దైవదర్శనాలు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు.

**కర్కాటకం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వస్తులాభం.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో పాల్గొంటారు.

**కన్య :** ఋణ బాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**తుల :** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సోదరుల కలయిక.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగులకు బదలీలు వుంటాయి.

**ధనుస్సు:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. సోదరుల నుండి ధనలాభం.

**కుంభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి సహాయసహకారాలు అందిస్తారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మంత్రుల సమీక్ష

>> గతంలో చిలకలూరిపేట,విశాఖపట్నంలలో ప్రధాని పర్యటన సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ప్రధాని సభను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు.ఈసమావేశంలో ప్రభుత్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ టెంటటివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం సమీపంలోని హెలీప్యాడ్ కు చేరుకుని అక్కడ నుండి రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక వైపున గల ప్రధాన వేదిక వద్దకు చేరుకుంటారని తెలిపారు. ఈకార్యమానికి సంబంధించి విధులు కేటాయించిన అధికారులు వారి టీంలతో కలిసి ఆయా పనులు సక్రమంగా జరిగేలా చూసుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు ఇతర ఏవిధమైన సమస్యలున్నా నోడలు అధికారి వీరపాండ్యన్‌తో సమన్వయం చేసుకుని వాటిని పరిష్కరించుకోవాలని చెప్పారు.ప్రధానమంత్రి కార్యక్రమాల పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాని పర్యటన ఏర్పాట్లను వివరిస్తూ టెంటటివివ్ కార్యక్రమం ప్రకారం మే 2వ తేది మధ్యాహ్నం 3గం.లకు ప్రధాన మంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారని వివరించారు. తదుపరి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయం వద్ద గల హెలీప్యాడ్‌కు 3.20గం.లకు చేరుకుంటారని తెలిపారు. అనంతరం అక్కడ నుండి ప్రధాన వేదిక వరకు సుమారు 1.2 కి.మీల పొడవునా రోడ్డు షో నిర్వహిస్తారని వివరించారు. రోడ్డుషోలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.అంతేగాక సాంస్కృతిక బృందాల ప్రదర్శన ద్వారా స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు.3.35గం.లకు సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన అమరావతి ఫెవిలియన్ కు చేరుకుంటారని తదుపరి 3.45గం.లకు కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని వివరించారు.

సాయంత్రం 5గం.ల ప్రాంతంలో ప్రధాని హెలీప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని విమానంలో బయలుదేరి వెళతారని అన్నారు. మొత్తం మీద సుమారు రెండు గంటలపాటు సాగే ప్రధాని పర్యటనను విజయ వంతంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.ప్రధాని పర్యటనకు సంబంధించి 10 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ తాగునీరు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.వివిఐపిలకు కరకట్ట, సీడ్ యాక్సిస్ రోడ్లను ప్రత్యేకంగా కేటాయించడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక సామాన్య ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకునేందుకు వీలుగా విజయవాడ నుండి మరో రెండు రూట్లు, గుంటూరు నుండి నాలుగు రూట్లను, మరికొన్ని తాత్కాలిక రూట్లను కూడా ట్రాఫిక్ కు అంతరాయాలు లేని విధంగా తీర్చిదిద్దనున్నట్టు పేర్కొన్నారు.ఆయా రోడ్లన్నీ పాట్ హోల్ ఫ్రీ రోడ్లుగా తీర్చి దిద్దాలని ఆర్ అండ్బి అధికారులకు సూచించారు. ఆయా రోడ్లపై గల వివిధ బాటిల్ నెక్స్‌ను సరి చేయాలని చెప్పారు.
వివిధ జిల్లాల నుండి సభకు తీసుకువచ్చే వారందరికీ అల్పాహారం,తాగునీరు, మజ్జిగ,పండ్లు,భోజనం వంటివి పంపిణీ చేయాలని సంబంధిత ఇన్‌ఛార్జ్‌లకు సూచించారు. ఈ విషయంలో రాజీ పడవద్దని ఎక్కడా ఫిర్యాదులు రాకుండా చుసుకోవాల న్నారు. ఈనెల 29 సాయంత్రానికి మొత్తం ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని ఆయా అధికారులకు చెప్పారు.30వ తేదీన రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పిజి రిహార్సల్స్ ఉంటాయని తెలిపారు. ఏర్పాట్లకు సంబంధించి ఆయా అధికారులకు కేటాయించిన పనులను వారి బృందాలతో సక్రమంగా జరిగేలా చూసుకోవాలని ప్రతి రోజు పర్యటించి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని చెప్పారు. అంతేగాక ఏర్పాట్లకు సంబంధించి ప్రతి రోజు సా.4గం.లకు డైలీ నివేదికను సమర్పించాలని వీరపాండ్యన్ చెప్పారు. ఈసమావేశంలో జిఎడి ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, సిఆర్డిఏ కమీషనర్ కె.కన్నబాబు,అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ మదుసూధన్ రెడ్డి, ఎన్టిఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు లక్ష్మిష, బాలాజీ, నాగలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సోమవారం వేసవి కార్యాచారణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న ఢిల్లీ సిఎం రేఖా గుప్త

# ధరణి పరిరక్షణ సమష్టి బాధ్యత

>> మానవాళిని కాపాడుకునే దిశగా ప్రతి ఏడాదీ ఏప్రిల్ 22ను 'ప్రపంచ ధరిత్రీ దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. పారిశ్రామిక ప్రగతితో ఏర్పడుతున్న వాయు కాలుష్యాన్ని 'ప్రగతి వాసన' గా భావిస్తున్న తరుణంలో 1970 నుంచి వరల్డ్ ఎర్త్ డే పేరిట పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ వ్యాప్తంగా సమిష్టి చైతన్య కార్యక్రమాలు మొదలయ్యాయి.
ఈ ఏడాది ప్రపంచ ధరిత్రీ దినోత్సవానికి మన శక్తిమన గ్రహం అన్న ఇతివృత్తాన్ని ఎంపిక చేశారు. పునరుత్పాదక వనరుల ద్వారా 2030 నాటికి విద్యుదుత్పాదనను మూడు రెట్లు పెంచే లక్ష్యం వైపు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాల్ని ముమ్మరం చేయడం పట్ల దృష్టి సారించేందుకు ఈ విషయాన్ని ఎంపిక చేశారు. కేవలం నేటి సుఖం కోసమే ఆరాటపడకుండా, రేపటి మనుగడ కోసం సుస్థిరాభివృద్ధి విధానాలపై దృష్టి పెట్టి ధరణి మాత మనుగడతో పాటు మానవాళి ఉనికిని కాపాడుకునేందుకు తగు చైతన్యంతో ప్రజలు, ప్రభుత్వాలు దూర దృష్టితో పనిచేయాలి. ఈ దిశగా ఈ ఏడాది ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా సమిష్టిగా సంకల్పించాలని కోరుతున్నాను. ..ధరణి మాత ఆరోగ్యాన్ని రక్షించుకుందాంమానవాళి ఉనికిని కాపాడుకుందామన్నారు.

## గొల్లపూడి పంచాయతీకి
# జాతీయ అవార్డు

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డుల్లో రాష్ట్రంలోని విజయవాడ నగర శివార్లులోని గొల్లపూడి గ్రామ పంచాయతీకి అవార్డు లభించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఆత్మ నిర్భర్ పంచాయతీ కేటగిరిలో ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి గ్రామ పంచాయతీ మూడవ స్థానం సాధించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆశాఖ పేర్కొంది.
సొంత ఆదాయ వనరులు పెంపొందించుకున్న పంచాయతీలకు ఇచ్చే ఈ అవార్డును గొల్లపూడి గ్రామ పంచాయతీ దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీన పంచాయతీ రాజ్ దివస్ సందర్భంగా బీహార్ రాష్ట్రంలోని మధుబనిలో జరిగే జాతీయ స్థాయి వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోడీ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

# పోప్ ఫ్రాన్సిస్ ఇక లేరు

>> అందించారు. శరణార్థుల పాదాలు కడిగిన పోప్ తరచూ సామాజిక అంశాలపై కూడా ఆయన వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థులకు పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావించేవారు. తదుపరి పోప్‌ను రహస్య ఓటింగ్ ద్వారా కార్డినల్స్ కాలేజ్ ఎన్నుకోనుంది. వాస్తవానికి పోప్ ఈ ఏడాది భారత్‌లో పర్యటించాల్సి ఉంది. కాథలిక్ చర్చి జూబ్లీ ఇయర్ వేడుకల కోసం ఆయన భారత్‌కు రావాల్సి ఉంది. గతేడాది డిసెంబర్‌లో కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ఆయన్ను ఆహ్వానించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతినిధి బృందం స్వయంగా ఆయన్ను కలిసింది. అయితే పోప్ అనారోగ్యం కారణంగా ఆ షెడ్యూల్ వాయిదా పడుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆయన కన్నుమూశారు. తన మరణానికి కొద్దిగంటలముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో 35వేలమందిని ఉద్దేశించి ఆయన ప్రపంచ శాంతికోసంసందేశం ఇచ్చారు. బ్రదర్స్ అండ్ సిస్టర్స్ హ్యాపీ ఈస్టర్ అని పోప్ స్వయంగా చెప్పారు. తర్వాత ఆయన సందేశాన్ని ఆర్చిబిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో మయన్మార్‌లలో శాంతినెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిసారు. పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. అస్వస్థతకు గురయిన తర్వాత ప్రజల్లోకి రావడం ఈస్టర్ సందేశంతోనే. ప్రత్యేక వాహనంలోప్రజలమధ్యనుంచి ఆయన ప్రయాణిస్తూ వెళ్లారు. మధ్యలో ఆగి పసికందులను చిన్నారులను ఆశీర్వదించారు.

# లక్షదాటిన బంగారం

>> సాయంత్రం 5.30 గంటలకు 24 క్యారెట్ల పసిడి రూ.1,00,016కి చేరింది. తదనంతరం కొంతమేర దిగివచ్చి రూ.99,900వద్ద ట్రేడ్ అయింది. ముందురోజు ముగింపుధరతోపోలిస్తే సుమారు రెండువేలు పెరిగింది. ఈ ఏడాది ఇప్పటివరకూ పసిడిధర సుమారు రూ.20వేలకుపైనే పెరిగింది. డిసెంబరు 31న సుమారు రూ.79వేలు ఉన్న పసిడిధరలు గడచిన మూడున్నర నెలల్లో 26 శాతం మేర పెరిగాయి. వెండికూడా కిలో మళ్లీ లక్షరూపాయలకు చేరువగా ఉంది. ఒకసారి ఇప్పటికే లక్ష మార్కును దాటిన వెండి ప్రస్తుతం రూ.99,299వద్ద ట్రేడ్ అవుతోంది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసిఎక్స్‌లో కూడా పదిగ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కుదాటింది. జూన్‌నెల డెలివరీ కాంట్రాక్టుల్లో పదిగ్రాముల పసిడి ఒక్కరోజులోనే రూ.1621మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,875వద్ద గరిష్టాన్ని తాకింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాలమధ్య వాణిజ్యపరంగా సయోధ్య కుదిరేంతవరకూ పసిడిధరల్లో ఇదేపరిస్థితి కొనసాగుతుందని నిపుణులు అంచనాలువేస్తున్నారు.

# జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్

>> సంచారం వుండడంతో పాటు వారి స్థావరం వుందనే సమాచారంతో తెల్లవారుజాము నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాలకు తోడుగా స్థానిక పోలీసులు కూంబింగ్ చేబట్టారు. ఈ సందర్భంగా ఇరువైపుల కాల్పులు జరిగా యని డిజిపి అనురాగ్ గుప్తా తెలిపారు. కాల్పుల తరువాత ఎనిమిది మంది నక్సలైట్లు మరణించారని, వీరి మృతదేహాలను స్వాధీనం చేసుకుని స్థానిక ఆసుపత్రికి తర లించామని డిజిపి తెలిపారు. ఘటనా స్థలంలో ఒక ఎకె 47 తుపాకి, మరో ఎస్ఎల్ఆర్ తుపాకి, మూడు ఇన్సాస్ తుపాకులు, కొంత పేలుడు సామాగ్రి,, మావోయిస్టుల సాహిత్యం లభ్యమయ్యిందని ఆయన వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పోలీసుల తరపున ఎలాంటి నష్టం జరగలేదని ఆయన తెలిపారు. ఎదురు కాల్పులు జరిగిన ప్రాంతంలో మరికొందరు నక్సలైట్లుగా గాయపడినట్లు భావిస్తున్నామని, ఆ ప్రాంతంలో గాలింపు జరుగుతోందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో మావోయిస్టు అగ్రనేత పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ప్రయాగ్ మాంజి అలియాస్ వివేక్ కూడా వున్నారని, ఆయనపై కోటి రూపాయల రివార్డు వుందని డిజిపి అనురాగ్ గుప్తా తెలిపారు. వివేక్‌తో పాటు జోనల్ కమిటీ సభ్యుడు అరవింద్ యాదవ్ అలియాస్ అవినాష్, సాహెబ్రాం మాంజి అలియాస్ రాహుల్, మహేష్ మాంజి అలియాస్ మోటా తాలు రాంజి, గంగారాం మాంజిలు మృతుల్లో వున్నారని డిజిపి తెలిపారు. వివేక్‌పై కోటి రూపాయల రివార్డు వుండగా అరవింద్ యాదవ్‌పై 25 లక్షల రూపాయలు సాహెబ్రాంపై పది లక్షల రూపాయల రివార్డు వుందని డిజిపి తెలిపారు. జార్ఖండ్‌లో నక్సల్ ప్రభావం పెద్దగా లేదని, అయితే కొన్ని ప్రాంతాల్లో వారి ఉనికి వుందని, వీరిని వచ్చే వర్షాకాలం లోపు ఏరివేస్తామని ఆయన మీడియాకు వెల్లడించారు. నక్సల్స్ ఏరివేతకు కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర సాయుధ బలగాలు నిరంతరం కూంబింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఝార్ఖండ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ నక్స లైట్లు ఆయుధాలను వీడి వెంటనే లొంగి పోవాలని పిలుపునిచ్చారు. నక్సలైట్ల ఏరివేత నిరంతరాయంగా కొనసాగుతుందని, వచ్చే ఏడాది మార్చినాటికి నక్సల్స్ విముక్త భారత్‌ను సాధించి తీరుతామని ఆయన తెలిపారు.

3RD VJA.qxd:22-04Pg3exHMNWJQERPCT.qxd 01/01/01 10:14 AM Page 1



## పోప్ ఫ్రాన్సిస్ మరణం బాధించింది - సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** పోప్ ఫ్రాన్సిస్ మరణం తనను ఎంతో బాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. అధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారని, శాంతి సందేశం ఇచ్చారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరుపున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాడ సానుభూతి ప్రకటించారు.

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ కూడా వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతి దూతగా పోప్ ఫ్రాన్సిస్ మరణం కేథలిక్ సమాజానికి తీరని నష్టమని వారు తమ ప్రకటనల్లో పేర్కొన్నారు. ఆయన ఉన్నంతకాలం శాంతి సామరస్యం కోసం పరితపించారని పేర్కొన్నారు.

## బిసి అభ్యర్థులకు 24నుంచి ఆన్ లైన్ ద్వారా డిఎస్సీకి ఉచిత కోచింగ్ - బిసి సంక్షేమ మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:**డీఎస్సీకి హాజరయ్యే బీసీ అభ్యర్థులకు ఈ నెల 24నుంచి ఆన్ లైన్ ద్వారా ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. ఆ మేరకు ఆమె కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా శిక్షణ పొందిన వారే అత్యధిక ఉపాధ్యాయ పోస్టులు బీసీ అభ్యర్థులే సాధించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి సవిత వెల్లడించారు. అందుకనుగుణంగా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 26 జిల్లా కేంద్రాల్లోనూ ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కేంద్రాల ద్వారా 5,200 మందికి ఉచిత డీఎస్సీ శిక్షణతో పాటు కోచింగ్ సమయంలో నెలకు రూ.1500ల స్టయిఫండ్, మెటీరియల్ కోసం మరో అదనంగా రూ.1000 అందజేసినట్లు తెలిపారు. గృహిణులు, ఇతర అభ్యర్థుల కోసం ఆన్ లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ నెల 24 నుంచి ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ నిర్వహణా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ, ఇచ్చిన మాటకు కట్టుడుతూ సీఎం చంద్రబాబునాయుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముక్తకంఠంతో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ కు, మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు రూపొదిద్దుకుంటుందని భావిస్తూ, టీడీపీ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. రాష్ట్ర చరిత్రలో 1.80 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వాలకే చెందుతాయన్నారు. ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ విధానం తెచ్చింది కూడా సీఎం చంద్రబాబునాయుడుదేనని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మెగా డీఎస్సీ నిర్వహణకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సీఎం చంద్రబాబుకు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు డీఎస్సీ అభ్యర్థులతో కలిసి సవిత ధన్యవాదాలు తెలిపారు.

## తిరుమల సమాచారం

### వేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషం - సుప్రీంకోర్టు విశ్రాంత సిజె జస్టిస్ ఎన్వి రమణ



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వి రమణ తెలిపారు. స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం ఉదయం ఆయన కుటుంబంతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి మొక్కిన జస్టిస్ రమణ కుటుంబసభ్యులుఅనంతరం ఆనందనిలయంలో స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### శ్రీవారి సేవలో సినీప్రముఖులు



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని పలువురు సినీ ప్రముఖులు దర్శించు కున్నారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో సినీసంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపీచంద్‌మలినేని, నటుడు అశ్విన్‌బాబు ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి దర్శనంతోఆనందంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## కృత్రిమ మేధ వినియోగంలో ప్రజాసంబంధాల పాత్ర కీలకం

### - జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవంలో వక్తలు



**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** కృత్రిమ మేధస్సు(ఎఐ)ను బాధ్యతాయుతంగా వినియోగించడంలో ప్రజా సంబంధాలు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ఆచార్య పివి నరసయ్య తెలిపారు. కృత్రిమ మేధ కేవలం కంప్యూటర్ సబ్జెక్టు కాదని, ఇది అన్ని సబ్జెక్టులను ప్రభావితం చేయగలదని అన్నారు. ఏఐని నైతికంగా, పారదర్శకంగా వినియోగిస్తే మంచి ఫలితాలను రాబట్టుకోవచ్చని తెలిపారు. ఏఐని భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రజా సంబందాల నిపుణులు, సాంకేతిక నిపుణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ కామర్స్, మేనేజ్‌మెంట్ కంప్యూటర్స్ కళాశాలలో జాతీయ ప్రజాసంబంధాల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్య పి.వెంకటకృష్ణ, తిరుపతి ఐఐటి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యేటూరు కాలిదాస్ కీలక ఉపన్యాసంలో ప్రజలకు ఏఐ సాంకేతిక వినియోగం గురించి అవగాహన కల్పించడం ప్రజాసంబంధాల ప్రధాన లక్ష్యమన్నారు. సామాజిక మాద్యమాలు, వార్తావ్యాసాలు, సమావేశాలు ,అవగాహన కార్యక్రమాల ద్వారా ఏఐ సానుకూల ఉపయోగాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ జిఎస్ ప్రసాద్, కార్యదర్శి డి.చంద్రమోహన్, కంప్యూటర్‌సైన్స్ కళాశాల విభాగాధిపతి ఆచార్య జి.అంజన్‌బాబు, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య పి.రఘునాథరెడ్డి, కామర్స్ హెచ్‌ఒడి ఆచార్య కె.జయచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జివి రమేశ్‌బాబు, పిఆర్ఎస్ఐ కోశాధికారి కె.మధుసూదన్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, మాజీ ఛైర్‌పర్సన్లు డాక్టర్ పి.స్వరాజ్యలక్ష్మి, ఆచార్య డాక్టర్ త్రిపురసుందరి ,రమ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కె సంతోష్‌రావు పదవీకాలం పొడిగింపు



**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటేడ్ (ఎపి ఎస్ పి డిసిఎల్) ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సిఎండి) కె సంతోష్‌రావు పదవి కాలాన్ని రాష్ట్రప్రభుత్వం పొడిగించింది. ఇందుకు సంబంధించిన జివో 29ను ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ విడుదల చేశారు. సంతోష్‌రావును 2023 ఏప్రిల్ 14వ తేదిన ఎస్‌పిడిసిఎల్ సిఎండిగా నియమించిన ప్రభుత్వం రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని వెల్లడించింది.

ఇప్పుడు కొత్తవారిని నియమించే వరకు ఆయననే కొనసాగిస్తూ తాజాగా ఉత్తర్వులు విడుదల చేసింది.

## ఎస్వీగోశాలలో గోవులకు చల్లచల్లదనం - జనసేననేత కూలర్లు విరాళం



**తిరుపతి,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీగోశాలలో గోవుల మరణాలపై ఆరోపణలు ,రగడ చోటుచేసుకున్న తరుణంలో గోమాతలకు చల్లదనం కోసం ఎయిర్‌కూలర్లను తిరుపతి జిల్లా జనసేననేత కిరణ్‌రాయల్ విరాళంగా అందించారు. జనసేనాని పవన్‌కల్యాణ్‌కు గోమాతలంటే ఎంతో ఇష్టమని, గోమాతలపై ఉన్న విశ్వాసంతో గోమాతలకు కూలర్లు ఇవ్వడం జరిగిందని కిరణ్ తెలిపారు. గోశాలకు నాలుగు ఎయిర్ కూలర్లు అందించినట్లు చెప్పారు. గోవుల సంరక్షణకు మంచి మనసుతో దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నేతలు ఆకేపాటి సుభాషిణి, హేమకుమార్, మనోజ్,వంశీ, లోకేశ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. జనసేననేత కిరణ్‌రాయల్ మంచి మనసును గోసంరక్షకులు అభినందించారు.

## శ్రీవారి ఆశీస్సులతో శుభాలు కలగాలి



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు సంతోషంగా ఉందని, స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలు సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కెవిఎస్ శ్రీనివాసరాజు తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## భక్తులకు మరింత నాణ్యమైన ఆహారం

### - ఆహారపదార్థాల పరీక్షకు మరో పరిశోధనశాల



**తిరుమల,ఏప్రిల్ 21ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుమూలల నుండి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు తిరుమలలోని హోటళ్ళు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో ఆహారపదార్థాలు ఏ మేరకు నాణ్యత, పరిశుభ్రత పాటిస్తున్నారనే పరీక్షలకు మరో ఆహార పదార్థాల తనిఖీ పరిశోధన శాలను కేంద్రం మంజూరు చేసింది. ఫుడ్‌సేఫ్టీల్యాబ్‌లు ఏర్పాటులో భాగంగా తిరుమలకు మరొకటి మంజూరు చేసింది. ఈ పరిశోధనశాలలో టిటిడికి సరఫరా అవుతున్న పలు రకాల ఆహారపదార్థాలు, పప్పులు, నూనెలు వంటివాటి నాణ్యతను పరీక్షించే వెసలుబాటు కలుగుతుంది. ఇప్పటికే తిరుమలలోని ఫ్లోర్‌మిల్ ఆవరణలో ఆహారపదార్థాల పరీక్షించే ల్యాబ్ ఉంది. దీన్ని ఇప్పటికే ఆధునీకరించి అత్యాధునిక పరికరాలు అమర్చారు. దేవునికి మూడుపూటలా తయారుచేసే నైవేద్యప్రసాదాలను ఈ ల్యాబ్‌లో పరిశోధకులు తనిఖీ చేసి ఆ తరువాత స్వామివారికి నివేదిస్తున్నారు. ఇప్పుడు తిరుమల ప్రాధాన్యత దృష్ట్యా మరో సేఫ్టీఫుడ్‌ల్యాబ్ మంజూరైంది. తిరుమలేశుని అన్నప్రసాదాల తయారీలో వినియోగించే పదార్థాల నాణ్యత పరీక్షించేందుకు అధునాతన యంత్రాలు తిరుమలకు రానున్నాయి. అంతేగాక అన్నప్రసాదాలు తయారుచేసే వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో కూడా పదార్థాలు తనిఖీ చేసే అవకాశం కలుగుతుంది. తిరుమలలో అవసరమైన మరో అధునాతన పరిశోధనశాల ఏర్పాటు కానుంది. ఇప్పటికే ఉన్న ల్యాబ్‌లో గ్యాస్‌క్రొమోటోగ్రఫీ, హైఫర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ రెండు యంత్రాల ద్వారా నెయ్యిలోని నాణ్యత, నిత్యావసరసరుకుల నాణ్యత ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఉన్నాయోలేదో తెలిసిపోతుంది.

## డిఎస్సీ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని పెంచండి

### సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి లేఖ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** డీఎస్సీ అభ్యర్థుల గరిష్ట వయో పరిమితిని పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ హర్షణీయమని పేర్కొన్నారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యర్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వయోపరిమితిపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని, వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలని కోరారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం రామకృష్ణ లేఖ రాశారు. 2018 తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వలేదని రామకృష్ణ తన లేఖలో గుర్తుచేశారు. అప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలామంది అభ్యర్థులు వేచి చూస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో అభ్యర్థుల్లో వయోపరిమితిపై ఆందోళన నెలకొందని చెప్పారు. వయోపరిమితి 47 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని, మెగా డీఎస్సీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని రామకృష్ణ తన లేఖలో సీఎం చంద్రబాబును కోరారు.

## గ్రావెల్ మాఫియాపై ఎమ్మెల్యే ఉక్కు పాదం



**వింజమూరు (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో జరుగుతున్న గ్రావెల్ మాఫియా పై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉక్కుపాదం మోపారు. సోమవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంది మార్బలంతో కాకుండా తన వాహనంలో నల్లగొండ్ల గ్రామంలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకం ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ ఒక హిటాచి వాహనంలో పెద్ద మొత్తంలో గ్రావెల్‌లోడ్‌తో టిప్పర్లు ట్రాక్టర్లకు గ్రావెల్ ఎత్తుతున్న దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. గ్రావెల్ మాఫియా ఇంతలా బరితెగించి గ్రావెల్ తరలిస్తుంటే అధికారులు చూస్తూ ఉండిపోవడం ఎమ్మెల్యేకు ఆశ్చర్యం కలిగించింది. వెంటనే సంబంధిత మండల స్థాయి అధికారులను నల్లగొండ్ల గ్రామానికి రావాలని ఆదేశించడంతో అధికారులు హుటాహుటీన నల్లగొండ గ్రామానికి చేరుకున్నారు. ఇంత పెద్ద మొత్తంలో గ్రావెల్ తరలిస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులుపై ఆగ్రహించాడు ఎమ్మెల్యే గ్రావెల్ తరలింపు వద్దకు వచ్చాడన్న సమాచారం తెలియడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘటన స్థలం వద్దకు వచ్చారు. గ్రామస్తులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధికారులు తీరుపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతంలో అక్రమ గ్రావెల్ మాఫియా గురించి తెలియజేసినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు భోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, అన్నపరెడ్డి శ్రీనివాసులురెడ్డి భరోసా అండదండలతో ఇంత పెద్ద ఎత్తున నల్లగొండ్లలో గ్రావెల్ తరలించుకుని పోతున్నారని పంచాయతీ పాలకవర్గం తమది కాబట్టి పంచాయతీ తీర్మాన్ని ఇస్తాం గ్రావెల్ తగిలించుకో వెళ్లండి భరోసా ఇవ్వడంతో గ్రావెల్ మాఫీ ఇష్టానుసారం రెచ్చిపోతున్నారని ప్రతి నెల ఒప్పందం మేరకు అధికారులకు స్థానిక నేతలకు ముడుపులు పోవడంతో నోరు మెదపడం లేదన్నారు. గ్రామస్తులు ఆవేదనను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నల్లగొండ గ్రామస్తులు తమ గ్రామ సమీపంలో నల్లకొండ వద్ద పెద్ద పెద్ద వాహనాలతో గ్రావెల్ లోడుతూ డంపింగ్ చేస్తూ టిప్పర్లతో బయటకు తరలిస్తున్నారని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెప్పడంతో తానే స్వయంగా రంగంలోకి దిగాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గం ప్రజలు ఎంతో పెద్ద మనసుతో మొన్నటి ఎన్నికల్లో నన్ను దీవించి గెలిపించడం జరిగిందన్నారు. తాను కూడా ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో ప్రభుత్వం దృష్టికి అనేక ప్రతిపాదన సిద్దం చేసుకుని తాను ప్రయత్నిస్తుంటే, ఈ ప్రాంతంలో కొంత మంది పనికట్టుకుని తన పేరు చెప్పుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని, తాను ఎప్పుడు కూడా అక్రమార్కులకు తావు ఇవ్వనని ఎవరైనా తన పేరు చెప్పుకొని అక్రమాలకు పాల్పడితే అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తూ అక్రమార్కులకు తావిస్తే చర్యలు తప్పని అధికారులు హెచ్చరించారు. నియోజకవర్గ సంపదను అక్రమంగా దోచుకోవాలని దుర్మార్గులను విడిచి పెట్టేది లేదని మన విలువైన సంపదను మనమే కాపాడుకోవానలి అధికారులు సూచించారు. అక్రమ గ్రావెల్ రవాణా మాఫియా పై రెవెన్యూ ఇరిగేషన్ పోలీసు అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు.

## ప్రధాన మంత్రి పర్యటనపై మంత్రుల సమావేశం

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని మోడి పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఎపి మంత్రులు తెలిపారు. ఎపి పర్యటనలో భాగంగా. మే 2 న సాయంత్రం 3 గంటలకు ప్రధాని మోడి గన్నవరానికి చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ .. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోడి గంటపాటు ఉంటారని చెప్పారు. నాదెండ్ల మనోహర్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని అన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పున్ణప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివఅద్ధి పనులను మోడి ప్రారంభిస్తారని తెలిపారు.

## పురుగు మందుతాగి మహిళ మృతి

**బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీలోని కడనూతల గ్రామానికి చెందిన చల్లా. ఆదినారాయణమ్మ (55)ఈనెల 19 వ తేదీన పురుగుమందు తాగి చికిత్స పొందుతూ చెన్నైలోని ప్రైవేట్ వైద్యశాల లో ఆదివారం మృతి చెందిందని తెలిపారు.

## ఉత్తమ పనితీరులో ఐఎఎస్‌కు జాతీయ అవార్డు




**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి అవార్డు (2023)ను తిశిళీజుళినిుళీ సెక్రటరీ వి. ప్రసన్న వెంకటేష్ నేడు డిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో అందుకున్నారు. సోమవారం నాడు 17వ సివిల్ సర్వీస్ డే సందర్భంగా డిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో వికసిత్ భారత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధాని హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిపాలనలో ఉత్తమ పనితీరు కనబరిచిన పలువురు ఐఏయస్ అధికారులకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం అందించింది. ప్రసన్న వెంకటేష్ జనవరి 2022 నుంచి జూలై 2024 వరకు ఏలూరు జిల్లాకు తొలి కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ఆయన ప్రజలకు అందించిన సేవలకు గాను ప్రభుత్వం ఈ అవార్డు అందజేసింది. ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ పథకాలను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల అమలులో భాగంగా మహిళలు, బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేశారు. సామాజిక బాధ్యత చొరవ కింద జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో అక్షజ్ఞ అనే కార్యక్రమంతో గర్భిణీలు, ప్రసూతి మహిళల ఆరోగ్య సంరక్షణకు పాటుపడ్డారు. ఈ విధంగా, జిల్లాలో సుపరిపాలన అందించడం ద్వారా ఈ అవార్డుకు ఎంపికైన దేశంలోని 10 జిల్లాల కలెక్టర్లలో ప్రసన్న వెంకటేష్ ఒకరు. ఈ సందర్భంగా అవార్డు అందజేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రసన్న వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిచేందుకు ప్రజా సేవకునిగా శక్తివంచన లేకుండా తాను కృషి చేస్తానన్నారు.

## కోనలో బ్రహ్మోత్సవాలపై సమీక్షా సమావేశం



**రాపూరు (నెల్లూరు), ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మే నెల 8వ తేది నుండి జరగనున్న శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబందించి చేయవలసిన ఏర్పాట్లపై మంగళవారం పెంచలకోనలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ పొరెడ్డి శ్రీనివాసుల రెడ్డి సోమవారం తెలిపారు. కోనలోని కాకతీయ కమ్మ సత్రంలో నెల్లూరు ఆర్‌డిఓ ఆధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో బ్రహ్మోత్సవాలలో భక్తుల సౌకర్యార్థం వివిధ శాఖల ద్వారా చేపట్టవలసిన వివిద అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తారని వివిద శాఖలకు చెందిన అధికారులు తప్పని సరిగా ఈ సమీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల ఆందోళన

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త ప్రతినిధి:** అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ పర్యటనను వ్యతిరేకిస్తూ ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు ఆధ్వరనఓయంలో సోమవారం నిరసనలు నిర్వహించారు. విజయవాడ, విశాఖ. గుంటూరు, శ్రీకాకుళం, తిరుపతి తదితర నగరాల్లోను రైతులు నిరసన ప్రదర్శనలు చేసారు. పలు మండల కేంద్రాల్లో తహస్సీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో ఈ అంశంపై తహస్సీల్దార్లుకు వినతి పత్రాలు అందజేసారు. అమెరికా ప్రభుత్వం తరపున దేశంలో ఒప్పందాలు చేసుకునేందుకు వస్తున్న అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ పర్యటనకు భారత రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, బి ప్రభాకర్ రెడ్డి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు మీడియాకు విడుదల చేసిన సమాచార పత్రంలో పేర్కొన్నారు. భారత వ్యవసాయ ఉత్పత్తులపై విపరీతంగా సుంకాలు విధిస్తూ, దేశ వ్యవసాయ రంగాన్ని అమెరికా దెబ్బతీస్తుందన్నారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే నిరసనల్లో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జనసేన జనవాణి కార్యక్రమం పనివేళల్లో మార్పు

### సోమవారం నుంచి గురువారం వరకు కార్యక్రమం

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన జనవాణి కార్యక్రమం పని వేళల్లో మార్పు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేసింది. సోమవారం నుంచి గురువారం వరకు కార్యక్రమంనిర్వహిస్తారు. ఆయా రోజుల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. కొనసాగింపుగా సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జనవాణి జరుగుతుంది. సోమవారం నుంచే కొత్త పని వేళలు అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటనలో వివరించారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ గతంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఖిజనవాణిఖి కార్యక్రమాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వివిధ సమస్యలతో ఈ జనవాణికి వచ్చిన ప్రజలను స్వయంగా జనసేనాని కలిసి వారి నుంచి వినతి పత్రాలను తీసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు.

వార్త

ఒక వ్యక్తి పేదరికాన్ని సంపదను నిర్ణయించేది ఆ వ్యక్తి సంపాదన గాని, ఆదాయం కాని కాదు. అతడి ఆదాయానికీ, ఖర్చుకీ మధ్యలో ఉన్న వ్యత్యాసం అంతే.

-డేనియల్

# తుది సందేశం


సర్వ మానవ సౌభ్రాతృత్వం కోసం తుది శ్వాస వరకు తపించిన వాటికన్ సిటీ అధినేత, రోమన్ కాథలిక్ చర్చి అధిపతి ,క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్(88) ఇక లేరనే సమాచారాన్ని క్రైస్తవ లోకం జీర్ణించుకోలేకపోతోంది. ఇటలీ కాలమాన ప్రకారం సోమవారం ఉదయం 7.35 నిమిషాలకు తన నివాసం కాసా శాంటా మార్తాలో తుదిశ్వాస విడిచారు. ఆయన చాలా కాలంగా న్యూమోనియా వంటి శ్వాస కోశ , కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. గత నెలలో 38రోజుల పాటు చికిత్స పొందారు. మొన్న ఆదివారం ఏప్రిల్ 20 ఈస్టర్ సందర్భంగా ప్రపంచ శాంతి కోరుతూ తన తుదిసందేశాన్ని ప్రపంచానికందించి ఆయన మనోభావాలను వ్యక్తీకరించారు. 2013 మార్చి 13 న 266 పోప్ గా ఆయన వాటికన్ ప్రస్థానం ప్రారంభమయ్యింది. 1936 డిసెంబర్ 13న పోప్ అర్జెంటీనాలో జన్మించారు. అమెరికన్ ఖండంలోని దక్షిణా అమెరికా నుంచి పోప్ పదవిని చేపట్టిన తొలి పోప్ ఆయనే. ఆయన అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. తొలుత ఆయన పాస్టర్‌గా అర్జెంటీనాలో సేవలందించారు వాటికన్ సిటీలోని కాథలిక్ చర్చి ప్రధాన పాలకునిగా ఎన్నో కీలక సంస్కరణలు చేపట్టారు. మానవ హక్కులను, మత సామరస్యాన్ని ప్రోత్సహించారు. ఆదిలోనే వాటికన్ సిటీ రాజ్యాంగాన్ని సంస్కరించారు. న్యాయ వ్యవస్థలోనూ సంస్కరణలు చేశారు. ఇందులో బిషప్‌లు, కార్డినల్‌లపై వచ్చే నేరాభియోగాలపై వాటికన్ సిటీ కోర్టు మాత్రమే విచారించే అవకాశం ఉంటుంది. బిషప్‌ల అధికారాలను పెంచారు. పర్యావరణ, సామాజికాంశాలపై కూడా విశేషంగానే స్పందించారు. ఇతర సమాజం కన్నా ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగారు. లైంగిక సమానత్వాన్ని ప్రోత్సహించినా ,హోమోసెక్సువల్ వివాహాలను మన్నించలేదు. గర్భవిచ్ఛిత్తిని అమానుషంగా వర్ణించారు. సహజ కాన్పు కాని దానిని తల్లీ బిడ్డల గౌరవానికి భంగం కలిగించే చర్యగా అభివర్ణించారు. మహిళల, పిల్లల గౌరవాన్ని భంగం పరిచేదని భావించారు. ఫోర్నోగ్రఫిని కూడా పోప్ తప్పుపట్టిన అంశాలలో ఒకటి. వైవాహిక సంబంధం బలంగా ఉండాలంటే భార్యాభర్తల పట్ల ఒకరికొకరికి ప్రేమానురాగాలు పెంపొందించుకోవాల్సి ఉంటుందని పోప్ తరచు చెప్పేవారు. ఆదివారం నాడు ఏప్రిల్ 20, 2025న, సెయింట్ పీటర్స్ స్క్వేర్లో ఈస్టర్ వేడు కల సందర్భంగా పోప్ ఫ్రాన్సిస్ తన సాంప్రదాయ ఉర్బి ఎట్ ఓర్బి సందేశాన్ని అందించారు. తీవ్రమైన న్యుమోనియా నుండి కోలుకుంటున్నప్పటికీ ఉత్సాహంతో1 తన సందేశాన్ని వినిపించి, సర్వ సమాజాన్ని ఆనందపరిచారు. కార్డినల్ ఏంజెలో కోమాస్ట్రీకి మాస్ను అప్పగించినప్పుడు ఆయన ప్రసంగంలో ఈ సందేశం చదివి వినిపించారు. తన ప్రసంగంలో, పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచ సంఘీభావం, వలసదారులను ప్రేరేపించే అణగారిన వర్గాల పట్ల కరుణ చూపారు. ఉక్రెయిన్, గాజా, సూడాన్ ప్రాంతాలలో కొనసాగుతున్న సంఘర్షణలకు శాంతియుత పరిష్కారాల కోసం పిలుపునిచ్చారు. వాటికన్ వెబ్సైట్ ఈసారి ఆయన ప్రసంగ పాఠాన్ని తెలుగులో ఉర్బి ఎట్ ఓర్బి సందేశాన్ని అందించ లేదు. కానీ ఈస్టర్ ప్రసంగ పాఠాన్ని బయటకు వదలడం విశేషం. 2020 లో పోప్ ఫ్రాన్సిస్ ఫ్రాన్సిస్కో అనే డాక్యుమెంటరీలో హోమో సెక్సువల్ వ్యక్తులు ఒకే కుటుంబం చెందిన వారేనని వివరించారు. ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదమైనవని విశ్వాసులు చెబుతుంటారు. అక్రమ వలస దారులను బలవంతంగా పంపివేస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలను కూడా పోప్ తప్పు పట్టారు. పోప్ జీవిత చరిత్ర గురించి 2018 లోనే వెండర్స్ అనే నిర్మాత పోప్ జీవిత చరిత్ర, విశేషాలపై ఒక డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించారు. వాటికన్ సిటీ ప్రోత్సాహం వల్లనే ఈచిత్ర నిర్మాణం జరిగింది. 2018లో కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. అమెరికాలో కూడా అదే ఏడాది ప్రదర్శితమైంది. విశేషమేమిటంటే ఆ చిత్రంలో పోప్ ప్రత్యక్షంగా వీక్షకులకు ప్రపంచ శాంతి ఆవశ్యకతపై తన సందేశ వాక్యాలను అందించారు. ప్రపంచగడ్డపై మత సామర్థ్యాన్ని, ప్రపంచ శాంతిని కాంక్షించే మహనీయుని కోల్పోవడంవిచారకరం. అనారోగ్యం కూడా సంప్రదాయ బద్ధమైన ఆనవాయితీలను వదలలేదు. ఆనవాయితీ ప్రకా రం కోలుకున్న వెంటనే సెయింట్ మేరీ మేజర్ బాసిలికా వెళ్ళి ప్రార్థనలు చేసి వచ్చారు. దైవ నిర్ణయమే అయినట్లు ప్రపంచ శాంతి సందేశాన్ని లోకానికి ఇచ్చిన పిమ్మట ఆయన పరలోకగతుడయ్యాడు. చాలాకాలంగా ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు కారణంగా పోప్ మాట్లాడేందుకు ఇబ్బంది పడడం తెలిసిందే. కాగా విశ్వమానవాళికి దివ్య సందేశం ఇచ్చే సమయంలో. గతంలో వలెనే ఉత్సాహంగా ఉన్నారని వాటికన్ నుంచి తెలిసిన సమా చారం. అమెరికా క్యూబా సంబంధాల పునరుద్ధరణలో కీలకపాత్ర పోషించారు. పేదల సంక్షేమం, వలసదారుల హక్కులు, లింగ సమానత్వం వంటి అనేకానేక సామాజిక అంశాలలో దృఢనిశ్చయంతో వ్యవహరించిన మానవతావాది. కోట్లాది మంది ప్రజల హృదయాలలో పోప్ ఫ్రాన్సిస్ కరుణ, వినయం ఆధ్యాత్మిక ధైర్యానికి ప్రతీకగా నిలి చిపోతారని ప్రధాని నరేంద్ర మోదీ సంతాప సందేశంలోపేర్కొన్నారు. ఏసుక్రీస్తు ఆశయాలకు అనుగుణంగా తన జీవితాన్ని మలచుకున్న ధన్యజీవి అని ఆయనకీర్తించారు. సమగ్రాభివృద్ధి పట్ల పోప్‌కి ఉన్న నిబద్ధత ప్రశంసనీయ మని శ్లాఘించారు. భారత ప్రజల పట్ల పోప్ చూపిన ప్రేమ ఆప్యాయతలు మరువలేనివని ప్రధాని విశ్లేషించారు.

అవినీతికి పాల్పడే వారికి చివరకు మిగిలేది ఆవేదనా, అవమానాలే.



సి.సిమ్మన్స్

తక్కువ తెలుసుకోవడం, ఎక్కువ అర్థం చేసుకోవడం మనకు చాలా అవసరం.



మహాత్మాగాంధీ

## ప్రజావాక్కు



### వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీవిరమణ తర్వాత సిజిహెచ్ఎస్ పథకం ఆరోగ్య సేవలకు ఉంది. ఈ పథకంతోఉన్న ప్రస్తుత కేంద్రాలకు అద్దెభవనాలు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వాలు వారి సొంతఅవసరాలకు వీరుఅద్దెకు ఇవ్వలేరు. వైద్యులకు, లబ్ధిదారులకు తగినవసతి, కనీస సదుపాయాలులేవు. వైద్యుల కొరత, పరిమిత కేంద్రాల వల్ల ఎన్నో సమస్యలు ఉన్నాయి. రాష్ట్ర కేంద్రాల్లో ఉన్నత అధికార్లు ఉండడంవల్ల వైద్యాధికారుల సమస్యలు వారికి విన్నవించడం తప్ప నిర్ణయం, మార్పులు చేసే అవకాశం లేదు. సంక్షేమ సంఘంవీటిని కేంద్ర అధికారులకు చేసిన ఫిర్యాదులు ఎన్నో అపరిష్కృతంగా ఉన్నాయి. ఈ పథకం ఉచితంకాదు. దీన్ని ఏ ఇతరపథకాలతో అనుసంధానం మేలు కాదని, దీన్నే అభివృద్ధి చేస్తే ఎంతో మేలు.

-బొల్లోజు మేఘానాథం, విశాఖపట్నం

### వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేయుచున్న ఉద్యోగ వికలాంగులకు ప్రమోషన్‌లలో 5 శాతం రిజర్వేషన్ తప్పనిసరిగా కల్పించాలి. ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు వర్తించే చట్టాలను ఉద్యోగ వికలాంగులకు కూడా తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రమోషన్ ట్రాన్స్‌ఫర్‌లలో ఉద్యోగ వికలాంగులకు వారికి అనుకూలమైన ప్రదేశాలలో విధులు నిర్వహించే విధంగా తగిన ప్రాధాన్యత కల్పించాలి. ఉద్యోగ వికలాంగులకు ఇంటి నుండి ఆఫీసుకు వెళ్లే సమయంలో ఆర్టీసీబస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. రాష్ట్రంలోని ప్రతి విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగ వికలాంగులకు 5శాతం రిజర్వేషన్ అమలు చేయడం వలన ఎంతోమంది మేలు కలుగుతుంది.

- డాక్టర్. ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### మాతృభాషలోనే విద్యాబోధన జరగాలి

ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులు మానసిక వత్తిడికి లోనవుతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 350(ఎ) ప్రకారం మాతృభాషలోనే విద్యాబోధన చేయాలి. ఓపెన్ బుక్ పరీక్షలు నిర్వహించాలి. పుస్తకాల బరువుతగ్గించాలి. ఫీజులను నియంత్రించాలి. శారీరక శిక్షలు నిషేధించాలి. విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశంలోనే విద్యాబోధన చేయాలి. ఆట పాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- పి. నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

### అవగాహన సదస్సులు నిర్వహించాలి

తెలంగాణలో ధరణి రద్దుచేసి భూభారతి యాప్‌లో భూ సమస్య లేకుండా చేసుకోటానికి ప్రజలలో రైతులకు అవగాహనా సదస్సులునిర్వహించడం, అధికారులను నాయకులను అభినందనలు కానీ గతంలో రైతు భూమిని వారస్వతంగా రావాల్సినది తండ్రి చనిపోయిన తర్వాత కుమారులకు ఖర్చు లేకుండా ఆటోమెటిగా అయేది నేడు ధరణిలో భూభారతి లోనైనా స్లాట్ బుక్ చేసుకుంటే మాత్రమే అవుతాది. ఇది ప్రభుత్వానికి మీసేవలకు ఆదాయమార్గం అవుతుంది. దేశంలో సైనికుడే రక్షకుడు రైతే లేకపోతే తిండి దొరుకాదు అందుకే రైతే రాజు కానీ రాయితీతో రైతుకూలీలకు తండ్రితదనంతరం భూమిని వారస్వతంగా స్లాట్ బుకింగ్ లేకుండా తక్షణమే కుమారుని పేరున భూమిని పట్టా చేసియివ్వాలి. రైతులను ప్రభుత్వ కార్యాలయం మీసేవ చుట్టూ ప్రదక్షిణ చేయకుండా చేసియివ్వాలి. భూమిని క్రయ విక్రయానికి స్లాట్‌బుకింగ్ పెట్టుకొని ప్రభుత్వానికి ఆదాయ వనరులను పెంచుకోవచ్చు.

- సింగు. లక్ష్మీనారాయణ జయశంకర్ భూపాలపల్లి

### తెలుగు మాధ్యమంలో వైద్యకోర్సులు

తెలుగు మాధ్యమాల్లో బైపీసీ ఎంపీసీ పూర్తి చేసి ఇంజినీరింగ్ లోవైద్యచదువుల్లో ఇంగ్లీషు మాధ్యమం చదివేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించిన ఈ తెలుగులోనే ఇంజనీరింగ్ మెడికల్ కోర్సులు అందించాలన్న ఈ ప్రయత్నం నిజంగా చాలా కొనియాడ తగినది. ఆయా సబ్జెక్టుల లో మంచి పట్టువున్న విద్యార్థులు ఆంగ్లంలో రాయడం అర్థం చేసుకోవడం కొంత ఇబ్బంది పడుతున్నారన్నది సత్యం. ఏదిఏమైనా కాన్సెప్ట్ అర్థం చేసుకోవడం ముందు ముఖ్యం. అది తెలుగులో బోధించుట ద్వారా కొంత కాన్సెప్ట్ మీద పట్టు వచ్చి ఏ విధమైన మెలికలు గల ప్రశ్న వేసినా రాయగల సమర్థత విద్యార్థికి వస్తుంది. ఎన్నో మంచి యూ ట్యూబ్ చానెల్స్ ఈ పాఠ్యంశాలలను తెలుగులో బోధించుట చూస్తున్నాం.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### పాల కల్తీని అరికట్టాలి

దేశవ్యాప్తంగా లభించే పాలలో 68 శాతం కల్తీవేనని ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ సర్వే తేల్చి చెప్పింది. కల్తీ పాల వల్ల క్యాన్సర్లు, జీర్ణాశయ సమస్యలు, పిల్లల్లో వినికిడి, దృష్టిలోపాలు తలెత్తవచ్చు. అధికారులు పాలకల్తీని అరికట్టాలి.

-ఎన్.సాయిరాజు, నల్గొండజిల్లా

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)

# వంతెన నిర్మాణాలకి ముహూర్తమెప్పుడు?

**ఏటా వర్షాకాలం ముగియగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు. తీరా మళ్లీ వర్షాకాలం వచ్చేనాటికి కూడా ప్రారంభం కావడంలేదు. ఇలా రాష్ట్రాల్లో ఆర్అండ్ బి పరిధిలోని ముందుకు సాగని నిర్మాణాలతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్, వరంగల్ మహానగరంలోని మురికి నీరువ్యవస్థను ప్రణాళికా బద్ధంగా ముందు చూపుతో సకాలంలో పూర్తిచేయాలి. నగర వాసులకు చినుకుపడితే వండుటాకులా విలవిలాడుతున్న పరిస్థితుల నుండి కాపాడవలసిన బాధ్యత ఉంది. అలాగే రాష్ట్రంలోని గతంలో పిచ్చుక గూళ్లల్లా కూలి, కొట్టుకపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలోపే నాణ్యతతో యుద్ధ ప్రాతిపదిక మీద ప్రభుత్వం చేపట్టాలి. మొన్నటి అకాల భారీ వర్షాల బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.**



మేకిరి దామోదర్

మన రాష్ట్రంలో ఈ నెల 3న, మొన్న ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లతో గంటన్నరపాటు దంచి కొట్టిన భారీ వర్షంతో జనజీవనం అతలాకుతలమై స్తంభించింది. పండ్ల తోటలు, యాసంగి వరి, మొక్కజొన్న పంటలు రైతులు నష్టపోయారు. వేరు వేరు ఘటనల్లో మరణాలు సంభవించాయి. పలుచోట్ల చెట్లు కూలాయి, విద్యుత్ స్తంభాలు విరిగాయి. రోడ్లు వరద నీటితో వాగులను తలపించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మురుగు నీరు కాల్వలు పొంగిపొర్లి ఇళ్లల్లోకి చేరింది. ఇప్పుడే ఇలా ఉంటే? రాబోయే వానాకాలాన్ని తలుచుకుంటే భయమేస్తోంది!. ఇది హెచ్చరికగా భావించి 'చేతులు కాలాక ఆకులు పట్టుకొని' లాభంలేదు. ప్రభుత్వం, అధికారయంత్రం ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలి. వర్షాల వల్ల నగరంలోని నాలల్లో వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లడానికి ఏటా వర్షాకాలానికి ముందే పూడికతీత పనులు చేపడుతుంటారు. వీటి కోసం జీహెచ్ఎంసీ అధికారులు ఏటా సగటున రూ. 50 కోట్లు వెచ్చిస్తారు. ఈ లెక్కన గత నాలుగేళ్లలో 200 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంతగా ప్రజాధనం వ్యయవుతున్నా!. వరద నీటి వ్యవస్థ ఆశించినట్లుగా మెరుగుపడడం లేదు. నగరంలో ఈ నెల 3న, మొన్న సాయంత్రం కురిసిన వర్షంతో తేటతెల్లమైంది. ఆ రోజు ఏకంగా 151ప్రాంతాల్లో రోడ్లపై వరద ఉధృతంగా పారింది. బైక్‌లు, కార్లు కొట్టుకుపోయాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ప్రయాణికులు మెట్రో స్టేషన్ల వైపు పరుగులు పెట్టారు. అర్ధరాత్రి దాటింతే వరకు ఇళ్లల్లోకి చేరుకోలేకపోయారు. ఈ పాటి వర్షానికే ఈ దుస్థితి తలెత్తడం ఆందోళన కలిగిస్తుంది. వర్షం కురిస్తే జీహెచ్ఎంసీ అధికారులకు పండుగే. రోడ్లపై నిలిచే నీటిని తోడేందుకు అత్యవసర పేరిట పనులు చేపట్టి, తర్వాత బిల్లులు సమర్పిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ పనులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పైగా నీటి వివరాలను బహిర్గతం చేయడం లేదు. పూడికతీత పనుల్లోనూ ఇష్టానుసారంగా నిధులు ఖర్చు (స్వాహా)చేస్తున్నారని, తోడిన మట్టిని ఎక్కువ చేసి చూపిస్తున్నట్లు విమర్శలున్నాయి. తప్పుడు లెక్కలు ఉంటున్నాయని ప్రజాప్రతిని సైతం ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ఏడాది కోసం ఇటీవల 203 పూడికతీత పనుల టెండర్లను పిలిచారు. వాటిలో 9 టెండర్ల దశలో, 97 మొబిలైజేషన్ దశలో, 97 కొనసాగుతున్న దశలో ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తేదారులు దాదాపు 30శాతం తక్కువ ధరలకు ఈటెండర్లను దక్కించుకుంటున్నారంటే? ఇందులోని మతలబు అర్థం చేసుకోవచ్చు!. వరద పారేందుకు నాలాల సామర్థ్యం సరిపోవడం లేదనీ దీనికి పరిష్కారంగా భూగర్భంలో ట్యాంకులను నిర్మించాలని అధికారులు ప్రతిపాదించగా 2024-25 సంవత్సరానికిగాను రూ.15 కోట్లతో 22 పనులను మంజూరు చేశారు.



వర్షాల సమయంలో దిగువ ప్రాంతాలుముంపునకు గురికాకుండా నాలాల్లో ప్రవేశిస్తున్న వరద నీటిని ఈ భూగర్భ ట్యాంకులోకి మళ్లిస్తారు. వర్షం తగ్గాక మోటార్లతో ఎత్తి పోస్తారు. ఇలాంటివి ఖైరతాబాద్ వద్ద రూ. 3.08 కోట్లతో రెండింటిని,(4లక్ష లీటర్ల, 3లక్షల లీటర్ల సామర్థ్యం) నిర్మిస్తున్నారు. అలాగే పీవీఎన్ఆర్ ఫిల్లర్ 254, లంగర్ హౌస్, రాంనగర్, ఇమేజ్ ఆసుపత్రి, రంగమహల్, కేపిహెచ్‌బీ, సచివాలయం, శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, రాజేంద్ర నగర్లోనూ నిర్మిస్తున్నారు. ఇవి ఏమేరకు ఫలితాలు ఇస్తాయనేది తేలాల్సి ఉంది. అయితే భూగర్భ ట్యాంకుల నిర్మాణం కంటే, నాలాల సామర్థ్యం పెంచుకోవడం మంచిదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మన మహానగరంలో నాలాల పొడవు 1,300 కి.మీ భూగర్భంలో ఉన్నవి 910 కి.మీ ఓపెన్ నాలాలు 390 కి.మీ హైదరాబాద్ మహానగరంతో పాటు, వరంగల్ లాంటి చోట మురునీటి నాలాల పరిస్థితి ఇలానే దుర్భరంగా ఉంది?. మన రాష్ట్రంలో రోడ్ల భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు వంతెనలనిర్మాణ పనులు కొన్నేళ్లుగా అర్థాంతరంగా ఆగిపోయాయి. గతేడాది, అంతకు ముందు కురిసిన భారీ వర్షాలకు పలు వంతెనలు, రోడ్లు పిచ్చుక గూళ్లలా కొట్టుకుపోయాయి. వీటికి తాత్కాలిక మరమ్మతులు చేసివదిలేశారు. మళ్లీ భారీవర్షాలు కురిస్తే పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న వాటితోపాటు కొత్తగా నిర్మించాల్సిన హైలెవెల్ వంతెనలు 193 ఉన్నాయి. వీటిని పూర్తి చేసేందుకు రూ. 843 కోట్లకు పైగా అవసరమని అధికారులు గతంలో అంచనా వేశారు. కొన్నిచోట్ల టెండర్ల ప్రక్రియ పూర్తయిన బిల్లులు వస్తాయో లేదో అనిపనులు ప్రారంభించడానికి గుత్తేదారులు వెనకాడుతున్నారు. మరికొన్ని చోట్లపనులను ప్రారంభించినా బిల్లులు రాలేదని మధ్యలోనే వదిలేశారు. మరోవైపు ప్రస్తుతం నిర్మాణ సామాగ్రి ధరలు బాగా పెరిగాయి, ఎప్పుడో పిలిచిన టెండర్లధరలతో ఇప్పుడు పనులు చేయలేమంటూ గిట్టుబాటు కావడం లేదంటూ గుత్తేదారులు ఆసక్తి కనబరచడం లేదు. వంతెననిర్మాణం పూర్తికాక ఏటావర్షాకాలంలో వాగులు పొంగి పొర్లినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోయి స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వరదలు పోటెత్తినప్పుడు వాగుల్లో కొట్టుకుపోయి ప్రాణాలుపోయిన ఘటనలూ చోటు చేసుకున్నాయి. ఏటా వర్షాకాలం ముగియగానే పనులు మొదలు పెడతామని అధికారులు పేర్కొంటున్నారు. తీరా మళ్లీ వర్షాకాలం వచ్చేనాటికి కూడా ప్రారంభం కావడంలేదు. ఇలా రాష్ట్రాల్లో ఆర్అండ్ బి పరిధిలోని ముందుకు సాగని నిర్మాణాలతో ఏటా వర్షాకాలంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. దరిమిలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైదరాబాద్, వరంగల్ మహానగరంలోని మురికి నీరువ్యవస్థను ప్రణాళికా బద్ధంగా ముందు చూపుతో సకాలంలో పూర్తిచేయాలి. నగర వాసులకు చినుకుపడితే పండుటాకుల విలవిలాడుతున్న పరిస్థితుల నుండి కాపాడవలసిన బాధ్యత ఉంది. అలాగే రాష్ట్రంలోని గతంలో పిచ్చుక గూళ్లల్లా కూలి, కొట్టుకపోయిన రోడ్లు, వంతెనల నిర్మాణాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి వర్షాకాలంలోపే నాణ్యతతో యుద్ధ ప్రాతిపదిక మీద ప్రభుత్వం చేపట్టాలి. మొన్నటి అకాల భారీవర్షాల బీభత్సాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులుచేపట్టాల్సిన అవసరం ఉంది. ●

# పరువు హత్యలా! దురహంకార నిదర్శనమా?

జి. అజయ్ కుమార్

వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారన్న కారణంతో కొన్ని చోట్ల కూతుర్ని, మరికొన్ని చోట్ల ఆమె ప్రేమించినవాడిని బలితీసుకుంటున్న అమానుష దృశ్యాలు మన చుట్టూ నిత్యకృత్యంలా మారాయి. చిన్నతనం నుంచి ఎంతో అల్లారు ముద్దగా పెంచిన తమ పిల్లలని ఎదిగిన తరువాత తన ఇష్టానుసారం నచ్చిన వాడిని ప్రేమించి పెళ్లి చూసుకోవడం నేరంగా చూస్తున్న కొంత మంది తల్లిదండ్రులు పరువు అనే భ్రమలో విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నారు. పరువు హత్యలు అనే ముసుగులో కన్న వారిని క్రూరంగా చంపుకుంటున్నారు. ఇది పరువు కోసం కాదు, కుల దురహంకారపు ఆకృత్యం. తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన పరువు హత్యల పేరిట జరుగుతున్న దురహంకార హత్యలు - ఇది ప్రేమ మీద మాత్రమే దాడి కాదు, కులం, మతం, మనిషి మనుగడ మీద దాడి. మిర్యాలగూడలో ప్రణయ్, సూర్యాపేటలో కృష్ణ కేసులు మీడియా లోకానికి తెలిసినవే. కానీ ప్రతి రోజు ఇలాంటివి ఎన్నో సమాజంలో జరుగుతున్నాయి. అలాంటి వాటిల్లో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మావత్వానికి మాయని మచ్చగా, కుల, మతోన్మాదానికి పరాకాష్టగా మారాయి. అనంతపురం జిల్లాలో తండ్రి, తన కూతురు వేరే కులం వాడిని ప్రేమించిందనే కారణంతో దారుణంగా హత్య చేయడం, హయత్ నగర్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చెల్లెలు కులాంతర వివాహం చేసుకుందని నడిరోడ్డుపై తమ్ముడు నరికిచంపడం, చిత్తూరు జిల్లాలో ప్రేమించి మతాంతర వివాహం చేసుకున్న యువతి అనుమానాస్పద మృతి, ఇలాంటివి ఎన్నో ఇటీవల కాలంలో మానవ సంబంధాలను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రక్త సంబంధికులే రాక్షసుల్లా ప్రవర్తిస్తున్న సంఘటనలు నానాటికి పెరుగుతున్నాయి. వేరే కులం, వేరే మతం వారిని ప్రేమించారని కన్నపిల్లలని చంపడం పరువా? కాదు మానవత్వానికి మాయని మచ్చ, ఆటవిక క్రూరత్వానికి పరాకాష్ట. అది గౌరవం కాదు. అది ఓ క్రూరమైన అహంకారపు చీకటి కోణం, ఇలాంటి చర్యల వలన పరువు పెరగటం కాదు వున్న పరువు పోయి జీవితాంతం నేరస్థుడిగా మిగిలి కుటుంబాలకు క్షోభను మిగిలించడం తప్ప ఏమి ఉపయోగంఉండదు. వివాహం లేదా ప్రేమ సంబంధం కులాంతరంగా, మతాంతరంగా ఉంటే అది 'ఇంటి పరువు' 'కుటుంబ గౌరవానికి' భంగం అని భావించి కుటుంబ సభ్యులే హత్యకు దిగే పరిస్థితులు ఎదురవుతున్నాయి. యువత సాంప్రదాయాలుపాటించకుండా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించినా, స్వేచ్ఛగా జీవించాలనుకున్నా పెద్దలు దాన్ని సహించలేక ఘోర నిర్ణయాలు తీసుకునే పరిస్థితి. అమ్మాయి తనకు ఇష్టమైన వ్యక్తిని ప్రేమించడం, వివాహం చేసుకోవాలనుకోవడం వంటి విషయాలు కొన్ని కుటుంబాల్లో తట్టుకోలేరు. వారుతీసుకునే నిర్ణయాన్ని అవమానంగా' భావించి హత్యలు చేస్తున్నారు 'మీ ఇంటి పిల్ల పరువు తక్కువ పనిచేసింది?' అన్న మాటలు వింటే తట్టుకోలేమనే భయం. తాతలు, పినతండ్రులు, బంధువుల మాటలవల్ల కుటుంబ పెద్దల గౌరవాన్ని కాపాడుకోవాలనే మానసిక స్థితిలోహింసకు పాల్పడుతున్నారు. పెద్దలు, కుటుంబ సభ్యులు పిల్లలమానసిక స్థితిని, ప్రేమను, అభిప్రాయాలను ఆలోచనలను అర్థం చేసుకోలేకపోవడం. హత్యశిక్షార్హ నేరం. ఇలాంటి వాటికి తీవ్రమైన శిక్షలుంటాయి కానీ సమాజంలో మనుషుల ఆలోచనా ధోరణి మారనంత కాలం ఎన్నిచట్టాలు వున్నా ఉపయోగంలేదు. కుటుంబాలలో, పాఠశాలల్లో, గ్రామ స్థాయిలో ప్రేమ, సంబంధాలు, వివాహ స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కులపై అవగాహన కల్పించాలి. 'పరువు'అన్నది ప్రాణాల కంటే పెద్దదికాదని తెలియ చేయాలి. పరువు హత్యలకు ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. అతిత్వరగా విచారణలు జరిపి శిక్షలు అమలుచేయాలి. దోషులెవ్వరైనా క్షమించరాదని న్యాయవ్యవస్థ స్పష్టంగా చాటాలి. తల్లిదండ్రులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం. పిల్లలపై పట్టుకాదు, ప్రేమతో బంధం అవసరమని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లల అభిప్రాయాలను వినే పరిస్థితిని కల్పించాలి. ప్రేమ, వయసు, అర్థం చేసుకోవడం, సంయమనం అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలి. సంబంధాల్లోస్పష్టత, బాధ్యత అనే భావనలు నేర్పాలి. అమ్మాయిలకు స్వేచ్ఛ, విద్య, ఆత్మవిశ్వాసం ఇవ్వాలి. వారు తమ నిర్ణయాలు తీసుకునే ధైర్యాన్ని కలిగి ఉండాలి. కుల సంఘాలు, మతనాయకులు ప్రగతిశీలమైన సందేశాలు ఇచ్చేలా ఒత్తిడి తేవాలి. మతాల పేరుతో హింసను ప్రేరేపించే కార్యక్రమాలు నియంత్రించాలి. బాధితులను పరువు కోసం ప్రాణాలు తీసే సమాజం కన్నా ప్రేమ కోసం ప్రాణాలు కాపాడే సమాజమే అవసరం. కులం, మతం కంటే ముందు మనమంతా మనుషులం అని గుర్తుంచుకోవాలి. ●



# ధరిత్రీ రక్షణకు శపథం చేద్దాం

రామ కిష్టయ్య సంగన భట్ల

సమస్త జీవకోటి భారాన్ని మోసేది భూమి. పంచ భూతాలలో ఒకటిగా, భారతీయ సంస్కృతిలో భూమి భూదేవతగా భావించబడి, పూజింపబడడం కనిపిస్తుంది. భూమి పరిరక్షణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకోకపోయినా, కనీసం హాని కలిగించకుండా ఉంటే చాలు. ఇందుకోసం అవగాహన అవసరం. అటు పర్యావరణం, వాతావరణంతో పాటు ఇటు జీవన శైలిలోనూ మార్పులతో భూ పరిరక్షణపై అవగాహన కోసం కూడా ప్రత్యేక కార్యక్రమాలు అవసరమవుతున్నాయి. ఈ క్రమంలోంచి వచ్చిందే 'ప్రపంచ ధరిత్రి దినోత్సవం'. ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 22న 'ధరిత్రి దినోత్సవం' జరుపుకుంటున్నారు. 1962లో అమెరికన్ సెనెటర్ నెల్సన్‌కి వచ్చిన ఆలోచనకు ప్రతిరూపమే ఈ ధరిత్రీ దినోత్సవం. 1969 లో నెల్సన్ మన వాతావరణంలో జరిగే మార్పులనూ వివరిస్తూ మనం ఎంత జాగ్రత్తగా ఉండాలో మన వంతు ఏమి చెయ్యాలో అందరికీ తెలియ చెప్పడానికి ఒక రోజంటూ ఉంటే బాగుంటుందని అనుకున్నారు. వెంటనే తన ఆలోచనకు రూపకల్పన చేస్తూ తన మిత్రులకు ఒక వార్తాపత్రిక ద్వారా ప్రజలకూ ఈ ధరిత్రీ దినోత్సవం గూర్చి వివరించారు. 1970 ఏప్రిల్ 22న మొదటి ధరిత్రీ దినోత్సవం జరిగింది. ఆరోజు ఆ దేశంలోని ప్రజలంతా ధరిత్రిని రక్షించుకునేందుకు తమవంతు కృషి చేస్తామని ప్రమాణాలు చేసారు. ఇలా తొలుత అమెరికాలో ప్రారంభమైన ఈ ఉత్సవం ఆ తర్వాత ప్రపంచ వ్యాపితమైంది. వ్యవసాయం కోసం విచ్చలవిడిగా వాడుతున్న రసాయనాలు భూమిని నిస్సారంగా, నిర్జీవంగా మార్చేస్తున్నాయి. జీవం కోల్పోయిన నేలలో దిగుబడులూ నాసిగానే ఉంటాయి. దీర్ఘకాలంలో దిగుబడులు మరీ తగ్గిపోయి ఆహార సంక్షోభాలకు దారితీసే ముప్పు పొంచి ఉందని ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి ఆలివర్ డి షుట్టర్ గుర్తించారు. పర్యావరణ అనుకూల వ్యవసాయ విధానాల వైపు మళ్లడం తప్ప మరో మార్గం లేదని నివేదించారు. వ్యవసాయంలో రసాయనాలు వాడే విధానాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కీలకపాత్ర వహించింది అమెరికా. ధరిత్రి దినోత్సవం పేరిట పర్యావరణ పరిరక్షణ ఉద్యమం కూడా అమెరికాలో ప్రారంభం కావడం విశేషం. 50 ఏళ్ల క్రితం ఏప్రిల్ 22న గేలార్డ్ నెల్సన్ నేతృత్వంలో కాలుష్యకారక విధానాలకు నిరసనగా జనం ఉవ్వెత్తున ఉద్యమించారు. అప్పటి నుంచీ సుస్థిర అభివృద్ధి కోసం ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా 175కంటే ఎక్కువ దేశాల్లో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అనాలోచిత మానవ చర్యల వల్ల కలుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని నిలువరించాలన్న బృహత్తర లక్ష్యంతో ధరిత్రి దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రకృతి నియమాలకు విరుద్ధంగామనిషి




చేస్తున్న పనుల వల్ల భూగోళం అమితంగా వేడెక్కిపోతోంది. శిలాజ ఇంధనాలను విచ్చలవిడిగా వాడడం వల్ల వాయు కాలుష్యం పెచ్చు మీరుతోంది. పట్టణాలు, నగరాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలతో పర్యావరణ కాలుష్యం పెరిగిపోతోంది. వ్యవసాయంలో రసాయనాలు విచ్చలవిడిగా వాడుతూ పదికాలాల పాటు పదిలంగా చూసుకోవాల్సిన భూమిని నిస్సారంగా మార్చుతున్నాం. తరిగిపోయే వనరులకు బదులు, తరగని, పునర్వినియోగించుకోగల వనరుల ఆధారంగా జరిగే అభివృద్ధే సుస్థిరాభివృద్ధి. ఇదే ధరిత్రికి సుస్థిర భవిష్యత్తును చేకూరుస్తుంది. భూమి, నీరు వంటి మౌలిక వనరులను గరిష్ట సామర్థ్యంతో వినియోగించాలి. వినియోగ అనుకూల సామర్థ్యాన్ని పెంచాలి. దూరదృష్టితో తరగని, పునర్వినియోగించుకోగల వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా సౌరశక్తి వినియోగం అధికంగా జరగాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదలను కనీస స్థాయికి తగ్గించగలగాలి. అడవుల సంరక్షణ, పెంపకం, సుస్థిర యాజమాన్య పద్ధతులు, జీవవైవిధ్య సంరక్షణ జరగాలి. పర్యావరణాన్ని రక్షించటానికి ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు, వివిధ రకాలైన కాలుష్యాలను నియంత్రించటానికి, అదే విధంగా కాలుష్య దుష్ప్రభావాలను తగ్గించటానికి వివిధ చట్టాలను అమలు చేస్తున్నాయి. అదే విధంగా మన దేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలుష్య నివారణ చర్యలకై పలు చట్టాలను రూపొందించి అమలు జరుపుతున్నది. భారత ప్రభుత్వం 1981వ సంవత్సరంలో "వాయుకాలుష్య చట్టాన్ని ప్రవేశపెట్టింది. 1986వ సంవత్సరంలో "పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని కూడా అమలులోకి తెచ్చింది. పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బూడిద, విషవాయువులు వంటి వాటిని ఫిల్టర్లతో వడపోసి మాత్రమే వాతావరణంలోకి వదలాలి. ఇటువంటి పరిశ్రమలను, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, అణురియాక్టర్ల వంటి వాటిని జనుల నివాసాలకు దూరంగా కట్టాలి. రైళ్ల, వాహనాలు వంటి వాటికి ఉపయోగించే పెట్రోలు, డీజిల్ వంటి ఇంధనాలు కాకుండా జీవ ఇంధనాలు వాడేలా చూడాలి. దీనివలన ఎంతో వాయు కాలుష్యం తగ్గుతుంది. మొత్తం పరిశ్రమలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నాలుగు తరగతులుగా విభజించింది. ఆయా పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య కారకాలను అనుసరించి అత్యధిక కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఎరుపు వర్గంగాను, మధ్యస్తంగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను నారింజ వర్గంగాను, తక్కువ కాలుష్యాన్ని వెదజల్లే వాటిని ఆకుపచ్చ వర్గంగా, కాలుష్యానికి ఆస్కారమివ్వని వాటిని తెలుపువర్గంగా వర్గీకరించింది. తెలంగాణలోని పరిశ్రమలన్నింటినీ కాలుష్య నియంత్రణ మండలి క్రమబద్ధంగా పర్యవేక్షిస్తోంది. ఈ పరిశ్రమలు ఎటువంటి కాలుష్యాన్ని విడుదల చేయకుండా చూస్తూ, ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నది. అలాగే అడవులను, పర్యావరణాన్ని రక్షించేందుకు ఇతర చర్యలతోపాటు, అతి ముఖ్యమైన తెలంగాణకు హరితహారం అనే బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించి గత కొన్ని సంవత్సరాలుగా యుద్ధ ప్రాతిపదికపై కోట్లాది మొక్కలు నాటి పర్యావరణ సంరక్షణకు కృషి చేస్తున్నది. ప్రభుత్వాలు ఏదో చేయాలని మిన్నకుండి పోకుండా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ●

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 290 ఫిర్యాదులు

**గుంటూరు ,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి పిటీషన్ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని 290ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లను




జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కె ఖాజావలి అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి,డిపిఓ సాయికుమార్,డ్వామా పిడి శంకర్,స్టెప్ సీఈఓ చంద్రముని ప్రజల నుండి గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు.సమావేశంలో డ్వామా, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు శంకర్‌ప్రసాద్,డిపిఓ బి.వి.సాయి కుమార్,ఎస్ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, మార్కెటింగ్ శాఖ ఏడి రాజబాబు, వికలాంగుల శాఖ ఏడి సువార్త,డిఈవో సి.వి. రేణుకా,డిఎం అండ్ హెచ్ఓ విజయలక్ష్మీ, డిఎస్ఓ కోమలి పద్మ,తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలు కాపాడటంలో రాజీపడవద్దు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరుకార్పొరేషన్,ఏప్రిల్21,ప్రభాతవార్త :** గుంటూరు అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడటంలో రాజీ పడవద్దని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. అరండల్ పేట సీ.ఐ గా బాధ్యతలు స్వీకరించిన ఆరోగ్య రాజు సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... అరండల్ పేట పోలీస్ స్టేషన్ నియోజకవర్గానికే కీలకమని, కాబట్టి శాంతి భద్రతలు సమర్ధవంతముగా నిర్వహించాలని, ప్రజల భద్రతే ముఖ్యమని పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజల పట్ల సున్నితముగా ప్రవర్తించి, ఫ్రెండ్లీ పోలీస్ అనిపించుకోవాలని సూచించారు. ఆకతాయిలు, సంఘ విద్రోహుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు.



## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**విజయపురిసౌత్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంగటన మాచర్ల మండలం భైరవునిపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. భైరవునిపాడుకు చెందిన సిరికొండ హనుమంతరావు (38)కు 20 ఏళ్లక్రితం గుత్తికొండకు చెందిన సునీతతో వివాహమైంది. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో భార్య నెలక్రితం భర్త, పిల్లలను వదిలి గుత్తికొండలోని తల్లి ఇంటికి వెళ్లిపోయింది. గత వారం క్రితం హనుమంతరావు తన ముగ్గురు కుమార్తెలను తీసుకొని తన భార్య దగ్గరకు వెళ్లి ఇంటికి రావాలని అడిగాడు. భార్య సునీత అంగీకరించలేదు. దీంతో కలత చెందిన హనుమంతరావు సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్సై షేక్ మహమ్మద్ షఫీ తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించిన కలెక్టర్, ఎమ్మెల్యే

**నరసరావుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** నరసరావుపేటలో సోమవారం నియోజకవర్గ స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్నిసోమవారం జిల్లా కలెక్టర్ పి అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబులు నిర్వహించా రారు. మొత్తం 410 అర్జీలు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జీల పరిష్కారం కొరకు అన్ని శాఖల అధికారులు తగిన శ్రద్ధ చూపాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ ను ప్రజల చెంతకు తీసుకుని రావటం జరిగిందన్నారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అత్యధికంగా వచ్చే ఫిర్యాదులపై పదేపదే రిపీట్ కాకుండా వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలను ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ప్రజల చెంతకు వెళ్తుందన్నారు. సోమవారం ప్రభుత్వ అధికారులు గ్రీవెన్స్ ను నిర్వహిస్తుండగా ప్రతి బుధవారం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తాము నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తెలియజేశారు. అర్జీలను తమ సొంత సమస్యలుగా భావించి ప్రజా సమస్యలను అధికారులు శాశ్వత పరిష్కారాన్ని చూపడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా పాల్గొన్నారు.



## రాజకీయ ప్రయోజనాల కోసం విశ్వవిద్యాలయాలని వాడటం మంచిది కాదు

**-కురుమళ్ళ గంగాధర్,రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్,ఏబివిపి ఆంధ్రప్రదేశ్**

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో ఆదివేడుకలు ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాయి.వర్సిటీ అధికారుల చేతుల మీదుగా ఈ వేడుకలు జరగడం సరికాదని ఏబివిపి భావిస్తుంది.విశ్వవిద్యాలయాలు విద్యార్థుల యొక్క విద్యా,సాంస్కృతిక,క్రీడాభివృద్ధికి కేంద్ర బిందువులై ఉండాల్సిన చోట,రాజకీయ నాయకుల వ్యక్తిగత వేడుకలకు వేదికలుగా మారుతుండడం బాధాకరమన్నారు.విశ్వవిద్యాలయాల అధికారులు రాజకీయుల సానుభూతులై వారి నాయకుల జన్మదిన వేడుకలను యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించడం,వారి ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు,బ్యానర్లు ఏర్పాటు చేయడం ఎంతో బాధాకరమైన పరిణామం.విద్యార్థుల పైన రాజకీయ ప్రభావం చూపించేలా జరుగుతున్న ఈ ధోరణి యూనివర్సిటీల మనుగడకు ప్రశ్నార్థకం చేస్తుంది.రాజకీయ కార్యాలయాలుగా మార్చే కుట్రలను ఏబివిపి బహిరంగంగా తిరస్కరిస్తుంది.యూనివర్సిటీలు,అధికారులు మారాలి,విశ్వవిద్యాలయాలు రాజకీయ రహిత ప్రాంతాలుగా నిలవాలని.దీనిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని కోరారు.

## ఉత్సవ మూర్తులకు మకరతోరణం బహూకరణ

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** పట్టణంలోని తెలగపాలెంలో వేంచేసియున్న శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామాలయంలో ఉత్సవ మూర్తులకు నూతన మకర తోరణాన్ని తోట భాస్కర రావు దంపతులు బహూకరించారు. శ్రీరామనవమి పండుగ పూర్తయి 16రోజులు గడుస్తున్న నేపథ్యంలో ఈ మకర తోరణాన్ని బహూకరించినట్లు దాతలు చెప్పారు. మకరతోరణంతోపాటు వెండి తీర్థపాత్ర కూడా బహూకరంచినట్లు అర్చస్వామి చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు, దీవి శ్రీనివాసమూర్తి తెలిపారు. దాతలు అందజేసినవాటికి సంప్రోక్షణ నిర్వహించి ఉత్సవమూర్తులకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం శాశ్విత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు, కమిటి ఛైర్మన్ అల్లం సాంబశివరావు,, కార్యదర్శి శింగంశెట్టి శివశంకర్, అప్పికట్ల వెంకటేశ్వరరావు, చుండూరు హనుమయ్య తదితరులున్నారు.



## డిఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హర్షం

**పెదకూరపాడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** డిఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిందన్నారు. నోటిఫికేషన్ ద్వారా 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకునిగా చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌ల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. అదే విధంగా గరిష్ఠ వయో పరిమితిని రెండు సంవత్సరాలు పెంచడం జరిగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలియజేశారు.



# గుంటూరు వార్త

## మెరుగైన పారుశుద్ధ్య పనులు చేపట్టేలా పటిష్ట కార్యచరణ

**-కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని**

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్21,ప్రభాతవార్త :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మెరుగైన పారుశుధ్య పనులు చేపట్టేలా నగర కమిషనర్ నేతృత్వంలో పటిష్ట కార్యాచరణ మేరకు కృషి జరుగుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రజారోగ్య విభాగానికి అవసరమైన 6 ట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంచార్జి మేయర్ షేక్ సజీలా, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి రామాంజనేయులు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య పనుల్లో మెరుగుదల కోసం గతంలో ఉన్న 22 శానిటరీ డివిజన్లను పర్యవేక్షణ సౌలభ్యం కోసం కమిషనర్ 32 డివిజన్లుగా పెంచారన్నారు. ఆయా డివిజన్లలో చెత్త సేకరణ చేయడానికి వీలుగా ప్రస్తుతం ఉన్న 27 ట్రాక్టర్లకు తోడుగా మరో 6 ట్రాక్టర్లను కొనుగోలు చేసి ప్రజారోగ్య విభాగానికి అందించారన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ గుంటూరు సాధనకు నగర ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.



## సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : నగర కమిషనరు

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్21,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీల్లోని ఫిర్యాదులకు సంబంధించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ అన్నారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి 15 ఫిర్యాదులు అందుకొని, మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థ బర్త్ అండ్ డెత్ విభాగం వద్ద డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్ లు హాజరైన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 37 ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక విభాగం 18, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 5, ఉపా సెల్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన ఆర్జీలను విభాగాల వారిగా విబజించి, సంబంధిత విభాగా దిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, మేనేజర్ బాలాజీ బాష, విభాగాల సూపరింటెండెంట్లు, ఎస్ఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.



## పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌కు 94 ఫిర్యాదులు

**నరసరావుపేట క్రైం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 94 ఫిర్యాదులు అందాయి. అదనపు జిల్లా ఎస్పీ జె.వి.సంతోష్ మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా తమ అధికారులు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తారన్నారు. ప్రతి అర్జీపై శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు. పిడుగు రాళ్ళకు చెందిన శివమ్మ తన ఫిర్యాదులో అప్పు ఇచ్చిన రూ.2 లక్షల బకాయిలలో కొంత మాత్రమే చెల్లించి విగిలినవి చెల్లించడం లేదని తెలిపారు. పెద్దచెరువుకు చెందినవారు ఇల్లు కొనుగోలు విషయంలో మోసం చేశారని బాధితుడు ఫిర్యాదు చేశారు. కుటుంబసభ్యులను పోట్లూరు గ్రామానికి చెందిన అలివేలు పోలీసులకు తెలియజేసింది. చిలకలూరిపేట పట్టణానికి చెందిన అరుణ్ సెరీ కల్చర్‌కు సంబంధించి తనకు మోసం జరిగిందని తెలియజేశారు. రెంటచింతల మండలం జెట్టిపాలెం గ్రామానికి చెందిన వీరాంజనేయరెడ్డి తన సమస్యను తెలియజేశారు. వచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అదనపు ఎస్పీ జె.వి.సంతోష్ తెలిపారు.



## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : బాపట్లజిల్లా కలెక్టరు

**బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్నీ నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు.సోమవారం చీరాల మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి,చీరాల శాసనసభ్యులు ఎం. ఎం కొండయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యలను పరిష్క రించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.జిల్లాలో గిరిజన ప్రజలు విభిన్న ప్రతిభావంతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి మూడవ శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాలేని గిరిజన ప్రజలు, మహిళలు, విభిన్న ప్రతిభావంతుల కోసం నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన చెప్పారు. చీరాల నియోజక వర్గంలో భూములకు సంబంధించి ఇంటిని స్థలాలు, గృహ నిర్మాణాలు, పెన్షన్లు గురించి పోలీస్ శాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయని ఆయన అన్నారు. ఓడరేవు పంచాయితీ సిద్దార్ కాలనీలో నిలిచి పోయిన గృహ నిర్మాణాలను ప్రభుత్వ శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని ప్రజలు కోరారని ఆయన చెప్పారు. గృహ నిర్మాణ శాఖ అధికారులను పరిశీలించి రెండు రోజుల్లో నివేదికలు ఇవ్వాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. చీరాలలో కొంతమంది గిరిజను లు స్మశాన స్థలములో నివాసాలు ఉంటు న్నారని వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చీరాల శాసనసభ్యులు ఎం. ఎం కొండయ్య మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలకు జిల్లా స్థాయి అధికారులు రావడం వల్ల సమస్యలు వెంటనే పరిష్కారం పరిష్కారం అవుతాయని చెప్పారు. చీరాల నియోజకవర్గంలో ఖాళీ భూములను గుర్తించి పేద ప్రజలకు ఇంటిని స్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూఅధికారి జి. గంగాధర్ గౌడ్ , జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధమాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , జిల్లాసాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, చీరాల రెవిన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, చీరాల తాసిల్దార్ గోపికృష్ణ, వేటపాలెం తహసీల్దార్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.



## దాడి ఘటనలో 12 మందిపై కేసులు నమోదు

**మాచర్ల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మాచర్ల మండలం జమ్మలమడకలో తెదేపా నేతలు శ్రీకాంత్, నరసింహ, పవన్‌లపై దాడి కేసులో 12 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు మల్లెల శ్రీను, యలమంద, రామారావుతోపాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై రవిబాబు తెలిపారు. ఈ దాడికి సంబంధించి దర్యాప్తు చేస్తున్నట్లు ఆన పేర్కొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**వెల్దుర్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొనడంతో సచివాలయ ఉద్యోగికి గాయాలైన ఘటన సోమవారం వెల్దుర్తి మండల పరిధిలోని శిరిగిరిపాడులో జరిగింది. వివరాల్లోకి వెళితే శిరిగిరిపాడు -1 గ్రామ సచివాలయ హార్టీకల్చర్ ఉద్యోగి కె.శ్రవణనాయక్‌ను శిరిగిరి పాడు అటవీ చెక్‌పోస్టు వద్ద లారీ ఢీకొనడంతో తీగ్రాయాలయ్యాయి. శ్రవణ్‌కుమార్‌తోపాటు మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## వైన్స్,బార్ రెస్టారెంట్ వద్ద మహిళలు ఆందోళన

**గుంటూరుతూర్పు,ఏప్రిల్21,ప్రభాతవార్త :** గత రాత్రి నందివేలుగు రోడ్డులో ఉన్న లక్కీ వైన్స్, సంధ్య బార్ అండ్ రెస్టారెంట్ వద్ద మహిళలు, స్థానికులు ఆందోళనకు దిగారు. వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్ వల్ల తమకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దాన్ని వెంటనే మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. బార్ నుండి వచ్చే అధిక శబ్దం, ప్రతిరోజు రాత్రులు జరిగే గొడవలు, మద్యం మత్తులో ఉన్న వ్యక్తుల వల్ల తమకు ప్రశాంతత లేకుండా పోయిందని మహిళలు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు భయంతో బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యను స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో.. నేరుగా ధర్నాకు దిగినట్లు వారు తెలిపారు. బార్ వల్ల తమకు ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు వైఎస్ఆర్సిపి నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ ఇంచార్జి షేక్ నూరి ఫాతిమా దృష్టికి తెచ్చి వారు ఇబ్బందులను వివరించారు. వారి ఆవేదనను అర్థం చేసుకున్న నూరి ఫాతిమా, నివాస గృహంలో వైన్స్ షాపు బార్ రెస్టారెంట్లు పెట్టడం ఏమిటి అని ఎక్సైజ్ అధికారులకు ప్రశ్నించారు. మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. వైన్స్ బార్ రెస్టారెంట్ యాజమాన్యంతో కూడా మాట్లాడి, స్థానికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు.



## అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించం : జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త:** దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులు అత్యంత ప్రాధాన్యతతో చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన 71 మంది అర్జీదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకొని వ్రాతపూర్వకమైన అర్జీలను అందజేశారు. జిల్లా ఎస్పీ అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని, వారు ఇచ్చిన అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అర్జీలను చట్ట పరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.కర్లపాలెం మండలం గణపవరంకు చెందిన కప్పల వెంకట సుజాత అను మహిళా అంగవైకల్యంతో బాధపడుతు నడవలేని స్థితిలో వున్న దివ్యాంగుడైన ఆమె కుమారుడు యశ్వంత్ కుమార్ ను ఆటోలో తీసుకొని పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చింది. ఆ విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సహృదయ భావనతో స్పందించి స్వయంగా కార్యాలయం బయటికి వచ్చి ఆటోలో ఉన్న యశ్వంత్ ను చూసి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. చట్ట పరిధిలో వారి సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. పిట్లవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన మహమ్మద్ ఇలియాజ్ అను అతను, మరొక వృద్ధురాలు వృద్ధాప్యం వల్ల నడవడానికి ఇబ్బంది పడుతూ పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాగా వారి పరిస్థితిని గురించి పోలీస్ అధికారుల ద్వారా తెలుసుకున్న జిల్లా ఎస్పీ స్వయంగా వారి వద్దకే వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యను చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు వారి సమస్యల పరిస్కారం కోసం పోలీస్ స్టేషన్లకు, కార్యాలయాలకు వచ్చినప్పుడు వారిపట్ల పోలీస్ అధికారులు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. వారి ఫిర్యాదులకు ముఖ్య ప్రాధాన్యతనిచ్చి, చట్ట పరిధిలో విచారించి బాధితులకు తగిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాల న్నారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యత వహించినా, నిర్లక్ష్యంగా వ్యవహరిం చినా సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



**ఒరిజినల్ దస్తావేజులు పోయినవి**

గుంటూరు జిల్లా పొన్నూరు(మ) నండూరు గ్రామ కాపురస్తులు వల్లూరు కిరణ్‌కుమార్ నా సోదరుడు సమీర్ కుమార్ పేరిట క్రయము పొందిన ద.నెం. 307/2001 రు గా 21/2/2001న రిజిష్టరు కాబడిన వల్లభరావుపాలెం గ్రామ డి.నెం. 476/1, 478/1, 478/2, 478/3, 478/4, 478/5 రూ తాలూకు య.3-23.25 ట్లు శేరి మగాణి భూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజు 1/4/2025న మా స్వగ్రామమైన నండూరు నుండి పొన్నూరు వస్తుండగా పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెం. సంప్ర: 8142349234.

**రేపల్లె పురపాలక సంఘం**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు**

ఆర్.ఓ.సి.నెం. 399/2024/ఇ1 తేది: 22-04-2025

రేపల్లె పురపాలకసంఘములో బిపిఎస్ & ఎన్ఆర్ఎస్ నిధుల నుండి 7 వర్కులు ఇ- ప్రొక్యూర్మెంట్ టెండర్ ప్లాట్ ఫమ్ పై టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు టెండర్లు సంబంధించిన వివరములు www.eprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడవచ్చును.

| | |
|---|---|
| ఎస్టిమేషన్ విలువ | : రూ.250.00 లక్షలు |
| బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ప్రారంభ తేది | : ది.19-04-2025 సా॥గం॥03.00ల నుండి |
| బిడ్ డాక్యుమెంట్లు డౌన్‌లోడ్ ముగింపు తేది | : ది.03-05-2025 సా॥గం॥03.00ల వరకు |
| బిడ్ దాఖలు ముగింపు తేది | : ది. 03-05-2025సా॥గం॥03.30ల వరకు |
| బిడ్ ఓపెన్ చేయు తేది | : ది.03-05-2025 సా॥గం॥03.40ల నుండి |

కమీషనరు - రేపల్లె పురపాలకసంఘం

# శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణం ఖచ్చితంగా చేపడతాం

కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్21,ప్రభాతవార్త :** నగరంలో శంకర్ విలాస్ వద్ద ఆర్వోబీని అత్యుత్తమ డిజైన్తో అందరికీ ఆమోదయోగ్యంగా అతి తక్కువ కాలంలోనే ఖచ్చితంగా నిర్మాణం చేపట్టనున్నామని, అనవసర అపోహాలకు గురి కావద్దని ప్రజలు సహకరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశమందిరంలో శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ ప్రభావిత భవనాల యజమానులకు నిర్మాణ పరిహారం అందించే కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఇంచార్జి మేయర్ షేక్ సజీలా, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, రాష్ట్ర ఏపీఐఐసీ ఛైర్మన్ దేరు ప్రభాకర్ తో కలిసి పాల్గొన్నారు. ఆర్వోబీ నిర్మాణ ప్రభావిత భవనాల యజమానులలో తొలుత సమ్మతి తెలిపిన 21 మందికి సంబంధించిన నిర్మాణాల నష్టపరిహారం నిమిత్తం రూ. 71 లక్షల చెక్కులను కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ 1950 లో నిర్మించిన శంకర్ విలాస్ బ్రిడ్జ్ శిథిలావస్థకు చేరుకుందని, దీనిపై ట్రాఫిక్ రద్దీ కారణంగా సమీపంలోని జీజీహెచ్ కు అత్యవసర చికిత్స నిమిత్తం వచ్చే రోగులు మరణిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయన్నారు. గుంటూరు జిల్లాకు 40 ఏళ్ల అనంతరం దక్కిన కేంద్ర మంత్రి పదవిని అదృష్టంగా భావిస్తూ దీనిని సద్వినియోగం చేసుకొని కేంద్రంలోని గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు సహకారంతో శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి అతితక్కువ కాలంలోనే అన్ని రకాల అనుమతులు , నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. గతంలో నగరంలో నందివెలుగు రోడ్డులో ఆర్వోబీని 2014 లో మంజూరు చేసే పనులు ప్రారంభించటానికి 2017 వరకు సమయం పట్టిందని, కానీ శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్ల సమన్వయంతో ఆరు నెలల్లోనే పూర్తి చేయటం జరిగిందన్నారు. పరిపాలన, సాంకేతిక అనుమతులు మంజూరు తోపాటు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి అవసరం అనుకుంటే రేపే పనులు ప్రారంభించేలా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్వోబీ నిర్మాణంపై కొంత మంది కావాలని అపోహాలు సృష్టిస్తున్నారని,రహదారి విస్తరణ కోసం అక్కడ జీవనోపాధి పొందుతున్నవారికి కొంత ఇబ్బంది జరుగుతుందని కాని విశాలదృక్పథంతో అర్థం చేసుకొని స్థలాలు ఇవ్వటానికి స్వయంగా వచ్చి సమ్మతించిన భవన యజమానులకు కూటమి ప్రభుత్వం తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వం నష్టం వాటిల్లే భవన యజమానులకు సాధ్యం అయినంత వరకు పరిహారం అందిస్తుందన్నారు. ప్రజలను అయోమయానికి గురిచేసే లేనిపోని అర్ధం పర్ధం లేని ఆరోపణలు తీసుకువచ్చి అపోహాలు కల్పించవద్దన్నారు. వీటిలో ముఖ్యంగా ఆర్ యూ బీ తరువాత మాత్రమే ఆర్వోబీ నిర్మాణం చేయాలని చెబుతున్నారని, వాస్తవానికి 70 ఏళ్ళ క్రితం నిర్మించిన బ్రిడ్జి కావటం వలన ప్రస్తుతం అక్కడ ఆర్ యూ బీ కట్టడానికి సాంకేతికంగా సాధ్యం కాదన్నారు. ఇక్కడ ఉన్న వాహనాల రద్దీకి ఆర్ యూ బీ నిర్మాణం అంత అనుకూలంగా ఉండదని, తరువాత ఆర్వోబీ నిర్మించాలన్నా అప్పుడు ఇదే పరిస్థితి ఉంటుందన్నారు. అయితే అక్కడ కొంత మంది తెలపిన అభ్యంతరాలపై అధికారులతో నాలుగు సార్లు సమావేశం నిర్వహించి, అన్ని సమస్యలకు పరిష్కారం చూపటం జరిగిందన్నారు. వారి అభిప్రాయాలను పరిగణణలోకి తీసుకొని ప్రస్తుతం నిర్మిస్తున్న ఆర్వోబీ వద్ద అవసరమైతే భవిష్యత్తులో ఆర్ యూ బీ సైతం నిర్మించేలా డిజన్ చేయటం జరిగిందన్నారు. అండర్ పాస్ లకు సంబంధించి అరండాలపేట 4వ లైను వద్ద 60 అడుగుల వెడల్పుతో ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి వద్ద , అరండల్ పేట 5వ లైను వద్ద 44 అడుగుల వెడల్పుతోను మూడు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పొడవుకు సంబంధించి బ్రిడ్జ్ పొడవు గతంలో 436 మీటర్లు ఉంటే ప్రస్తుతం 930 మీటర్లు పొడవుతో నిర్మిస్తున్నామన్నారు. కీమీ కంటే ఎక్కువ పొడవు నిర్మించాలంటున్నారని దీనిని ఫ్లై ఓవర్ అంటారు, దీని నిర్మాణానికి అవసరమైన ప్రాంతాల్లోనే అనుమతులు ఇవ్వటం జరుగుతుందన్నారు. బ్రిడ్జ్ ఎక్కువ పొడవుతో నిర్మించటం వలన అనవసరంగా మరింత ఎక్కువ మంది భవన యజమానులు నష్టపోవాల్సి వస్తుందని మరల వారు కోర్టులకు వెళితే బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోతుందన్న అలోచన చేస్తున్నారన్నారు. ప్రజలు అర్ధం చేసుకోవాలని రైల్వే ట్రాకు దాటుకుంటూ సమీపంలోని భవనాలకు సాధ్యమైనంత తక్కువ నష్టం కలిగేలా బ్రిడ్జి నిర్మించటమే ప్రదాన ఉద్దేశ్యం అన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు లో 120 అడుగులలో ఇరువైపుల 25 అడుగులతో సర్వీస్ రోడ్లు వస్తున్నాయని, ఎత్తు గతంలో 5.9 మీటర్లు ఉంటే ప్రస్తుతం 9 మీటర్లుకు ఎత్తు పెంచి డబల్ డెక్కర్ బస్సు సైతం బ్రిడ్జి క్రింద నుంచి వెళ్ళేలా అవకాశం కల్పించటం జరిగిందన్నారు. ప్రజల గురించి మాత్రమే అలోచిస్తూ జీరో శాతం కూడ స్వంత లాభం చూసుకోకుండా శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం నాయకులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలకు మంచి జరిగే శంకర్ విలాస్ బ్రిడ్జ్ నిర్మాణంను త్వరలోనే ప్రారంభించి అతితక్కువ కాలంలోనే పూర్తి చేయటం జరుగుతుందన్నారు. అపోహాలు సృష్టించే వారు కూడ దయచేసి బ్రిడ్జ్ నిర్మాణానికి అడ్డుపడవద్దని, బ్రిడ్జ్ నిర్మాణం ఎట్టిపరిస్థితుల్లో జరుగుతుందని, దానిని అపాలని చూసి ప్రజలకు, సమాజానికి చెడు కావద్దన్నారు.నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ శంకర్ విలాస్ వద్ద 1950లో ఆర్వోబీ నిర్మించటం జరిగిందన్నారు. నూతన ఆర్వోబీ నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులతో పాటు సర్వీస్ రోడ్ల కోసం హిందూ కళాశాల సెంటరు నుంచి లాడ్జి సెంటరు కోసం రహదారి విస్తరణ చేపట్టడం జరుగుతుందన్నారు. రహదారి విస్తరణ వలన 7 రాష్ట్ర ప్రభుత్వం, ఆరు కేంద్ర ప్రభుత్వ, 14 మిషనరీలవి, 2 రీలిజియన్ వి, 47 ప్రైవేటు వ్యక్తుల భవనాలు మొత్తం 134 భవనాలకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికే 36 మంది సమ్మతి తెలిపారని, గౌరవ కోర్టును ఆశ్రయించిన ఆరుగురు సమ్మతి తెలిపారన్నారు. ఆర్వోబీ ప్రకారం నిభందనలు అనుసరించి భవనాల నిర్మాణాలు నష్టానికి గురికాగా, కోల్పోయిన స్థలానికి టీడీఆర్ బాండ్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. తొలి దశలో సమ్మతి తెలిపిన 21 మందికి నిర్మాణాల నష్టపరిహారం క్రింద దాదాపు రూ.70 లక్షలు చెక్కులను కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందించటం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ జనరల్ నిధుల నుంచి వీరికి నష్టపరిహారం అందిస్తున్నామన్నారు. కోల్పోయిన స్థలాలకు టీడీఆర్ బాండ్లు 45 రోజుల్లో అందించేలా చర్యలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి ప్రహరీ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, తాత్కాలికంగా వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రహదారి విస్తరణ భవనాల తొలగింపు తరువాత ఫైడ్ డ్రైయిన్ల నిర్మాణానికి నగరపాలక సంస్థ జనరల్ నిధుల నుంచి పనులు మంజూరు చేయటం జరిగిందన్నారు. గౌరవ కోర్టులను ఆశ్రయించిన భవన యజమానులకు భూసేకరణ ద్వారా నష్ట పరిహారం అందించాలని కోర్టు ఆదేశించటం జరిగిందని, భూసేకరణ ద్వారా పరిహారం తక్కువగా వస్తుందని వారికి తెలియచేయటంతో వీరిలో 6 మంది ఇప్పటికే నిర్మాణాలకు నష్టపరిహారం, టీడీఆర్ బాండ్లు తీసుకోవటానికి సమ్మతి తెలిపారన్నారు. మిగతావారికి నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి వీలుగా బీఎస్ఎన్ఎల్, విద్యుత్, కేబుల్ వైర్ల నిర్వేశన సమయంలో పక్కకు తరలించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు నగర ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులను చేపట్టడానికి యజ్ఞం లా కృషి చేస్తున్నారన్నారు. నగరవాసుల దశాబ్దాల నాటికి చిరకాల కోరిక తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలను కలిపే శంకర్ విలాస్ వద్ద నూతన ఆర్వోబీ నిర్మాణానికి ఎనిమిది నెలల్లోనే ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకొని యుద్ధంలా కేంద్ర మంత్రి పయత్నం చేశారన్నారు. ఆర్వోబీ పునర్ నిర్మాణంలో ఉన్న చిన్న ఇబ్బందులను సైతం కొంత మంది స్వార్ధ పరులు దుష్ప్రచారం చేస్తూ బ్రిడ్జ్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. ఆర్వోబీ నిర్మాణ డిజైన్ పై నిష్ణాతులైన బహిరంగ చర్చకు వస్తే పూర్తి స్థాయిలో సమాధానం చెప్పటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రానున్న 40 సంవత్సరాల ప్రజల అవసరాలు తీర్చే ప్రణాళికతో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఆర్వోబీ నిర్మిస్తున్నామన్నారు. దీనిపై సాంకేతిక అవగాహన కావాలంటే ఆర్ అండ్ బీ , రైల్వే, జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పూర్తిగా తెలియచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నగర ప్రజల అవసరాలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ఆర్వోబీ నిర్మాణం వలన నష్టం జరుగుతున్న వారికి నిర్మాణాల పరిహారం నగదు రూపంలోను, స్థలానికి సంబంధించిన పరిహారం టీడీఆర్ బాండ్ల రూపంలోను అందించటం జరుగుతుందన్నారు. గుంటూరు అభివృద్ధిలో భాగంగా ఆర్వోబీ పునర్ నిర్మాణం తప్పకుండా చేపడతామన్నారు.ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ శంకర్ విలాస్ వద్ద ఆర్వోబీ ట్రాఫిక్ రద్దీ, ఐబీపిలను మారిన కారణంగా పెద్ద ఎత్తున ప్రజలు నూతన ఆర్వోబీ నిర్మాణం చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో కేంద్ర మంత్రి నిర్విరామంగా కృషి చేసి చాలా వేగవంతంగా నిర్మాణానికి సంబంధించిన డిజైన్లు రూపొందించటం జరిగిందన్నారు. కానీ కొంత మంది నాయకులు, కొంత మంది వ్యాపారులు దీని ఉద్దేశ్యంను ప్రక్కదారి పట్టిస్తూ ప్రజల్లో అపోహాలు సృష్టిస్తూ బ్రిడ్జ్ నిర్మాణాన్ని అపాలని చూస్తున్నారన్నారని, ఇది సమర్ధమైనది కాదన్నారు. ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధి లో భాగంగా గతం కంటే అర్వోబీని నాలుగు లైన్లు విస్తరించి, సర్వీస్ రోడ్లుతో, అండర్ పాస్ లతోను, పొడవు, ఎత్తు పెంచి నిర్మించటం జరుగుతుందన్నారు. కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర నుంచి నిధులు తీసుకువచ్చారని, దీనిని అనవసరంగా పక్కదారి పట్టించకుండా ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలన్నారు.ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ 2047లో భాగంగా గుంటూరు నగరాన్ని రాజధాని ప్రాంతంతో కలిపి విశ్వనగరంగా తీర్చిదిద్దటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలో నాలుగు బ్రిడ్జ్ ల నిర్మాణాలను మంజూరు చేయించారని, ఇవి అన్ని పూర్తి అవుతాయన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతిక పరిశీలించి డిజైన్లు అనుమతించాని, దీనిని సాంకేతిక అంశాలపై మాట్లాడే అర్హత ఎవరికి లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన డీపీఆర్లను సైతం వెనక్కి పంపిన ప్రభుద్దలని, సాంకేతిక అనుమతులు వచ్చిన వాటిని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. నగరంలో 50 లక్షల మందికి ఉపయోగపడే ఆర్వోబీని అడ్డుకుంటే చరిత్రహీనులవుతారన్నారు. ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి భవన యజమానులు అర్ధం చేసుకొని సహకరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలలో వ్యక్తులకు కొద్దిపాటి నష్టం జరుగుతుందని, దానికి ప్రభుత్వం అందించే పరిహారం తీసుకోవాలన్నారు. ఆర్వోబీ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్న వారు భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలన్నారు. కేంద్ర మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో తొమ్మిది నెలల్లోనే భవన యజమానులకు నష్టపరిహారం అందించటం జరుగుతుందన్నారు.జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్ఓబి పనులు ప్రారంభానికి ముందే నష్ట పరిహారం ఇవ్వడం ప్రజల పట్ల కూటమి ప్రభుత్వ అంకిత భావం, అధికారుల కృషికి తార్కాణమన్నారు. ప్రస్తుతం శంకర విలాస్ వంతెన నిర్మాణ పనులపై అపోహాలు సృష్టించే వారు, ఎన్నో ఏళ్ళ నుండి నిలిచిన నందివెలుగు రోడ్ ఆర్ఓబి పురోగతిపై ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సిహెచ్.తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 5ఏళ్ల పాలన వలన శిధిలావస్థలో ఉన్న రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం పునర్నిర్మాణం చేస్తుందన్నారు. ఎంతో కాలంగా పెండింగ్ లో ఉన్న శంకర్ విలాస్ ఆర్ఓబి పనులను కొందరు స్వార్ధ ప్రయోజనాల కోసం అడ్డుకుంటున్నారన్నారు. నగరాన్ని స్వచ్ఛ, సశ్యామల నగరంగా అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి రెహ్మాన్, టిడిపి ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.





## లుంబినీ వనాన్ని సందర్శించిన తహశీల్దార్

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** పట్టణం లోని లుంబినీవనంలోని మహాకవి, అభినవ అంబేద్కర్ డాక్టర్ కత్తి పద్మారావు నిర్వహిస్తున్న అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ను సోమవారం బాపట్ల



జిల్లా అమర్తలూరు మండల తహశీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు కుటంబ సమేతంగా సందర్శించారు. రీసెర్చ్ సెంటర్లోని పలు పుస్తకాలను పరిశీలిం చారు. ఇంత పెద్ద గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ కత్తి పద్మారావును అభినందించారు. ఈ గ్రంథాలయం పరిశోధనలు చేసే యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని కితాబిచ్చారు. భారతదేశంలోనే ఇన్ని గ్రంథాలు, పుస్తకాలున్న గ్రంథాలయం లేదన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కం ్కు, మహాకవి గుర్రం జాషువాకు నిజమైన వారసుడు డాక్టర్ కత్తి పద్మారావు అని కొని యాడారు. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ ప్రపంచ విజేతలు వ్యక్తిత్వ నిర్మాణం లో ఇప్పటికి తాను ఏడు పుస్తకాలు రచించినట్లు చెప్పారు. అందులో ప్రతికూల అంశాల నుంచి అనుకూల అంశాలకు ఎలా మారాలో మేధావులు, ఆలోచనాపరులు, శాస్త్రవేత్తలు తమ తమ జీవితాలను ఎలా నిలుపుకున్నారో మనం కూడా మనజీవితంలో ఎలా మెలగాలో వివరించడం జరిగిందన్నారు. ఈ విధంగా అనేకానేక విషయాలకు, సంఘటనలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ దంపతులు డాక్టర్ కత్తిపద్మారావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్క్లబ్ మాజీ గవర్నర్ మేళం కృపానందం,పాల్ మేళం, మేళం సుష్మ, సందీప్ తదితరులున్నారు.

## ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పేదలకు ఒక వరం

**నిజాంపట్నం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం పేదలకు ఒక వరమని జడ్పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య అన్నారు. సోమ వారం మండల కేంద్రమైన నిజాంపట్నంలో ఎంజిఎన్ఆం ్ఇజిఎస్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందటమే కాకుండా పేదలకు పని లభిస్తుందని ఆయన చెప్పారు. కూలీలు రోజూ పనికి వచ్చి పని చేసుకుని



ఆదాయం పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు మైలా నరేష్యాదవ్, పచ్చభట్ల గంగరాజు, బడుగు శివరాకేష్, గాలి రాజు, కేసన మోహనరావు, నర్రా సునీల్, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు అవగాహనలో హస్యవల్లరి,సాహిత్య సభలు

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న హాస్యవల్లరి,సాహిత్య సభ కార్యక్రమాలు ఏప్రిల్ 22వ తేది మంగళవారం సాయంత్రం 6గంటలకు సంస్థ కార్యాలయంలో జరుగుతాయని కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు."హాస్యమే పరమౌషధం అంటున్న వైద్య ప్రముఖుల సలహామేరకు ప్రతినెల జోక్స్,కామెడీ స్కిట్ ్స,హాస్య,వ్యంగ్యపాటలు,పద్యాలు,కవితలు ప్యారడీ సాంగ్స్,మిమిక్రీ తదితరాలతో ఈ హాస్యవల్లరి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు.

## స్వీయ క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

**గుంటూరు విద్య,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** "విద్యార్థులు చెడు వ్యసనాలకి గురికాకుండా స్వీయ క్రమశిక్షణతో మెలిగితే జీవితంలో ఉన్నతస్థానాలకు చేరుకుంటారు" అని వట్టిచెరుకూరు మండల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.రామా నాయక్ హితవు పలికారు. మండలంలోని లేమల్లెపాడు గ్రామంలోగల మండల పరిషత్ ప్రాథమికోన్నత



పాఠశాల్లో 97వ వార్షి కోత్సవం,7వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా జరిగింది.ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమానాయక్ విద్యార్థుల నుద్దేశించి మాట్లా డుతూ,జీవితంలో ఎన్నడూ మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని, ఆడపిల్లల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, తెలియక ఏ చిన్న తప్పుచేసినా చట్టప్రకారం తీసుకునే చర్యలకు గురవుతారని అవగాహన కల్పించారు.సోషల్ మీడియా ప్రభా వానికి లొంగిపోవద్దని, అది మీ విద్యాభ్యాసాన్ని కుంటు పరుస్తుందని తెలిపారు. అనంతరం దాతల సహకారంతో పాఠశాల్లో చేపట్టిన విద్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రధానోపా ధ్యాయుడు పసుపులేటి శ్రీధర్ వివరించగా, ఆకర్షితులైన నాయక్ తాను లేమల్లెపాడు ప్రభుత్వ పాఠ శాలలకు ప్రమోటర్గా వ్యవహరి స్తానని వాగ్దానం చేశారు.అనంతరం విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సా హక బహుమ తులను అందించారు. శ్రీధర్ అధ్యక్షత వహించిన ఈ సభలో ఉపాధ్యాయులు వీర్ల శ్రీనివాసరావు, మోదుగుల రవికృష్ణ,ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ పచ్చల ఏస్తేరురాణి,వైస్ ఛైర్మన్ పానుగంటి చైతన్య,గ్రామ సర్పంచ్ పాతూరి శివపార్వతీ, గ్రామపెద్దలు పాతూరి కృష్ణారావు,కొణిజేటి బుల్లిబాబు,కోసూరి నాగరాజకుమారి,సామాజిక కార్యకర్త డి.చంద్రా నాయక్,విద్యార్థుల తల్లి దండ్రుల పాల్గొన్నారు.

## కెఎల్యులో నూతన ఆవిష్కరణపై అవగాహన సదస్సు

**తాడేపల్లి,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని కామర్స్ విభాగం ఆధ్వర్యంలో అంకుర సంస్థలు,నూతన ఆవిష్కరణల ఏర్పాటు చేయడంలో కావలసిన నైపుణ్యాలను ఎలా మెరుగుపరచుకోవాలనే అంశంపై అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.సదస్సుకు ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎన్.కిషోర్బాబు,ఎసిఐసి సీఈఓ రమణ్కాంత్ లు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సు ద్వారా విద్యార్థులు అంకుర సంస్థలను,నూతన అవిష్కరణలను ఏర్పాటు చేయడంలో నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.విద్యార్థులు అవకాశ ాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఏసిఐసి సీఈఓ రమణ్ కాంత్ మాట్లాడుతూ నూతన అవిష్కర ణలను ఏర్పాటు చేయడానికి ఏ విధమైన తోడ్పాటు కావాలి,ఎలా ప్రారంభించాలనే అంశాలను వివరించారు. కార్యక్ర మంలో వర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసార



ధివర్మ, ప్రొవిసి డాక్టర్ ఎవిఎస్ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డాక్టర్ ఎన్.వెంకట్ రామ్,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్బాబు,ఏసిఐసి సీఈవో రమణ్కాంత్,కామర్స్ విభాగాధిపతి డాక్టర్ శాంతకుమారి,ఉప విభాగాధిపతి డాక్టర్ షాహిద్ షాకర్ అహ్మద్,ఆచార్యులు వెంకటేశ్వర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నేలకొరిగిన భారీ వృక్షం

**యడ్లపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రెండు శతాబ్దాల నాటి మహావృక్షం ఒక్కసారిగా కుప్పకూలింది. అసమయంలో సమీపంలో జన సంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. యడ్లపాడు గ్రామంలోని మహేంద్ర సంగం మేదరబజారులో కూడలిలో భారీ వేపచెట్టు ఉంది. స్థానికులు ఈ వృక్షం చూట్టూరా దిమ్మెకట్టించి మహాలక్ష్మీ అమ్మవారిగా కొలుస్తున్నారు. వృత్తి పనులు చేసుకుంటూ ఈ చెట్టుకు నిత్యం ఉదయం పూజలు చేస్తూ సాయంత్రం వేళ అక్కడ కూర్చుని పనులు చేసుకునేవారు. ఈదురు గాలులు వీచినా, భారీ వర్షాల సమయంలోనూ ఈచెట్టు కొమ్మలు



విరగలేదు. అదివారం ఉదయం గాలులుకాని, వర్షం గాని లేకుండానే దానంతట అదే ఒక్కసారిగా మొదలు వద్ద విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాల తీగలపై ఒక్కసారిగా పడటంతో తెగిపోయాయి. స్థానికులు గమనించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. చెట్టు విరిగి పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

## రెవిన్యూ విలేజ్ అధికారి సతీమణి అకస్మిక మృతి రెవెన్యూ అధికారులు సంతాపం



**యడ్లపాడు,ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** యడ్లపాడు మండల జాలాది రెవిన్యూ పరిధిలో విధులు నిర్వహిస్తున్న విలేజ్ రెవెన్యూ అధికారి షేక్ బాషా సతివియోగం కలిగింది. చిలకలూరిపేట పట్టంలోని జాకీర్ హుస్సేన్ వీధిలోని అయన నివాసంలో సోమవారం ఉదయం సమయంలో భాషా భార్య షేక్ షాకీరా కాలకృత్యాలు తీర్చుకొని సోఫాలో కూర్చుని ఉండగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు స్థానిక వైద్యులు గుర్తించారు. 28సంవత్సరాల కిందట వివాహమైన భాషా షాకీరా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. షాకీరా అంత్యక్రియలను పట్టణంలోనే నిర్వహించుతున్నామని తెలిపారు. ఈ సంఘటన కుటుంబంతో పాటు సహ ఉద్యోగులలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విషయం తెల్సుకున్న చిలకలూరిపేట తాశీల్దార్ షేక్ హుస్సేన్, యడ్లపాడు తహశీల్దార్ విజయశ్రీ, నాదెండ్ల తహశీల్దార్ వెంకటరమణ, మూడు మండలాల అధికారులు సిబ్బంది భాషా బార్య మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. షాకీర భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు మార్గదర్శకాలు పాటించాలి

**మంగళగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** అ ఖిలపక్ష సమావేశం తదుపరి ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం రూపొందించే విధంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి నిర్దిష్ట మార్గదర్శకాలు జారీ చేయాలని సుప్రీంకోర్టుకు ఎమ్మార్పీఎస్ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, న్యాయవాదిం



చిలువూరు నాగ రాజుమాదిగ లేఖ పంపించినట్లు సోమవారం ఒక ప్రకటన ఆయన తెలిపారు. సుమారు 7 దశాబ్దాల సుదీర్ఘ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్ట బద్దతకు అనుకూలంగా రాష్ట్రాలకు అధికారం కల్పిస్తూ ఆగస్టు1, 2024 న భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకొ కోర్టు రాజ్యాంగ ధర్మాసనం చారిత్రక సంచలన తీర్పు నేపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కు అశాశ్వత , స్వల్పకాలిక పరిష్కారంగా ఆర్డినెన్సు (జీవో)ను రూపొందించిన విషయం మనందరికీ విదితమే. కాని ఎస్సీ రిజర్వేషన్లను 3 గ్రూపులుగా వర్గీకరించడంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు మార్గదర్శకాలు పాటించలేదని నాగరాజు మాదిగ అన్నారు. కేవలం మాల సామాజిక వర్గానికి అదనపు అవకాశం లబ్ధి, ప్రయోజనం చేకూర్చడానికి వెనుకబడిన ఆది ఆంధ్ర ఆది ద్రావిడ వర్గాలకు చెందిన గ్రూప్ సి లోకి మాల సామాజిక వర్గాన్ని చేర్చడం ప్రభుత్వం చేసిన కుట్రగా కనబడుతున్నదనీ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం 5 లక్షల జనాభా కలిగిన ఆది ఆంధ్ర , ఆది ద్రావిడ సామాజిక వర్గాలకు తోడుగా మరికొన్ని సమజాత శ్రేణి సామాజిక వర్గాలను కలిపి ప్రత్యేకంగా గ్రూప్ ను ఏర్పాటు చేయాలని, సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పుకు అనుగుణంగా మిగిన అణగారిన వర్గాలతో పాటు మాదిగ సామాజిక వర్గానికి రోస్టర్ విధానంలో అదనంగా ప్రయోజనం అవకాశం కల్పించా లన్నారు. శాసన సభలో వర్గీకరణపై తీర్మానం అనంతరం శాసన మండలి లో కూడా తీర్మానం చేయకుండా అసెంబ్లిని అర్ధాంతరంగా ప్రొరోగ్ చెయ్యడం అన్యాయం అన్నారు .ఈ వైఖరి సదరు సుప్రీం కోర్టు తీర్పును విరుద్ధం అని చంద్రబాబు ప్రభుత్వం కోర్టు ధిక్కారానికి పాల్పడుతుందని నాగరాజు ఆరోపించారు. ఎస్సీ (రిజర్వేషన్ల) వర్గీకరణ కు శాశ్వత పరిష్కారం చూపే చట్టంచేయుటకు అఖిల పక్ష సమావేశం, అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం హై కోర్టుకు ఫిర్యాదు చేస్తున్నట్లు నాగరాజు మాదిగ ఆ ప్రకటనలో తెలిపారు.

## టిడ్కో గృహాలలో నివసిస్తున్న వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు

**చిలకలూరిపేట,ఏప్రిల్21,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలమేరకు ఈనెల 21నుంచి 23వ తేదివరకు రానున్న



విద్యాసంవత్సరానికి సంబందించి ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా విద్యార్దులను చేర్చుకునే ప్రక్రియ చేపట్టవలసినదిగా ఆదేశాలు ఇచ్చారు. దానిని అనుసరించి ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహాలలో నివసిస్తున్న ఐదు సంవత్సరాల బాలబాలికలను సోమవారం మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాధమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు కె సుధ, ఉపాధ్యాయుడు పోటు శ్రీనివాసరావులు వెళ్లి తమ పాఠశాలలో వారిని చేర్పించవలసినదిగా కోరారు. ప్రభుత్వ పాఠశాలలో చదివేవారందరికి ఉచిత విద్యతోపాటు, ఆరురోజుల పాటు మధ్యాహ్న భోజన పథకం ద్వారా మంచి పౌష్టికాహారాన్ని అందచేయడం జరుగుతుం దన్నారు. ప్రతినెలా విద్యార్దులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందచేయడం జరుగుతుం దన్నారు. ఇంగ్లీష్మీడియంలో నాణ్యమైన విద్యా భోదన, సుశిక్షితులైన ఉపాధ్యా యుని, ఉపాధ్యా యులచే భోదన చేయబడుతుందని వివరించారు. అవి తెలియచేసిన తరువాత కొంతమంది బాలబాలికలు ఆ పాఠశాలలో చేరడానికి అంగీకారం తెలిపి ధరఖాస్తు చేసుకున్నారు. వారందరికి పాఠశాల మేనేజ్మెంట్ కమిటి అభినందనలు తెలియచేసింది.

## చెత్తనుండి సంపద తయారీ!

### వినియోగంలోకి సంపద సృష్టి కేంద్రాలు

**కారంపూడి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్తనుండి



సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది. చిట్టడవులను తలపిస్తున్న సంపద కేంద్రాలను శుభ్రం చేసి రంగులు వేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి వాటిని తడి, పొడి చెత్తగా వేరు చేస్తున్నారు. వానపాములను వదిలి వర్మీ కంపోస్టు తయారీకి అడుగులు వేశారు. దీంతో గ్రామాల్లో చెత్త సమస్య తొలగడంతోపాటు ఆదాయ వనరు ఏర్పడుతుంది. దీంతో అన్ని గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తీసుకొస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటి మరమ్మతులకు ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో కారంపూడి మండలంలోని చెత్త సంపద కేంద్రాలన్నింటిని వినియోగంలోకి తెస్తున్నారు. ఇప్పటికే రెండు మూడు మినహా అన్నింటికీ రంగులు వేయించారు. మూడు గ్రామాల్లో సంపద కేంద్రం నిర్మాణానికి స్థలం లేకపోవడంతో అక్కడ నిర్మాణాలు చేపట్టలేదు. చిన్నగార్లపాడు గ్రామంలో సంపద కేంద్రం ఉన్నా నీటి వసతి లేకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ఇప్పటికే పలు కేంద్రాల్లో చెత్తను సేకరించి వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్త లేకుండా స్వచ్ఛ గ్రామాలుగా నిలవనున్నాయి. ఈఓపీఆర్డీ కసిన్యానాయక్ మాట్లాడుతూ మండలంలో రెండు మూడు మినహా 12 సంపద కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలకు పూర్వవైభవం తీసుకువస్తాం. ఈ నెల చివరికల్లా అన్ని సంపద కేంద్రాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీకంపోస్టు తయారీ ద్వారా సంపద సృష్టిస్తాము అని తెలిపారు.

### కెఎఫ్సి కొత్త ఆఫర్తో ఎపిక్ రుచి, ఎపిక్ సేవింగ్స్

**విజయవాడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఏపి, తెలంగాణ వ్యాప్తంగా ఎపిక్ ఆఫర్లను అందిస్తున్నట్లు కెఎఫ్సి ప్రతినిథులు తెలిపారు. ఫింగర్ లికింగ్ చికెన్ 9 పీస్లను రు.299లకే అందిస్తామని, నమ్మశక్యం కాని ధరకు ఏడు చికెన్స్ట్రిప్స్ బోన్లెస్ చికెన్ స్ట్రిప్స్, రెండు క్రంచీ, జ్యూ హాట ్ అండ్ క్రిస్పి పీస్లు లబిస్తాయన్నారు.

# బీసీల ఆత్మగౌరవంతో ఆటలాడ వద్దు : కేసన శంకరరావు

మంగళగిరి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : ఓబిసిల సాధికారితకు దోహదపడే సమగ్ర కుల గణన నిర్వహించేందుకు,అధికారంలో లేనప్పుడు ఒకరీతిన, అధికారం అందిపుచ్చుకున్నాక మరో రీతిన, ద్వంద్వ ప్రమాణాలు పాటించడం



రాజకీయ పార్టీలకు తగదని, మాటిమాటికి మాట తప్పే పార్టీలు ప్రభుత్వాలు బీసీల ఆత్మ గౌరవంతో ఆటలాడటం సరికాదని, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం కర్నూలు జిల్లా నూతన అధ్యక్షులుగా ఈరోజు నియామకమైన ఈ.పి.ధర్మేంద్ర గౌడ్ పదవీ ప్రమాణ స్వీకారం స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బీజేపీ అగ్ర నేతలు జనగణనతో పాటే సమగ్ర కులగణన జరుపుతామంటూ హామీ ఇచ్చి, ఇప్పుడు మేనమేషాలు లెక్కిస్తూ మోనం వహిస్తున్నారన్నారు. అలాగే ఆనాడు కుల గణన గురించి పట్టించుకోని కాంగ్రెస్,ఈసారి జరిపే జన గణనతో పాటే సమగ్ర కుల గణన జరపాలనడమే గాక,తను అధికారంలో ఉన్న ఒక్క తెలంగాణ రాష్ట్రంలో కుల గణన సర్వే జరిపి, చట్టసభలలో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ లు ఇవ్వాలని శాసనసభ తీర్మానం చేసి, పార్లమెంటు ఆమోదానికి పంపడం సంతోషమేనన్నారు. దేశవ్యాపితంగా సమగ్ర కులగణన నిర్వహించే విషయంలో పార్టీల ద్వంద్వ నీతిని తీవ్రంగా విమర్శిస్తున్నామన్నారు. ఓబీసీల సంక్షేమంఅభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వాలు వెంటనే కులగణన జరిపి దేశంలోనూ రాష్ట్రంలోనూ ఎంతమంది బీసీలు ఉన్నారో తేల్చాలన్నారు. అన్ని రంగాలలో అన్ని విధాల వెనుకబడిన ఓబీసీలకు,వారి జనాభా దామాషాలో సామాజిక రాజకీయఆర్థికసాంస్కృతిక రంగాలన్నింటిలో సమాన అవకాశాలు కల్పించాలని శంకరరావు విజ్ఞప్తి చేశారు.జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ఇప్పటికే కుల గణనపై దేశవ్యాప్తంగా ఓబీసీలు ధర్నాలు ర్యాలీలు,సభలుసమావేశాలు నిర్వహించి,వివిధ పార్టీల అధినేతలకు,ప్రభుత్వ అధినేతలకు, చట్టసభల సభ్యులందరికీ వినతి పత్రాలు సమర్పించామన్నారు. అయినా కేంద్ర బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం పార్లమెంటు ద్వారా ఒక నిర్ణయానికి రాకుండా,మేనమేషాలు లెక్కించడం దురదృష్టకరమన్నారు. అందుకే ఈనెల 27వ తేదీ,ఆదివారం ఉదయం పది గంటలకు,విజయవాడలోని ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం నుండి, తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తూ,కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలనుకుంటున్నామన్నారు. ఇప్పటికే సమగ్ర కుల గణన కోసం, పార్లమెంటు సభ్యులందరికీ వినతి పత్రాలను సమర్పించామని, ప్రయోజనం కనిపించనందునే, ఆ రోజున ర్యాలీ అనంతరం కళాక్షేత్రం వద్దనున్న మహాత్మ జ్యోతిబా ఫూలే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు కూడా వాటిని సమర్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు స్పందించకుంటే,ఇకపై విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం కాకుండా, దేశవ్యాప్తంగా ఓబీసీలు సమరశీల పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. మా ఆత్మ గౌరవంతో ఆటలాడటం ఇకపై ఆపాలని, అందుకే జూన్ 6వ తేదీన తిరుపతిలో బీసీల ఆత్మ గౌరవ సభను భారీ ఎత్తున నిర్వహించి,ఆదిపత్యకుల పెత్తందారి పార్టీలుపాలకులకు కనువిప్పు కలిగిస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన విజయవాడలో భారీ ర్యాలీని,జూన్ 6వ తేదీన తిరుపతిలో జరుగు బీసీల ఆత్మగౌరవ సభలను భారీ ఎత్తున జయప్రదం చేసేందుకు బీసీ సమాజం లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాం బాబాజీ,స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్,యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్, ఉద్యోగ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి ఉమామహేశ్వరరావు,ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# కబ్జాలకు పాల్పడితే ఊరుకునేది లేదు: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త): మాచర్ల పట్టణంలోని పలువార్డుల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలోని వినాయకుని గుట్ట, 27వ వార్డు అజాద్‌నగర్ కాలనీ, 8, 9, 10, 11 వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దగ్గరుండి పర్యవేక్షించారు.





వినాయకునిగుట్టలో పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడ జాగా కనిపిస్తే అక్కడ కబ్జారాయుళ్లు రెచ్చిపోయి విచ్చలవిడిగా కబ్జాలకు పాల్పడ్డారన్నారు. లేఅవుట్‌కు విరుద్ధంగా కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే ఏ ఒక్క కట్టడమైనా బుల్డోజర్‌తో తొలగించాలని మున్సిపల్ కమిషనర్ వేణుబాబును ఎమ్మెల్యే ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు చేపడితే, అవి ఏ దశలో ఉన్నా కూల్చివేయాలని అధికారులకు సూచించారు. వినాయకుని గుట్ట, ఆజాద్‌నగర్, కళాకారుల కాలనీ, కోడెల శివప్రసాద్ కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక ప్రజలు నేరుగా ఎమ్మెల్యే జూలకంటికి మొరపెట్టుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. మరోసారి వార్డుల్లో పర్యటించే సమయానికి డ్రైనేజీ మురుగంతా క్లీన్‌చేసి, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో నూతన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలను సిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, చైర్మన్ పోలూరి నరసింహారావు, మున్సిపల్ అధికారులు, పట్టణ తెదేపా నాయకులు, మాజీ కౌన్సిలర్ మద్దిగపు వెంకటరామిరెడ్డి, పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమెర దుర్గారావు, వజ్రనాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు గ్రామ రెవిన్యూ అధికారుల సంక్షేమ సంఘం ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు సోమవారం గ్రీవెన్స్‌లో గ్రామ రెవిన్యూ అధికారుల సంక్షేమ సంఘం విఏఓల విభాగం తరపున రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ళ రామదాసు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామదాసు మాట్లాడుతూ గతంలోనూ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రెవిన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్‌లకు తమ సమస్యలను తెలియజేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. విఏఓ సర్వీస్ మొత్తానికి పెన్షన్ సదుపాయాన్ని కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముత్తనపల్లి శంకర్‌ప్రసాద్ పాల్గొని కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు వినతిపత్రాలు అందించారు.

# ఘనంగా 16రోజుల పండుగోత్సవం

పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త: పట్టణంలోని నేతాజీనగర్‌లో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో సోమవారం శ్రీ సీతాల క్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారికి విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం



స్వామివారికి విశేషంగా అలంకరించారు. బొండు మల్లెలతో మల్లెలార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రామనామాన్ని జపించారు. జై రామ...జైజై రామ కోదండరామ.. .పట్టాభిరామ.. ..పావననామ.. .అంటూ భక్తులు నినందించారు. శ్రీరామనవమి ఉత్సవం ముగిసి 16రోజులు అయిన సందర్భంగా శ్రీ స్వామివారికి ఈ ఉత్సవం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు తీర్థప్రసాద గోష్ఠి జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం కమిటి కార్యదర్శి పోతన శ్రీనివాసరావు నేతృత్వంలో కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

# ప్రమాదంలో మరణించిన కార్యకర్త, కుటుంబానికి బీమా అందజేత

వెల్దుర్తి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: కార్యకర్తల సంక్షేమమే తెదేపా ముఖ్య లక్ష్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండల కేంద్రం వెల్దుర్తికి చెందిన పాలపర్తి వీరప్పయ్యాచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు.



పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తగా ఉన్న వీరప్పయ్యాచారి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా ఇచ్చి, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నగదు చెక్కును పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ సంతకం చేసిన ఇన్సూరెన్సు క్లయిమ్ ధ్రువపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మృతుని భార్య కృష్ణకుమారికి ఎమ్మెల్యే జూలకంటి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా యువనాయకుడు జూలకంటి అక్కిరెడ్డి, వెల్దుర్తి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో బొమ్మల దుకాణంలో అగ్నిప్రమాదం

చిలకలూరిపేట, ఏప్రిల్21, ప్రభాతవార్త: పట్టణంలోని సుభానినగర్‌లో ఉన్న చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మల దుకాణంలో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వలన అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో షాపులో ఉన్న బొమ్మలకు మంటలు అంటుకొని అన్ని పూర్తిగా దగ్ధమైపోయాయి. పక్కన ఉన్న షాపులకు కూడా మంటలు తగిలాయి. వెంటనే




స్థానికులు స్థానిక ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటాహుటీన సంఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆపివేశారు. ఈ సంఘటనా స్థలాన్ని స్థానిక తహసిల్దార్ మహ్మద్ హుస్సేన్, మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబులు పరిశీలించారు.

# కన్నా పాఠశాల్లో ఘనంగా "కిడ్స్ ఫెస్టివల్ 2025"

గుంటూరు విద్య,ఏప్రిల్ 21,ప్రభాతవార్త : స్థానిక రైలుపేట కన్నా ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో 2025 సంవత్సరాలకు వీడ్కోలు పలుకుతూ పిల్లల పండుగ (కిడ్స్ ఫెస్టివల్-2025) ఘనంగా నిర్వహించారు.సోదరభావంతో ఎదగాలని,జాతీయ స్ఫూర్తి కలిగి ఉండాలని,పెద్దలను,మహిళలను గౌరవించాలని,అవినీతి రహితంగా జీవించాలని,తదితర అంశాలపై విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు,మౌన ప్రదర్శనలు,స్కిట్ స్,లఘు నాటికలు,తల్లిదండ్రులు ఉపాధ్యాయులను విశేషంగా ఆకర్షించాయి.ఈ సందర్భంగా కన్నా విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ కన్నా మాస్టారు మాట్లాడుతూ



నాలుగున్నర దశాబ్దాలుగా విద్యా భోధనతో సమానంగా విద్యార్థుల జీవన ప్రమాణాల మెరుగుదలకు కావలసిన నైపుణ్యాలను అందిస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో అడకమిక్ అడ్వైజర్ రాజేశ్వరీ దేవి,ప్రిన్సిపాల్ ఎం.శ్రీదేవి,ఉపాధ్యాయిని,ఉపాద్యాయులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియెట్ విద్యా పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించండి

-ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీ అందజేత

పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఇంటర్మీడియెట్ విద్యా పెన్షనర్ల యొక్క ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు వినతిపత్రం అందజేశారు. 2018వ సంవత్సరం నుండి డిఆర్ ఎరియర్స్, 11వ పిఆర్సీ ఎరియర్స్ తక్షణమే విడుదల చేయాలని కోరారు.




2019నుండి పెన్షనర్లు సాధించుకున్న అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ 7శాతం నుండి 10శాతంకు, 12శాతం నుండి 15శాతంకు రెస్టోరేషన్ చేయాలన్నారు. ఈహెచ్ఎస్ కింద హెల్త్‌కార్డుల మీదు అన్నీ హాస్పిటల్స్‌లో అన్ని వా ్యధులకు వైద్యము అందించాలన్నారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్ మొత్తం రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంపుచేయాలన్నారు. ఎయిడెడ్ రంగమునకు సంబంధించిన పెన్షనర్లు అందరికీ మెడికల్ రీఎంబర్స్‌మెంట్ అమలు చేయాలన్నారు. ఇంకా పలు సమస్యలకు సంబంధించిన అర్జీలను, అందుకు సంబంధించిన వివరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరినేని ఆంజనేయులునాయుడు, పి.రఘుబాల, ఇ.కుసుమకుమారి, అబ్దుల్ అజీజ్, బి.మధురవాణి, కె.విజయలక్ష్మి, షేక్ యాసిన్‌బాబా తదితరులున్నారు.

# సీతారామాలయంలో 16 రోజుల పండుగ

విజయపురిసౌత్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: శ్రీరామనవమిని పురస్కరించుకుని 16 రోజుల పండుగను స్థానిక సీతారామాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి తర్వాత 16 రోజులకు ఈ వేడుకను నిర్వహిస్తామని ఆలయ కమిటీ



పేర్కొంది. అందులో భాగంగా వధూవరుల తరఫున కామిశెట్టి సత్యనారాయణ, నీలిమ దంపతులు, ఆడికి నాగరాజు, మధులత దంపతులు కలిసి పదహారు రోజుల పండుగను నిర్వహించారు. అనంతరం వెయ్యిమందికిపైగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోలా వసంత్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 24వ తేదిన ఉమ్మడి గుంటూరు జిల్లా బీచ్ కబడ్డీ సెలక్షన్స్

బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు మరియు మహిళల 12 వ బీచ్ కబాడీ సెలక్షన్స్ ఏప్రిల్ 24వ తేదీన బాపట్ల మున్సిపల్ హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు సోమవారం తెలిపారు. ఈ సెలక్షన్స్ లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకుని రావాలని ఆయన తెలియజేశారు ఈ యొక్క సెలక్షన్స్ మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయన్నారు ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు

# నాటక రంగం ద్వారా సమస్యలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్య వంతులను చేయాలి : వరగాని కళాపరిషత్‌లో మర్రి రాజశేఖర్


చిలకలూరిపేట,ఏప్రిల్21,ప్రభాతవార్త: ప్రస్తుతం సమాజంలోఉన్న సమస్యలను నాటకరంగం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యం చేయడానికి నాటక



కళాపరిషత్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయని శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ అన్నారు. వరగాని గ్రామంలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సంస్థ వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల 9వ ఆహ్వాననాటకపోటీల కార్యక్రమంలో ఆదివారం రాత్రి రాజశేఖర్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. రాజశేఖర్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కళాపరిషత్‌ల నిర్వహణ ఎంతో వ్యయప్రయాసలు అయినప్పటికి కళాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో వాటిని నిర్వాహకులు నిర్వహించడాన్ని అభినందించారు. నిర్వాహకులు స్వంతనిధులు, కళాపోషకుల సహకారాలతో ఈ కళాపరిషత్‌ను గత 9 సంవత్సరాలుగాక్రమం తప్పకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా పరిషత్ నిర్వాహకులు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందచేశారు

# మాతా శ్రీ వైద్యశాలలో తెలంగాణ వాసికి ల్యాప్రొస్కాపిక్ శస్త్రచికిత్స


నరసరావుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : పట్టణంలోని మాతాశ్రీ హాస్పిటల్స్‌లో తెలంగాణకు



చెందిన మహిళకు ల్యాప్రో స్కోపిక్ శస్త్రచికిత్సనవిజయవంతంగా నిర్వహించారు. వివరాలను సోమవారం హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ పి రామచంద్రారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందినసీతరావమ్మ భరించలేని కడుపునొప్పితో, గ్యాస్ సమస్యలతో మాతాశ్రీ హాస్పిటల్స్‌కు వైద్య సేవలకై వచ్చారు. వారికి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి ల్యాప్రొస్కోపిక్ శస్త్రచికిత్సను నిర్వహించటం జరిగిందని డా.రామచంద్రారెడ్డి తెలిపారు. అతి సురక్షతమైన నూటికి నూరుశాతంవిజయవంతంగా ఇటువంటి సర్జరీలు తమ వైద్యశాలలో వందల సంఖ్యలో నిర్వహించామని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుండి వచ్చిన సీతరావమ్మకు గతంలో గర్భసంచి ఆపరేషన్ ఓపెన్ చేయటంతో ప్రేగులు మడత రావటం, అతుకులు ఏర్పాడి సమస్యలు వచ్చాయన్నారు.వాంతులు, కడుపు నొప్పి పూర్తిగా తగ్గించి భవిష్యత్‌లోనూ ఆరోగ్య సమస్యలు రాకుండా ఇంటికి పంపాటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు శరీరంపై చిన్ని రంధ్రాలతో, తక్కువ నొప్పి, వేగంగా కోలుకోవటం, సురక్షితమైనటు వంటి ఎన్నో ప్రయోజనాలు ఉన్న ల్యాప్రొస్కోపిక్ శస్త్రచికిత్సల ప్రాధన్యత పై అవగాహన కల్గిఉండాలని డాక్టర్ రామచంద్రారెడ్డి ఈ సందర్భంగా వివరించారు.

# కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చటంలో విఫలం

బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు ఏ పథకము సరిగ్గా అమలుకు నోచుకోలేదని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి




మేకల ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా 24వ వార్డులో ఆదివారం ఆయన మాట్లాడుతూ యువతకు 20 లక్షలు ఉపాధి అవకాశాలు లేదా నెలకు 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు.పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి 15 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉజ్వల్ పథకం కింద నిరుపేదలకు ఉచిత గ్యాస్ కలెక్షన్స్ ఇవ్వాలి. ప్రతి ఇంటికి ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలని,ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాలు వరకు ఉన్న మహిళలకు ప్రతినెల 1500 రూపాయలు ఇస్తామని,అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి సంవత్సరం 20 వేల రూపాయలు ప్రతి రైతుకు అందిస్తామన్నారు. ఈ పథకాలన్నీ అమలు చేయాలన్నారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ 6 హామీలను అమలు చేయాలని కోరుతూ బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఏవో కి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రతినిధి బృందం మెమొరండం ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్. హాఫిజుల్లా. ఇంటి పని వంట పని కార్మికుల సంఘం బాపట్ల నాయకులు ఎన్. బిబ్జాన్. తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లుపై ముస్లిం సోదరులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

భాజపా ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు


చిలకలూరిపేట,ఏప్రిల్21,ప్రభాతవార్త: వక్ఫ్ బిల్లుపై ముస్లిం సోదరులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బిజెపి ఓబిసి మోర్చా



ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం బిజెపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బిల్లుపై లేనిపోని గందరగోళం కొంతమంది కావాలని చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం, నరేంద్రమోడీ, బిజెపిపై బురద చల్లాలని తద్వారా ఓటు బ్యాంకు రాజకీయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాల అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలవారికి, పేదవారికి సమానంగా ఉన్నాయని ఎక్కడా కూడా కులవివక్ష, మతవివిక్ష లేకుండా అందరికి అందుతున్నాయని తెలియచేశారు. పియంఎవై గృహలుకానీ, ఉచిత సిలెండర్‌కానీ, ఉచిత బియ్యంకానీ, ఐదులక్షల ఆరోగ్యభీమాకానీ ప్రతి ఒక్క పేద ముస్లిం కుటుంబానికి కూడా అందుతున్నాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కేవలం దురుద్ధేశపూర్వకంగా ఓటుబ్యాంకు రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ చట్టం పేరు చెప్పుకొని కొంతమంది ముస్లిం అగ్రనేతలు పబ్బం గడుపుకుంటున్నారని, అమాయక పేద ముస్లింలను పావులుగా వాడుకుంటున్నారని ఇది ముస్లిం సమాజం గమనించాలని ఆయన తెలియచేశారు. ఈ బిల్లువలన ప్రతిఒక్క పేద ముస్లింకు భవిష్యత్‌లో ఏన్నో ఉపయోగాలు ఉన్నాయని దీని గురించి అనవసరంగా కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ముందుకు దూసుకువెళుతుందని, అది చూసి ఓర్వలేని వారు దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న ఎన్నికలలో వారే దుష్ప్రచారం చేసేవారికి బుద్ధి చెపుతారని వివరించారు. అత్యున్నతమైన రాజ్యాంగం అందరికి సమానమేనని, ఒక కులానికి ఒక చట్టం, మతానికి ఒక చట్టం ఉండకూడదని అందరికి ఒకే చట్టం ఉండాలని, లేనియోడల అది భవిష్యత్‌లో ప్రమాదమని గ్రహించి ముందుగానే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని మనకు అందచేశారని తెలియచేశారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, కుప్పం కళ్యాణదుర్గారావు, పోతవరం సుభాని, షేక్ సుభాని, పఠాన్ నబీఖాన్, అన్నపురెడ్డి లక్ష్మణ్, గుమ్మా బాలకృష్ణ, ఊటికొండ నాగేశ్వరరావు, మాచర్ల శ్రీనివాసరావు, పంచుమర్తి పూర్ణచంద్రరావు, జె రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# జెఇఇ మెయిన్స్ ఫలితాలలో వాగ్దేవి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : జెఇఇ మెయిన్స్ పరీక్ష ఫలితాలలో వాగ్దేవి విద్యార్దులు మంచి మార్కులతో ర్యాంకులు సాధించారు. వివరాలను సోమవారం కళాశాలలో





జరిగిన విలేకరుల సమావేశంలో సెక్రటరీ అండ్ కరస్పాండెం ట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావులు తెలిపారు. తమ జూనియర్ కళాశాల విద్యార్దులు ఆర్ జాస్పర్ 650 వ ర్యాంక్, ఆకుల సాయి 1200వ ర్యాంక్, గుండాల సిరి 1545వ ర్యాంక్ ,కొలకోట్ల మహేష్ 4155వ ర్యాంకు, రామవత్ మోహన 5250వ ర్యాంకు, గుండాల యువరాజ్ 7245వ ర్యాంక్‌సాధించారని తెలిపారు. వారికి ట్రిబుల్ ఐటిలలో టాప్ 20 కళాశాలలో సీట్లు లభించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులను సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావులు డైరెక్టర్స్ కె.రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, అచ్యుతరావు, అధ్యాపకులు అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

-ప్రధానోపాధ్యాయుడు హనుమంత్‌ప్రసాద్


పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త: నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు బి.హనుమంత్‌ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి పిల్లలకు అడ్మిషన్ ఇస్తున్నారు. అందుకు సంబంధించిన ఫారాలను పూర్తి చేసి



తల్లిదండ్రుల చేత సంతకాలు చేయించుకుంటున్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు,యూనిఫాం తదితర సౌకర్యాలన్నీ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఉమాదేవి తదితరులున్నారు.

# రామచంద్రపురం సిఆర్‌జెడ్ సమస్యలను పరిష్కరించాలి

బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త: రామచంద్రపురం సిఆర్‌జెడ్ సమస్యలను పరిష్కరించాలని మత్స్యకారులు స్థానిక శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మను కోరారు.బాపట్ల మండలం పరిధిలోని అడవి పంచాయతీలోని రామచంద్రపురం గ్రామంలో 200 కుటుంబాల మత్స్యకారులు బోట్లు పెట్టుకునే భూవివాద సమస్యపై బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ మత్స్యకారులు ఆదివారం వారి సమస్యను వివరించారు.ఈ సందర్భంగా రామచంద్రపురం మత్స్యకారులు మాట్లాడుతూ ప్రైవేటు రిసార్ట్స్ వ్యాపారుల ప్రయోజనాల కోసం తమ బతుకులు బలిపెట్టవద్దని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ రిసార్ట్స్ వ్యాపారుల వేధింపుల నుండి మమ్మల్ని కాపాడమని శాసనసభ్యులను కోరారు. అభివృద్ధి పేరిట తమ జీవనాన్ని ధ్వంసం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. సిఆర్‌జెడ్ జోన్3 నిబంధనల ప్రకారం ఆటుపోటుల జలాల ఉపరితల భూభాగం



నుండి 200 మీటర్లు వదలాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పరిగణలోనికి తీసుకోకుండా సముద్రం వెంట వివిధ నిర్మాణాలు చేయడం సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించడం తప్ప మరొకటి కాదని గ్రామమత్స్యకారులు మరియు అఖిల భారత రైతు కూలీ సంఘం ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు.బాపట్ల శాసనసభ్యులు సిఆర్‌జెడ్ నిబంధనలకి లోబడి ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం మరోసారి చర్చించి గ్రామ మత్స్యకారుల జీవనానికి నష్టం లేకుండా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల సమస్యను మత్స్యకారుల మధ్య చర్చించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్న బాపట్ల ఎమ్మెల్యేకి రామచంద్రపురం మత్స్యకారుల మహిళలు అభినందనలు తెలిపారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సిఎం

## -రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

**గుంటూరు కార్పొరేషన్,ఏప్రిల్21,ప్రభాతవార్త :** పభుత్వం ఏర్పాటైన తొలిరోజే మొదటి సంతకం డీఎస్సీ నియమకాలపై సంతకం చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన మాటను నిలబెట్టుకున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభ్యర్థులకు డీఎస్సీ నోటిఫికేషన్ ఊరట కలిగించిందని అన్నారు. గత ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ అభ్యర్థులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని,వారి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయటం హర్షణియం అన్నారు. గత ప్రభుత్వం డిఎస్సి అభ్యర్థులను పట్టించుకోలేదని తెలిపారు. ఆ కారణంగా చాలామంది వయసు పెరిగిపోయిందని అయితే ఇది గమనించిన కూటమి ప్రభుత్వం వయే పరిమితి విషయంలో కూడా సడలింపులు ఇచ్చిందని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1159 పోస్టులు భర్తీ కానున్నాయని వెల్లడించారు. వీటిలో కొన్నిటి వివరాలు తెలుసుకుందాం ఓసీలకు 461, బిసి ఏ కేటగిరిలో 86, బి సి బి కేటగిరిలో 108, బీసీ సీలో 11, బి సి డి లో 77 ,బిసిఈ లో 45, ఎస్సీ గ్రేడ్ వన్ లో 22, ఎస్సీ గ్రేడ్ 2 లో 70, ఎస్సీ గ్రేడ్ 3 లో 88 ,ఎస్టి 65, ఈడబ్ల్యూఎస్ 108, పీహెచ్ హియర్ కు రెండు కేటాయింపులు జరిగాయని చెప్పారు. .ప్రకటించిన విధంగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడమే కాకుండా అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు చర్యలు తీసుకోవడం శుభ పరిణామం అన్నారు. మూడు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తి కానుందని వెల్లడించారు. మే 15 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, జూన్ 5 నుండి జూలై ఆరో తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు . కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలనే వారి కలలు నెరవేరనున్నాయని అన్నారు

# సముద్రతీర ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి

## -బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త:** చీరాల నియోజకవర్గం అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని, బీచ్ లను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, పర్యాటక ప్రాంతం అభివృద్ధిపై జిల్లా స్థాయి అధికారులతో సోమవారం చీరాల పురపాలక సంఘం కార్యాలయంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం చీరాల స్మశాన వాటికను కలెక్టర్, జేసీ, శాసనసభ్యులు పరిశీలించారు. చీరాలలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.10.2 కోట్ల నిధులతో జల జీవన్ మిషన్ కింద పనులు చేపడతామని జిల్లా కలెక్టర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరా కొరకు రూ.60 లక్షలు ఆర్ డబ్ల్యు ఎస్ ద్వారా మంజూరు చేస్తామన్నారు. చీరాల పరిధిలోని అయిదు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు చేయడానికి యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8.25 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి నిధులు కేటాయింపులు జరగ్గా అదనంగా మరో రూ.1.75 కోట్ల నిధులు వెచ్చిస్తామన్నారు. డి ఎం ఎఫ్ కింద మరో రూ.రెండు కోట్ల నిధులు బీచ్ అభివృద్ధికి మంజూరు చేస్తామన్నారు. వివిధ శాఖలు, ఆయా పథకాల ద్వారా మరో రూ.రెండు కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.1.50 కోట్లతో చీరాల పట్టణంలో మురికి నీటి వ్యవస్థ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు, నిధులను వెచ్చించడానికి పరిశీలిస్తామన్నారు. రూ.150 కోట్లతో



చీరాలలో ఫిషింగ్ హార్బర్ నిర్మించడానికి తయారు చేసిన డిపిఆర్ ను యుద్ధ ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపాలన్నారు చీరాల నియోజకవర్గంలో మరుగు నీటి వ్యవస్థను అభివృద్ధి చేయాలని చీరాల శాసనసభ్యులు ఎం మాలకొండయ్య జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాల్వల నిర్వహణ అధ్వానంగా ఉందని, నూతనంగా కాల్వలు నిర్మించాలన్నారు. స్మశాన భూమి ఆక్రమణకు గురవుతుందని, తక్షణమే ఆక్రమణలు తొలగించాలన్నారు. కాల్ మనీ తరహాలో వడ్డీ వ్యాపారులు ప్రజల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించాలని కోరారు. దెబ్బతిన్న రహదారులు నిర్మించాలన్నారు.చీరాల నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి జరిగేలా సహకరించాలని కలెక్టర్ కు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, చీరాల పురపాలక సంఘం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

## భావితరాల నిర్మాణానికి సరస్వతీ శిశుమందిర్‌లే పునాదులు : ఎమ్మెల్యే


**మాచర్లటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** దేశ భావి తరాల నిర్మాణానికి శ్రీసరస్వతీ శివుమందిర్‌లే పునాదులని శ్రీశైలం క్షేత్ర పీఠాధిపతులు శివస్వామి, స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఉద్ఘాటించారు. మాచర్ల పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ లైన్ 13వ వార్డులో శ్రీసరస్వతీ శిశు మందిర్ డివిజల్ పాఠశాల పునః ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన శివస్వామి, ఎమ్మెల్యే జేబీఆర్‌లకు సరస్వతీ విద్యాపీఠం విజయవాడ సమితి వారు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల తరగతి



గదులను అతిథుల చేతుల మీదుగా ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 25 వేలకుపైగా శిశుమందిర్ పాఠశాలలు విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందజేస్తున్నాయన్నారు. ఒత్తిడిలేని విద్యను అందించడం, చిన్నారుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీయడంలో శిశుమందిర్ పాఠశాలలు ఎంతో ప్రత్యేకమని చెప్పారు. ప్రజలు పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరారు. అనంతరం శివస్వామిని ఎమ్మెల్యే జూలకంటి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి జిగురు ప్రతాపసింహ శాస్త్రి, విభాగ కార్యదర్శి చిరుమామిళ్ల గోపీకృష్ణ, పల్నాడు జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ కనకంటి కోటేశ్వరరావు, మాచర్ల మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు, మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయశాఖ డిసికి వినతిపత్రం అందజేత

**చిలకలూరిపేటటౌన్,ఏప్రిల్21,ప్రభాతవార్త:** పట్టణంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న సీతారామస్వామి దేవస్థానానికి చెందిన ప్రస్తుతం ఉన్న రథం శిథిలావస్థకు చేరింది.



దీనిని గమనించిన పట్టణానికి చెందిన శ్రీ వినాయక ట్రస్ట్ సభ్యులు పాతరథం స్థానంలో కొత్తరథం నిర్మాణం చేస్తామని గుంటూరులోని దేవాదాయ,ధర్మాదాయశాక డిప్యూటి కమీషనర్ కెబి శ్రీనివాసరావును సోమవారం ఆయన కార్యాలయంలో కలసి రథం నిర్మాణానికి అనుమతి ఇవ్వవలసినదిగా వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో వినాయకట్రస్ట్ చైర్మన్ చంద్రపట్ల మణికుమార్, పొట్టి రత్నబాబు, వెల్లంపల్లి రాము, పొట్టి మహేంద్రరాజా తదితరులు పాల్గొన్నారు.

## లే అవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలి

**బాపట్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త:** లే అవుట్ల క్రమబద్ధీకరణలో నిబంధనలు పాటించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీక్షణ సమావేశ మందిరంలో బాపట్ల మున్సిపాలిటి మరియు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్ ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు పాల్గొన్నారు. 2019 నుండి మున్సిపాలిటీ మరియు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలోని అక్రమ లే అవుట్ల ను గుర్తించి వివరాలు తెలపాలని ప్రభుత్వం ఆదేశించిందని దానికి సంబంధించి మున్సిపాలిటీ, బాపుడా పరిధిలోని తొమ్మిది మండలాలలో మొత్తం 183 లే అవుట్లను గుర్తించి వాటి వివరాలను డిటిసిపికి పంపుతున్నామని, వివరాలను పత్రికలలో ప్రచురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. అందులో 86 లే అవుట్లు 22ఎ కింద గుర్తించి రిజిస్ట్రేషన్ కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్,స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కు పంపడమైనదని మిగిలిన లే అవుట్లను సబ్ డివిజన్లుగా చేసి పంపాలని వాటిని తిప్పి పంపారని వారు కలెక్టర్ కు వివరించారు. 183 లే అవుట్ల క్రమబద్ధీకరణకు సాధ్యాసాధ్యాలపై జిల్లా కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. కొత్త లేఅవుట్ల అనుమతులకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ల్యాండ్ కన్వర్షన్ కు, ఇంటి నిర్మాణాలకు సంబంధించి మునిసిపాలిటీ, బాపుడా, పంచాయతీ పరిధిలోని నిబంధనలను ప్రజలకు అర్థమయ్యే విధంగా తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లేఅవుట్ల క్రమబద్ధీకరణ ఆలస్యం అవుతుండటం, తద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి తగ్గుతుందని, బాపట్ల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని,వాటిని వీలైనంత త్వరలో నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, డిపిఒ ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి,బాపుడా ప్లానింగ్ అధికారి షేక్ ఖలీషా మరియు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో రక్తహీనత మాయం

### -ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.శ్యామల

**పొన్నూరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** గర్భిణిస్త్రీలు, బాలింతలు, పిల్లలు, పిల్లల తల్లులు పౌష్టికాహారం తీసుకున్నట్లయితే రక్తహీనతను మాయం చేయవచ్చని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.శ్యామల సూచించారు. వసతివాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ వెయ్యి రోజుల కార్యక్రమంలో భాగంగా సమావేశం జరిగింది. సమావేశంలో శ్యామల మాట్లాడుతూ రక్తహీనతను దూరం చేసే ఆహారపదార్థాలనుతప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీకేంద్రాలలోఅందించే ఆహారపదార్థాలను



తప్పనిసరిగా వినియోగించు కోవాలన్నారు. ఆకుకూరలు, లివర్ ఎక్కువగా తినాలన్నారు. ఇవి తినడం వల్ల రక్తహీనతను అరికట్టవచ్చన్నారు. మనిషికి తగ్గ ఎత్తు, బరువు ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పిల్ల ఎత్తు, బరువులను తూకం వేశారు. అందుకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భవతులు, బాలింతలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

# అభాగ్యులకు ఆధార్ కార్డు ఇప్పించండి సారూ!

**మాచర్ల, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మాచర్ల తహశీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో అంధునికి కంటి ఆపరేషన్ నిమిత్తం ఆధార్‌కార్డు మంజూరు చేయాలని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు. రైల్వేస్టేషన్లో నివాసం ఉంటూ రెండు కళ్లు పూర్తిగా కోల్పోయి జీవనానికి పూర్తిగా ఇబ్బంది పడుతున్న వ్యక్తికి గోవిందరెడ్డి




మూడుపూటలా భోజనం అందిస్తూ ఉన్నారు. అతని కళ్లు పూర్తిగా దెబ్బతినడంతో జీనవానికి ఇబ్బందిగా మారింది. కళ్లు ఆపరేషన్ చేయాలంటే ఆధార్ తప్పనిసరి. ఆధార్‌కార్డు ఇప్పించి ఇలాంటి అభాగ్యులకు సహాయం చేయాలని మాచర్ల తహశీల్దారు బి.కిరణ్‌కుమార్‌ను కోరారు. తహశీల్దారు వెంటనే స్పందించి వీలైనంత త్వరగా ఆధార్ కార్డు తెప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రకృతి వ్యవసాయసాగుతో భూమాతకు రక్ష

**నాదెండ్ల,ఏప్రిల్21,ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయవిధానంలో పంటలను సాగుచేస్తూ



అంతరపంటలు వేయడం ద్వారా రైతన్నలకు ఆదాయంతోపాటు భూమికి రక్షణపొంది కావాల్సిన సూక్ష్మపోషకాలు వృద్ధిచెంది భూమి ఆరోగ్యంగా ఉంటుందని డియంయంటి మల్లేశ్వరి తెలిపారు. సోమవారం మండలంలోని చిరుమామిళ్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రామంలోని రైతుసేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయవిభాగం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జి యస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో ప్రతిఒక్క రైతు భూమి విస్తీర్ణం, పంటలు, పాడి పశువుల వివరాలను వ్యవసాయశాఖ సిబ్బందికి తెలియచేయాలని కోరారు. తొలకరి వర్షానికి ముందు పియంబిఎస్ పిలిటైజేషన్ చేసుకొని పొలాల్లో చల్లుకోవాలని అన్నారు. పియంబిఎస్ చేయడం వలన భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందని, వానపాములు వృద్ధి చెందుతాయని అదేవిధంగా ప్రతిఒక్క రైతు వారి భూమిలో పిడియంఎస్ సాగుచేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వీఎఎ సుబ్బా రావు, ఐసిఆర్‌యంపి రైతులు,సభ్యులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

మాచర్లటౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: నాయీ బ్రాహ్మణుల రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు.



సోమవారం మాచర్ల వచ్చిన ఆయన నాయీ బ్రాహ్మణ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం, నాయీ బ్రాహ్మణులకు అన్ని దేవాలయాల పాలక మండలిలో సభ్యులుగా అవకాశం కల్పించడం, దేవాలయాల్లో కల్యాణ కట్టలో పనిచేసే క్షురకులకు నెలకు రూ.25 వేలు జీతం, ప్రతి మంగళషాప్‌కు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఆదరణ పథకం ప్రవేశపెట్టి, కులవృత్తి చేసుకుని జీవించే పేద నాయీ బ్రాహ్మణులకు ఉన్నతికి సహకరించాలన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు దుర్బాకుల ప్రసాదరావు, మాచర్ల హనుమంతరావు, కొర్రపాటి సుబ్బారావు, ముక్కరాల బ్రహ్మం, నాగేశ్వరరావు, కొలిపాకల వెంకటపిచ్చయ్య, మాచర్ల రాముడు, కూరపాటి శ్రీనివాసరావు, దుర్బాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్మశానవాటికలో బోరింగ్ పంపును ఏర్పాటు చేసిన సర్పంచ్ తోట శ్రీనివాసరావు

**రాజుపాలెం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండలంలోని చౌటపాపాయపాలెం ఆర్ఆర్ సెంటర్ (కొత్త బోదనం) గ్రామం స్మశానవాటికలో నీటి ఎద్దడి గుర్తించిన సర్పంచ్ తోట శ్రీనివాసరావు వెంటనే సమస్య పరిష్కారం దిశగా కృషి చేశారు. కొత్త బోరు సెట్టు తెప్పించి పంపును ఏర్పాటు చేయించారు. సమస్య ఏదైనా నేనున్నానంటూ ముందుకు వస్తున్న సర్పంచ్ తోట శ్రీనివాసరావు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అవరోధించాలని



మనస్ఫూర్తిగా ఆ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామ కూటమి నాయకులు కావూరి కోటయ్య, మాజీ సర్పంచ్ నాగరాజు, బాలస్వామి నాయక్, మెరుగు రత్తయ్య, వేల్పుల నరసింహారావు, గుడ్డిపల్లి అనీల్, కావూరి రత్నబాబు, బొద్దుపల్లి వెంకటేశ్వర్లు, వేమవారపు వెంకయ్య, గ్రామ తెలుగుదేశంపార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలు

**రాజుపాలెం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండలంలోని చౌటపాపాయపాలెం ఆర్ అండ్ ఆర్ సెంటర్ (కొత్త బోధన్) సర్పంచ్ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన పుట్టిన రోజు కేక్‌ను పార్టీ శ్రేణులలో కలిసి కట్ చేశారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం 75 సంవత్సరాలు ఉన్న చంద్రబాబునాయుడు 25 సంవత్సరాల యువకునిగా పని చేస్తున్న లీడర్ చంద్రబాబునాయుడు అని అన్నారు. ఆంధ్రుల రాజధాని అమరావతి సృష్టికర్త, స్వర్ణాంధ్ర సాధకుడు, ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పదం వైపు నడిపిస్తూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కొరకై పరితపిస్తున్న నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ చలివేంద్రం ప్రారంభం

**సత్తెనపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** గత ఆరు సంవత్సరాల నుండి వరుసగా వేసవికాలం మజ్జిగ పంపిణీని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కొత్త రామకృష్ణ, దేవరపల్లి కాశీవిశ్వనాథంలు తెలియజేశారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షులు బి.కొండలు చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. నాయకులు చౌట



శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవతి సుబ్బారావు, పెరుమాళ్ళ శివన్నారాయణ, జవ్వాజి రామ్మోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, రాఘవ, హరికృష్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

## పట్టణంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారి రఫీ సోమవారం తెలియజేశారు. సత్తెనపల్లిరోడ్డులోని అయ్యప్పస్వామి గుడి ఎదురు, సాయినగర్ 2,3,5 లైన్లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల న్నారు. ఉదయం 7 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం ఫీడర్ నుండి సరఫరా నిలిపివేస్తున్నావన్నారు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ అధికారి రఫీ కోరారు.

## డిఎస్సీ పరీక్షలకు 90 రోజులు సమయం ఇవ్వాలి

**సత్తెనపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** డిఎస్సీ పరీక్షలకు 90 రోజులు సమయం ఇవ్వాలని న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలకు దరఖాస్తు చేసినప్పటి నుండి 45 రోజులు మాత్రమే సమయం ఉందన్నారు. సమయాన్ని 90 రోజులకు పెంచాలన్నారు. అదే విధంగా వయోపరిమితి 44 ఏళ్ళ నుండి 47 ఏళ్ళకు పెంచాలన్నారు. ఎస్‌జిటి ఉద్యోగాలకు ఇంటర్‌లో 50 శాతం, స్కూల్ అసిస్టెంట్‌కు డిగ్రీలో 50 శాతం మార్కులు తప్పనిసరి చేయడం సరికాదన్నారు. అదే విధంగా రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేయాలని జొన్నలగడ్డ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

# హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

## -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరుతూర్పు,ఏప్రిల్21,ప్రభాతవార్త :** హజ్ యాత్రికుల కోసం కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని స్టార్ కన్వెన్షన్ లో హజ్ యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన వ్యాక్సినేషన్





కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు మొహమ్మద్ షరీఫ్ తోకలిసి ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా హజ్ యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఎమ్మెల్యే ప్రత్యేక భోజన వసతి కల్పించారు. అనంతరం యాత్రికులతో కొద్ది సేపు మాట్లాడారు. హజ్ యాత్రకు వెళ్లే వారు కొన్ని నిర్దిష్టమైన వ్యాక్సిన్‌లు తీసుకోవడం తప్పనిసరని చెప్పారు. వీటిలో మెనింజైటిస్, పోలియో, ఇన్ఫ్లుఎంజా వంటి టీకాలు అవసరమని వివరించారు. సౌదీ అరేబియా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ టీకాలు వేయించుకోవాలని ఆయన వివరించారు. రాష్ట్రంలో హజ్ యాత్రికుల సదుపాయాల కోసం అసెంబ్లీ వేదికగా ప్రస్తావించానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు షరీఫ్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లేవారు ఎల్లప్పుడూ తాజా సమాచారం కోసం హజ్ కమిటీ, సంబంధిత ప్రభుత్వ అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు. హజ్ యాత్ర చేయడమంటే దేవుని ఆశీర్వాదం పొందినట్టేనని పేర్కొన్నారు. హజ్ యాత్ర అత్యంత పవిత్రమైనది ..రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ భాహజ్ యాత్ర అత్యంత పవిత్రమైనదని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్ భాష అన్నారు సోమవారం గుంటూరులోని స్థానిక స్టార్ ఫంక్షన్ హాల్ లో జరిగిన హజ్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షరీఫ్ లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హజ్ కువెళ్లేవారు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించుకోవాలని అన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు బయలుదేరే వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. హజ్ యాత్రికులకు శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. హజ్ యాత్రకు వెళ్లేవారు వారి పూర్తి సమాచారం కోసం హజ్ కమిటీని సంప్రదించవచ్చని దాని ద్వారా పూర్తి సమాచారం తాము అందిస్తామని ఆయన చెప్పారు. అల్లా దీవెనలు ప్రతి ఒక్కరికి ఉంటాయని ప్రతి ఒక్కరు హజ్ యాత్ర దిగ్విజయంగా ముగించుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కేర్ డెంటల్ కాలేజ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ రసూల్ ఇంకా ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# సత్తెనపల్లి ఏర్పాటుకు శత్తెన్న పాత్ర ఎనలేనిది

**సత్తెనపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** వడ్డెర సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్డెర శత్తెన్న విగ్రహం ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా విగ్రహం వద్ద సంఘం నాయకులు సోమవారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి



మాట్లాడారు. సత్తెనపల్లి ఏర్పాటుకు శత్తెన్న ఎటువంటి పాత్ర పోషించారో తెలియజేశారు. సీనియర్ నాయకులు ఒంటిపులి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షులు వేముల శ్రీదేవి, పల్లపు పద్మ, పట్టణ అధ్యక్షులు పల్లపు లక్ష్మయ్య, సెక్రటరీ పాపారావు, పేరయ్య, అంకారావు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లను ఆక్రమిస్తున్న క్యాటరింగ్ నిర్వాహకులు

**సత్తెనపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో రామాలయం వెనుక నడిరోడ్డుపై క్యాటరింగ్ నిర్వాహకులు వంటలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదేమిటని అడిగిన వారిపై దాడులు చేస్తున్నారు. జయబాబు అనే నిర్వాహకుడు అటుగా వెళ్ళే ప్రజలను



ఇబ్బంది పెట్టడమే కాక దాడి చేస్తున్నట్లు బాధితులు తెలిపారు. స్థానికులు తమ గృహాలలోకి పొగ వస్తుందని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. క్యాటరింగ్‌ను రోడ్డుపై కట్టెలతో నిర్వహిస్తుండటంతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్‌శాఖ అధికారులు స్పందించి నడిరోడ్డుపై వంట చేస్తున్న జయబాబుపై తగు చర్యలు తీసుకోవాలని 21వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

## పల్నాడు జిల్లాలో యానిమేషన్ పేరుతో బడా స్కాం

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లాలో యానిమేషన్ పేరుతో స్కాం వ్యవహారం బట్టబయలైంది. రెండు సంవత్సరాల క్రితం విజయవాడ సత్యనారాయణపురంలో యూపిక్స్ పేరుతో యానిమేషన్ కార్యాలయాన్ని కిరణ్ అనే వ్యక్తి ప్రారంభించారు. యానిమేషన్ గేమ్ పేరుతో యూపిక్స్ గ్రూప్స్‌ను ప్రజలకు పరిచయం చేశారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అందరిని నమ్మించారు. కిరణ్ మాటలు నమ్మి రూ.100 - రూ.300 కోట్ల పెట్టుబడులను నరసరావుపేటకు చెందిన వారు యానిమేషన్ గేమ్ పేరుతో ఉన్న సంస్థలలో పెట్టుబడి పెట్టారు. మొదటిలో కొన్ని నెలలు క్రమం తప్పకుండా సంస్థ యజమాని కిరణ్ డబ్బులు చెల్లించారు. అయితే ఇటీవల కాలంలో పెట్టుబడిదారులకు ప్రతి నెల చెల్లించే చెల్లింపులు నిలిచిపోయాయి. ఒక నెల రోజులు సమయం ఇస్తే డబ్బులు మొత్తం తిరిగి చెల్లిస్తానని, దయచేసి తనపై ఒత్తిడి తేవద్దని గత నవంబర్‌లో కిరణ్ సెల్ఫీ వీడియో రిలీజ్ చేశారు. అయితే ఐదు నెలలు గడిచినా కిరణ్ కనిపించడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా యానిమేషన్ గేమ్ సంస్థలో పెద్ద మొత్తంలో బాధితులు పెట్టుబడులు పెట్టారు. నవంబర్ నెల నుండి అజ్ఞాతంలోకి వెళ్లిన కిరణ్ కొరకు బాధితులు గాలిస్తున్నారు. ఇటీవల థాయిలాండ్‌లో పౌరసత్వాన్ని కిరణ్ తీసుకొని తమను మోసం చేశాడని బాధితులు చెప్తున్నారు.

## కెఎల్‌యులో పూర్వ విద్యార్థుల ఆన్‌లైన్ ఔత్సాహిక సదస్సు

**తాడేపల్లి,ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ పూర్వవిద్యార్థుల సంబంధాల విభాగం ఆధ్వర్యంలో యువ పూర్వ విద్యార్థుల వ్యవస్థాపకుల సదస్సు సోమవారం ఆన్‌లైన్ విధానంలో ఘనంగా నిర్వహించారు.ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి సొంత వ్యాపారాలు స్థాపించిన కెఎల్‌యు పూర్వ విద్యార్థులు సుమారు 50మంది పాల్గొన్నారని కెఎల్ పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కెసిహెచ్ శ్రీకావ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎంతగా అభివృద్ధి చెందినా తమ మాతృ విద్యాలయం కెఎల్‌యు ను గుర్తు చేసుకుంటూ,సమయం కేటాయించి సదస్సులో పాల్గొనడం అభినందనీయమన్నారు. వర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసార ధివర్మ మాట్లాడుతూ తమ వర్సిటీ విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహిస్తూ,అవసరమైన వనరులను ,మెంటార్ షిప్‌లు,స్టార్టప్ మద్దతు వంటి అనేక సదు పాయాలను అందిస్తున్నట్లు వివరించారు. .కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ,ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవిఎస్ ప్రసాద్,డాక్టర్ కె.రాజశేఖరరావు,డాక్టర్ ఎన్,వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్,పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.సిహెచ్ శ్రీకావ్య తదితరులు పాల్గొన్నారు.

22-4Pg5.qxd:22-4Pg5.qxd 01/01/01 8:45 AM Page 1




# యెమెన్ యుద్ధ రహస్యాలు లీక్

## రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌పై దుమారం



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికాకు చెందిన కీలక రహస్యాలు లీక్‌అయినట్లు తెలుస్తోంది. యెమెన్‌పై చేపట్టిన భీకరదాడులకు ముందే దీనికి సంబంధించిన ప్రణాళిక బహిర్గతం అయినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే దీనికి సంబంధించి తాజాగా మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దాడులకు సంబంధించిన రహస్యాలను స్వయంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తన కుటుంబసభ్యులతో కూడా పంచుకున్నారని బయటకు పొక్కింది. తన ఫ్యామిలీ గ్రూప్‌చాట్‌లో దీని గురించి చర్చించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 15న యెమెన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దాడులను ప్రకటించారు. అయితే, అంతకంటే ముందే సిగ్నల్‌లోని ఓ గ్రూప్‌చాట్ ద్వారా ఈ యుద్ధ ప్రణాళిక బయటికి వచ్చినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అదే సమయంలో రక్షణ మంత్రి హెగ్సెత్ కూడా రెండో సిగ్నల్ చాట్‌ను ఉపయోగించి ఈ విషయాన్ని తమ కుటుంబసభ్యులు చెప్పినట్లు ఆంగ్లమీడియాలో కథనాలు వచ్చాయి. తన భార్య జెన్నిఫర్, సోదరుడు ఫిల్ హెగ్సెత్‌తో ఈ యుద్ధ ప్రణాళికలను పంచుకున్నట్లు వెల్లడించింది. హెగ్సెత్ భార్య ఫాక్స్ న్యూస్‌లో మాజీ ప్రొడ్యూసర్ కాగా, ఇక సోదరుడు హోంల్యాండ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అడ్వైజర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు హెగ్సెత్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇతర ముఖ్య అధికారులు ఉన్న సిగ్నల్ గ్రూప్ చాట్ నుంచి ఈ యుద్ధ ప్రణాళికలు బహిర్గతమయ్యాయి. ఈ చాట్‌లో ద అట్లాంటిక్ మ్యాగజైన్ ఎడిటర్ ఇన్ చీఫ్ జెఫ్రీ గోల్డ్‌బర్గ్ కూడా ఉన్నారు. యెమెన్‌పై దాడుల గురించి చర్చించడానికి రెండురోజుల ముందే తనను ఆ గ్రూప్‌లో చేర్చాలని జెఫ్రీ కోరారు. ఈ విషయాన్ని వైట్‌హౌస్ కూడా ధ్రువీకరించింది. ఈ లీక్‌లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని హెగ్సెత్, ట్రంప్ ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న వేళ మరో కథనం వెలువడటం మరింత ఆందోళనకరంగా మారింది. దీంతో రక్షణ మంత్రిని తొలగించాలని ప్రతిపక్ష డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, తాజా కథనాలపై పెంటగాన్, వైట్‌హౌస్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. హెగ్సెత్‌పై గతంలోనూ ఇలాంటి విమర్శలు వచ్చాయి. రక్షణ శాఖకు సంబంధించిన అధికారిక, రహస్య సమావేశాలకు భార్య, సోదరుడిని వెంటబెట్టుకునే వెళ్లేవారని ఆ మధ్య వార్తలు వచ్చాయి. మరోవైపు, యెమెన్ రాజధాని సనాలో సోమవారం తెల్లవారుజామున అమెరికా వైమానిక దాడులు చేపట్టింది. ఇందులో కనీసం 12 మంది మరణించగా, మరో 30 మంది గాయపడినట్లు హౌతీరెబల్స్ ఆరోగ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.



అంతరిక్షంలో స్పేడెక్స్ జంట ఉపగ్రహాలు



ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

# అంతరిక్షంలో రెండవ డాకింగ్ ప్రక్రియ ప్రారంభం

**శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** అంతరిక్షంలో రెండు ఉపగ్రహాల అనుసంధానం ప్రక్రియ విజయవంతంగా జరుగుతోంది. శ్రీహరికోట నుంచి గతంలో ప్రయోగించిన రెండు జంట ఉపగ్రహాలను ఒక్కచోటికి చేర్చి మళ్లీ వాటిని విడిపోయేలా చేయడమనే డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియను మొదటి దశలో పూర్తి చేశారు. ప్రస్తుతం రెండవ డాకింగ్ కార్యక్రమాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు చేపట్టారు. భూకేంద్రాల నుంచి ఈ జంట ఉపగ్రహాలను ఒక్క చోటికి చేర్చే ప్రక్రియలో భాగంగా ఏప్రిల్‌లో పరిశోధన ఉంటుందని గతంలోనే చెప్పి ఉన్నారు. ఆ మేరకు డాకింగ్ తర్వాత విద్యుత్ బదిలీ కూడా విజయవంతంగా జరిపి మరోసారి శాస్త్రవేత్తలు విజయవంతం కావడానికి కృషి చేశారు. దీనిపై ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ స్పందిస్తూ స్పేడెక్స్ యొక్క రెండవ డాకింగ్ కార్యక్రమం సున్నితమైనదిగా అభివర్ణించారు. ఇస్రో బృందాలు దీన్ని సమర్థవంతంగా తేలికగా నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అంతరిక్షంలో స్పేస్‌స్టేషన్ భారత్ స్వయంగా ఏర్పాటు చేసుకో వడానికి ముందుగా ఇటువంటి డాకింగ్, అన్‌డా కింగ్ పరిశోధనలు విస్తృతంగా జరపాల్సి ఉంది.

# అమెరికాను దెబ్బతీస్తే సహించను

## ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరిక!



**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** అమెరికా వాణిజ్యం విషయంలో అత్యంత కఠిన వైఖరిని అవలంబిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలకు మరో హెచ్చరిక జారీచేశారు. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాలు కాకుండా ఇతర రూపంలో అమెరికాను దెబ్బతీసే ఎనిమిది అంశాలను వెల్లడించి ఏదైనా దేశంవాటిని అనుసరిస్తున్నట్లు బయటపడితే తమ దేశంతో సంబంధాలు దెబ్బతింటాయన్నారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌సోషల్‌లో పోస్టుచేశారు. ఇప్పటికే ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించి ఒక్క చైనా మినహా మిగిలిన వాటికి 90రోజుల ఉపశమనం కల్పించిన విషయం విదితమే.

**ఏమిటా జాబితా ?, కరెన్సీ మేనిప్యులేషన్ :** చాలా దేశాలు తమ వస్తువులను అంతర్జాతీయ మార్కెట్‌లో చౌకగా విక్రయించేందుకు కరెన్సీ విలువలను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తాయి. గతంలో అమెరికా ఇలాంటి దేశాల జాబితాలను కూడా తయారుచేసింది.

**వాల్యూయాడెడ్ ట్యాక్స్ (వ్యాట్):** కొన్ని దేశాల ఉత్పత్తులపై వ్యాట్ విధిస్తాయి. కానీ, దిగుమతులపై వాటిని కొనసాగించినా.. ఎగుమతులపై ఆ సొమ్మును రీఫండ్ చేస్తుంటాయి. అలాంటి చర్యలు సహించమన్నారు. తక్కువ రేటుకు డంపింగ్ చేయడాన్ని కూడా ట్రంప్ తీవ్రంగా పరగణించారు. చైనా వంటి భారీ ఉత్పాదక దేశాలు.. కారు చౌకగా వస్తువులు తయారుచేసి ఇతర దేశాల్లో డంపింగ్ చేస్తాయి. దీంతో ఆయా దేశాల్లో స్థానిక పరిశ్రమలు మూతపడతాయి. ఎగుమతులపై ప్రభుత్వాలురాయితీలు ఇవ్వడాన్ని కూడా ట్రంప్ తప్పు పట్టారు. వ్యవసాయ రంగంలో దేశీయ రైతుల కోసం రక్షణాత్మక రాయితీలు కూడా ఇవ్వకూ డదని పేర్కొన్నారు. ఇవి కాకుండా నకిలీల తయారీ, మేధో హక్కుల అపహరణ, అమెరికా టారిఫ్‌లను తప్పించుకోవడానికి మరో దేశం నుంచి ఎగుమతి చేయడం వంటివి కూడా ఉపేక్షించమన్నారు.

ఇక ప్రత్యేకంగా జపాన్ నిర్వహించే ఓ పరీక్షను కూడా ట్రంప్ తప్పు పట్టారు. దేశీయ సంస్థలను కాపాడేందుకు రక్షణాత్మక సాంకేతిక ప్రమాణాలను ఏర్పాటు చేయకూడదన్నారు. దీనికి గాను జపాన్ నిర్వహించే బౌలింగ్ బాల్ టెస్ట్‌ను ఉదహరించారు. ఈ పరీక్షను జపాన్ 2018లో ప్రవేశపట్టింది. విదేశీ కార్లు తమ దేశంలో విక్రయించకుండా చూసేందుకు దీనిని మొదలుపెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరీక్షలు దాదాపు 20 అడుగుల ఎత్తు నుంచి బౌలింగ్ బాల్‌ను కారు హుడ్‌పై వదులుతారు. అప్పుడు దానికి సొట్ట (డెంట్) పడకపోతే అది పరీక్షలో విజయం సాధించినట్లు భావిస్తారు. ఇదో భయంకరమైన పరీక్షగా ట్రంప్ అభివర్ణించారు. ఇప్పటికే ట్రంప్ తాను విధించిన ప్రతీకార సుంకా లపై 90 రోజులు నిలుపుదలను అమలు చేస్తు న్నారు. కానీ, చైనాతో టారిఫ్‌ల యుద్ధం తారా స్థాయికి చేరింది. ఆ దేశంపై మొత్తం 243 శాతంవరకు పన్నులు వసూలు చేయాలని అమెరికా నిర్ణయించింది.

# పోలీసుల ముందు హాజరుకావాలి

## పూజా ఖేద్కర్‌కు సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగం సంపాదించిన వ్యవహారంలో ఆ మధ్య మాజీ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ పేరు మీడియాలో చక్కర్లు కొట్టింది. ఆమెపై యూపీఎస్సీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దీనిపై తాజాగా విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం మే 2న ఢిల్లీ పోలీసుల ముందు విచారణకు హాజరుకావాలని ఖేద్కర్‌ను ఆదేశించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు సోమవారం ఆర్డర్ వేసింది. కేసు తదుపరి విచారణను మే 21 కి వాయిదా వేసింది. అయితే అప్పటివరకు ఖేద్కర్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని కోర్టు పేర్కొంది. ఈ కేసులో కచ్చితమైన విచారణ జరగలేదన్న అత్యున్నత న్యాయస్థానం విచారణ త్వరగా ముగించాలని పోలీసులను ఆదేశించింది. పోలీసుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఖేద్కర్‌ను కస్టడీలో విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అయితే కోర్టు ఆమెకు మధ్యంతర రక్షణ కల్పించింది. పుణెలో ట్రెయినీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పూజా ఖేద్కర్‌పై అధికార దుర్వినియోగంతోపాటు, యూపీఎస్సీలో తప్పుడు పత్రాలు సమర్పించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెను ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి జాతీయ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది.

నకిలీ పత్రాలతో పరీ క్షను క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ దానిపై వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు లిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేయ డంతోపాటు అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దాంతో పూజా ఖేద్కర్ హైకోర్టును ఆశ్రయించారు. తాను ఏ పత్రాలను ఫోర్జరీ చేయలేదని తెలిపారు. యూపీఎస్సీకి తనపై అనర్హతవేటువేసే అధికారం లేదని వాదించారు. అయినా ఆమెకు నిరాశే ఎదురైంది. గత ఏడాది ఆగస్టులో ఆమె ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించగా కోర్టు మధ్యంతర రక్షణ కల్పించింది. కోర్టు దాన్ని ఎప్పటికప్పుడు పొడిగిస్తూ వస్తోంది.

# రాజీపడిన ఎన్నికల సంఘం: రాహుల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** కేంద్రం ఎన్నికల వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఆ వ్యవస్థ రాజీ పడినట్లు కనిపిస్తోందనడంతో పాటు అందులో పలు లోపాలున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ, బోస్టన్‌లోని ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన అమెరికా భారత్ సంబంధాలను గురించి కూడా ప్రస్తావించారు. ఇరుదేశాలు కలిసి పనిచేయాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. భారత ఎన్నికల సంఘం రాజీ పడింది. ఆ వ్యవస్థలో చాలా లోపాలు ఉన్నాయని మాకు స్పష్టంగా తెలుసు. ఇదే విషయాన్ని నేను చాలాసార్లు మాట్లాడాను. ఇటీవల మహారాష్ట్రలో ఎన్నికలు జరిగాయి. అక్కడ సాయంత్రం 5:30 నుంచి రాత్రి 7:30 గంటల మధ్య దాదాపు 65 లక్షల మంది ఓటు వేశారు. ఈ విషయాన్ని స్వయంగా ఎన్నికల సంఘమే మాతో చెప్పింది. ఇది భౌతికంగా అసాధ్యమైంది. ఒక్కో ఓటర్ ఓటు వేయడానికి దాదాపు 3నిమిషాల సమయం పడుతుంది. అంత తక్కువ వ్యవధిలో అంతమంది ఎలా ఓటు వేస్తారు. మేము వీడియోలు చూపించాలని అడిగితే ఈసీ తిరస్కరించింది. ఇప్పుడు అలా అడగటానికి వీలు లేదంటూ చట్టంలో కూడా మార్పుల చేశారు. రాహుల్ మరోవైపు కేంద్ర ఎన్నికల సంఘంపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడింది. ఆయన భారతీయ ఓటర్ల నమ్మకాన్ని పొందలేకపోయారని విమర్శించింది. ఈ మేరకు బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్యానికి, భారతదేశానికి వ్యతిరేకి అయిన రాహుల్ గాంధీ దేశీయ ఓటర్ల నమ్మకాన్ని గెలవలేకపోయారని దుయ్యబట్టారు. ఇప్పుడు విదేశీ గడ్డపై మన దేశ ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రశ్నించడం ప్రారంభించారని భండారీ విమర్శించారు. విదేశాల్లో భారత పరువును పదే పదే ఎందుకు తీస్తారని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. పార్టీ అధికార ప్రతినిధి షెహబాజ్ పూనావాలా స్పందిస్తూ, అమెరికాలో భారతీయ సంస్థలను, న్యాయస్థానాలను కించపరిచేలా ఆయన వ్యాఖ్యలు చేయడం సరైనది కాదన్నారు.



# పశ్చిమబెంగాల్ గవర్నర్‌కు అస్వస్థత

**కోల్‌కత్తా, ఏప్రిల్ 21:** పశ్చిమబెంగాల్ గవర్నర్ సివి ఆనందబోస్ ఛాతీలో నొప్పితో ఆస్పత్రి పాలయ్యారు. సోమవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో ఆయనను హుటాహుటిన కోల్‌కతాలోని కమాండ్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని రాజ్‌భవన్ అధికారులు వెల్లడించారు. గవర్నర్‌కు ప్రాథమిక పరీక్షలు చేశామని, ఆయన గుండెలో బ్లాకేజ్ ఉన్నట్లు గుర్తించామని కమాండ్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను కలిశారు. గవర్నర్‌ను కలిసి ఆస్పత్రి బయటికి వచ్చిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పుడే గవర్నర్‌ను చూసి వచ్చానని, ఆయనకు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ ఆదేశించానని చెప్పారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను కమాండ్ ఆస్పత్రి నుంచి అపోలో ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. అయితే గవర్నర్‌కు అస్వస్థతపై రాజ్‌భవన్ ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. కాగా గవర్నర్ ఆరో గ్యానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



# బైక్ అదుపుతప్పి మహిళ మృతి

**లక్నో, ఏప్రిల్ 21:** వాహనాల తనిఖీ సందర్భంగా ఒక పోలీస్ అధికారి లాఠీతో బైక్‌పై కొట్టాడు. బైక్ అదుపుతప్పడంతో భర్త వెనుక కూర్చొన్న మహిళ రోడ్డుపై పడింది. ఆమె మీద నుంచి డంపర్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించింది. దీంతో స్థానికులు రోడ్డును బ్లాక్ చేసి నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ఎస్ఐపై కేసు నమోదైంది. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి వేళ కళ్యాణ్‌పూర్ ప్రాంతానికి చెందిన ప్రదీప్ తన భార్య అమరావతితో కలిసి బైక్‌పై పెళ్లి వేడుకకు బయలుదేరాడు. కాగా, నిగోహి ప్రాంతంలోని ధూలియా మలుపు దగ్గర వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రిషిపాల్ లాఠీతో ప్రదీప్ బైక్‌పై కొట్టాడు. దీంతో అతడు బ్యాలెన్స్ కోల్పోయాడు. ఈ నేపథ్యంలో బైక్ వెనుక కూర్చొన్న ప్రదీప్ భార్య అమరావతి రోడ్డుపై పడింది. అదే సమయంలో డంపర్ లారీ ఆమె పైనుంచి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించింది. మరోవైపు స్థానికులు ఇది చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ మృతికి కారణమైన ఎస్ఐ రిషిపాల్‌పై మండిపడ్డారు. తెల్లవారుజామున 2 గంటల వరకు రహదారిని బ్లాక్ చేసి నిరసన తెలిపారు.

స్థానిక ఎమ్మెల్యే సలోనా కుష్వాహా కూడా అక్కడకు చేరుకుని ఎస్ఐ తీరును నిల దీశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ రిషిపాల్‌తోపాటు డంపర్ లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# సిద్ధివినాయక ఆలయంలో మస్క్ తల్లి ప్రత్యేక పూజలు



**ముంబయి, ఏప్రిల్ 21:** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తల్లి మయే మస్క్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖనటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ తో కలిసి ముంబైలోని ప్రముఖ సిద్ధివినాయక ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతు న్నాయి. మరోవైపు మయే మస్క్ తన 77వ పుట్టినరోజును భారత్‌లో సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ముంబైలో ఘనంగా పార్టీ అరేంజ్ చేశారు. ఈపార్టీకి 40నుంచి 50మంది హాజరైనట్లు ముంబై మీడియా తెలిపింది. ఇక తన బర్త్‌డే సందర్భంగా మయే మస్క్ ప్రముఖ డిజైనర్ సబ్యసాచి రూపొందించిన దుస్తుల్లో మెరిసిపోయారు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న తల్లికి టెక్ టైకూన్ మస్క్ ప్రైజింగ్ గిఫ్ట్ పంపారు. అందమైన పూలను తన తల్లికి బర్త్‌డే కానుకగా అందించారు. ఈ విషయాన్ని మయే మస్క్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.



# తదుపరి పోప్ ఎవరు?

**వాటికన్‌సిటీ, ఏప్రిల్ 21:** పీపుల్స్ పోప్‌గా ప్రసిద్ధిగాంచిన ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం కన్నుమూశారు. ఈ విషయాన్ని కార్డినల్ కెవిన్ ఫారెల్ వాటికన్ టెలిగ్రామ్ ఛానెల్‌లో ప్రకటించారు. దీంతో తదుపరి పోప్ ఎవరన్న అంశంపై చర్చ మొదలైంది. 2025 జనవరిలో జరిగిన సమావేశంలో ఇందుకు సంబంధించిన నిబంధనలను నిర్ణయించారు. కేవలం 80 లోపు వయసు ఉన్న కార్డినల్స్ మాత్రమే పోప్ ఎంపిక రహస్య ఓటింగ్‌లో పాల్గొననున్నారు. దీంతో మొత్తం 252 కార్డినల్స్‌లో 138 మందికి మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనే అర్హత ఉంది. దీనికి సంబంధించిన ఓటింగ్ సిస్టీన్ ఛాపెల్‌లో నిర్వహించనున్నారు. ఇది పూర్తిగా రహస్య విధానంలో జరుగుతోంది. ఓటింగ్‌లో పాల్గొనే ప్రతి కార్డినల్ ఓటింగ్ సమయంలో చర్చించిన అంశాలను రహస్యంగా ఉంచుతానని ప్రమాణం చేయాల్సి ఉంటుంది. దీనిని ఉల్లంఘిస్తే బహిష్కరణ వేటు పడుతుంది. రోజువారీ నాలుగు రౌండ్లు చొప్పున ఎవరైనా ఒక అభ్యర్థికి మూడింట రెండొంతుల మెజారిటీ లభించే వరకు ఓటింగ్ జరుగుతుంది. ఈ ఎన్నికల ప్రక్రియకు మొత్తం 15 నుంచి 20 రోజుల సమయం పట్టొచ్చు. కాకపోతే పోప్ జాన్‌పాల్-2 ఈ విధానంలో స్వల్పమార్పు చేసినట్లు చెబుతారు. తొలిరోజు ఎన్నికలో మాత్రమే మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అదే 10-12 రోజుల వరకు మెజారిటీ నెం బరును ఎవరూసాధించలేకపోతే ఆ తర్వాత సాధారణ మెజారిటీ వచ్చిన వారు పోప్ వారసుడిగా ఎన్నికవుతారు. ఇక్కడొక ఆసక్తికర అంశం ఉంది. నిర్వహించిన ఎన్నికల్లో ఎవరూ విజయం సాధించకపోతే బ్యాలెట్ పత్రాలను నల్లటి పొగను విడుదల చేసే ప్రత్యేక రసాయనాలతో కాల్చేస్తారు. అదే కనుక తెల్లటి పొగవెలువడితే పోప్ ఎన్నికైనట్లు సంకేతం. ఇదంతా సిస్టీన్ ఛాపెల్‌లో జరుగుతుంది. ఫ్రాన్సిస్ వారసత్వం కోసం పోటీ పడుతున్న వారిలో వాటికన్ సిటీ విదేశాంగ మంత్రి కార్డినల్ పీట్రోపారోలిన్, ఐరోపా బిషప్స్ కాన్ఫరెన్స్ మాజీఅధ్యక్షుడు పీటర్ ఎర్డో, కార్డినల్ పీటర్ టురుక్సన్ (ఘనా), కార్డినల్ టూయిగ్ టాగ్లే, కార్డినల్‌మాట్టో జుప్పీ, కార్డినల్ రేమాండ్ లియోబుర్కె పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

# కాల్పుల విరమణకు కట్టుబడిలేని రష్యా

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ



**కీవ్, ఏప్రిల్ 21:** ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని రష్యా ప్రకటించిందే కానీ ఆ మాటకు కట్టుబడి లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఈస్టర్ కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు తప్పుడు వైఖరిని రష్యా ప్రదర్శిస్తోందని విమర్శించారు. రష్యా ఎప్పటిలాగే తమపై దాడులు కొనసాగిస్తోందని, పదుల కొద్ది డ్రోన్, బాంబు దాడులు చేసిందని తెలిపారు. మరోవైపు కీవ్ బలగాలు కూడా దాడులు చేశాయని రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లోని అధికారులు ఆరోపిం చారు. తాత్కాలిక కాల్పుల విరమణను గౌరవిస్తున్నట్లు రష్యా సైన్యం చెబుతోంది. కానీ యుద్ధక్షేత్రంలో పైచేయి సాధించేందుకు, మా దేశానికి నష్టం కలిగించే ఏ అవకాశాన్నీ రష్యా వదులుకోవడం లేదు. 50కిపైగా బాంబు దాడులు, పదుల కొద్ది డ్రోన్ దాడులు చేసింది. ఈ ఉదయం 10 గంటల నుంచి దాడుల తీవ్రత మరింత పెరిగింది. అయితే రష్యా వైమానిక దాడులకు సంబంధించి సైరన్‌లు మోగకపోవడం కాస్త ఉపశమనం కలిగించే అంశం. పుతిన్‌కు తన సైన్యంపై పూర్తి నియంత్రణ లేదని, క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలిస్తుంటే యుద్ధాన్ని ముగించే ఉద్దేశం ఆ దేశానికి లేదనేది స్పష్టమవుతోందని జెలెన్‌స్కీ ట్వీట్ చేశారు. కాల్పుల విరమణ షరతులకు పూర్తిగా కట్టుబడి ఉండాలని ఆయన రష్యాను డిమాండ్ చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి 30రోజుల పాటు కాల్పుల విరమణను పొడిగించాలనే ప్రతిపాదనను పునరుద్ఘాటించారు. క్రిమియాపై రష్యా నియంత్రణను గుర్తించేందుకు తాము సిద్ధమేనని అమెరికా ప్రకటించిం. ఇదిలా ఉండగా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య శాంతి ఒప్పందంలో భాగంగా క్రిమియాపై రష్యా నియంత్రణను గుర్తించేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ శాంతి ప్రతిపాదన వల్ల రష్యాఉక్రెయిన్‌ల మధ్య తక్షణ కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌ను ఉక్రెయిన్ సహా ఐరోపా యంత్రాంగాలు పరిశీలించాయి. క్రిమియాపై రష్యా నియంత్రణ కొనసాగడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. మరోవైపు కష్టమైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా ప్రకటించడం గమనార్హం.

# యుఎస్‌తో వాణిజ్య ఒప్పందంలో జాగ్రత్త: చైనా హెచ్చరిక



**బీజింగ్, ఏప్రిల్ 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుంచి బయటపడేందుకు అనేక దేశాలు అగ్రరాజ్యంతో బిజీబిజీగా చర్చలు జరుపుతున్నాయి. అయితే, టారిఫ్‌ల నుంచి ఉపశమనం కావాలంటే చైనాతో ఆర్థిక బంధాన్ని తెంచుకోవాలని తన మిత్ర దేశాలకు ట్రంప్ సర్కారు షరతు పెట్టినట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలపై తాజాగా బీజింగ్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటే ప్రతీకార చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'చైనా ప్రజల ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఏ దేశమైనా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటే దాన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం. ఒకవేళ అలాంటి పరిస్థితి ఎదురైతే దాన్ని ఎన్నటికీ అంగీకరించబోం. మా నుంచి ప్రతిస్పందన కూడా అదేస్థాయిలో ఉంటుంది. ఇతరుల ప్రయోజనాలను పణంగా పెట్టి తాత్కాలికంగా, స్వార్థపూరితంగా లాభం పొందాలనుకోవడం.. పులి చర్మంకోసం దాంతోనే డీల్ చేసుకోవడం లాంటిది. దీని వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం చేకూరదు. స్వల్పకాలిక లాభాల కోసం వెళితే.. అది ఎప్పటికైనా మనకే హాని చేస్తుందన్న విషయాన్ని దేశాలు గుర్తుంచుకోవాలి. బుజ్జగింపులతో శాంతి స్థాపన జరగదు. రాజీ పడితే గౌరవం లభించదు' అని చైనా తమ ప్రకటనలో హెచ్చరించింది.

22-4Pg6exHMNWJQE.qxd:22-4Pg6exHMNWJQE.qxd 01/01/01 10:16 AM Page 1



# అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలి

## - రేర్ ఎర్త్స్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సులో వక్తల మనోగతం

**తిరుపతి విద్య ఏప్రిల్ 21 ప్రభాత వార్త :** భూమి లోపల లభ్యమయ్యే అరుదైన మూలకాలు మానవ అభివృద్ధికి దోహదం చేయాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఫిజిక్స్ విభాగం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ బయోటెక్నాలజీ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ సదస్సును చేపట్టాయి. సైన్స్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ రేర్ ఎర్త్స్ అంశంపై మూడు రోజులపాటు ఈ అంతర్జాతీయ సదస్సు కొనసాగనుంది.ఇందుకు సంబంధించిన ప్రారంభ సభ పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు.సుమారు 200 మంది దేశ,విదేశీ శాస్త్రవేత్తలు,యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పరిశోధకులు హాజరయ్యారు.పద్మావతి మహిళా యూనిర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ మాట్లాడుతూ.. భూమి లోపలి అరుదైన మూలకాలను వెలికి తీసే క్రమంలో వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా చూడాలని కోరారు. సేకరించిన అరుదైన మూలకాలను దేశ ప్రగతికి ఉపయోగపడేలా మార్చవలసిన బాధ్యత ఈ తరం శాస్త్రవేత్తలపై ఉందని గుర్తు చేశారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ అంతర్జాతీయ సదస్సుకు పద్మావతి యూనివర్సిటీ వేదిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు.ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూకంప్యూటర్స్, కమ్యూనికేషన్ వ్యవస్థ,లేజర్ సిస్టం లో అరుదైన మూలకాల పాత్ర ఎక్కువగా ఉంటుందని చెప్పారు. మానవ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో రేర్ ఎర్త్స్ బాగా తోడ్పడుతాయని అభిప్రాయపడ్డారు. శాస్త్ర చికిత్సలు చేయడంలోనూ రేర్ ఎర్త్ కిరణాలు ఉపకరిస్తాయని అన్నారు.థాయిలాండ్ కు చెందిన నిఖోన్ పాథమ్ రాజ్ భట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జాక్రపాంగ్ కియోఖో మాట్లాడుతూ యూరోపియం, నవేరియం, డెస్ప్రోజియం, నియోడియం,ఎటర్బియం వంటి అరుదైన మూలకాలు సమాజాభివృద్ధికి బాగా ఉపయోగపడే అవకాశం ఉందని అన్నారు. ఇండోనేషియా కు చెందిన బంధుంగ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ మిత్ర డి జమల్ మాట్లాడుతూ.. గడలోనియం తులియం హోల్మియం వంటి మూలకాలు అనేక రకాలుగా ఉపయోగపడతాయని చెప్పారు.

ప్రత్యేకించి రేర్ ఎర్త్స్ సౌర శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడంలో దోహదం చేస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో రేర్ ఎర్త్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ఎం ఎల్ పి రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సీకే జయశంకర్,అంతర్జాతీయ సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్ . జాన్ [illegible] అధ్యాపకులు,పరిశోధకులు,వివిధ ప్రాంతాల ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.



నిత్యాన్నదానానికి విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

# హుండీ లెక్కింపుల్లో రూ.3కోట్లు ఆదాయం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు సోమవారం లెక్కించగా రు.3,02,92,986ల నగదు, 440 గ్రాముల బంగారం, 5కెజిల 225 గ్రాముల వెండి లభించినట్లు ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. పద్దెనిమిది రోజులకు గాను హుండీల్లో భక్తులు ఈ కానుకలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్వచ్ఛంధ సేవకులు, దేవదాయశాఖ అధికారులు, సిబ్బంది, వన్‌టౌన్‌పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు. - నిత్యాన్నదానానికి విరాళం:దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష 4వేల 893లను కృష్ణాజిల్లా కేసరపల్లికు చెందిన బి నీలిమ సోమవారం ఆలయాధికారులకు అందించారు. దాతకు, వారి కుటుంబీలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- స్వర్ణశిఖరం పనులకు విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరిగే స్వర్ణశిఖరం పనలుకు రు.1లక్ష విరాళాన్ని సోమవారం విజయవాడకు చెందిన అట్లూరి రామమోహన్ ఆలయాధికారులకు అందించారు. దాతకు, వారి కుటుంబీలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# గ్రామీణ యువతకు సీడాప్ ఆధ్వర్యంలో శిక్షణ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున సీడాప్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందించటంతోపాటు,వారికి వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ చైర్మన్ గుణపాటి దీపక్ రెడ్డి తెలిపారు.మీడియాకు విడుదల చేసిన సమాచార ప్రతంలో సోమవారం తెలియజేశారు.. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా శిక్షణను అందిస్తున్నామన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణా కాలంలో వారికి ఉచితంగా భోజనంతోపాటు వసతి, యూనిఫామ్ మరియు కోర్స్ మెటీరియల్ అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా



సిడాప్ చైర్మన్ గుణపాటి దీపక్‌రెడ్డి

చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారని, అందులో భాగంగా సీడాప్ కూడా తనవంతు పాత్రిని నిర్వహిస్తుందన్నారు. ఒక వైపు డీఎస్సీ ద్వారా వేల ఉద్యోగాలు ఇంకోపక్క సీడాప్ ద్వారా నైపుణ్య శిక్షణ పొందిన తరువాత లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు.

ఇందుకోసం చాలా కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. శిక్షణ అనంతరం ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలు ఏర్పడుతుందన్నారు.

ఈ అవకాశాలను రాష్ట్రంలోని యువత అందిపుచ్చుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుచున్నామని తెలియజేశారు. కోర్స్ మరియు శిక్షణా కేంద్రాల వివరాలకు ఈ క్రింది లింక్ ను క్లిక్ చేయగలరు.. మరిన్ని వివరాలకు 0866 2571125, 80088 79191 సంప్రదించాలని కోరారు.

# రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా వేదికగా స్పందించాలి

## - రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి






సదస్సులో మాట్లాడుతున్న నాగార్జున రెడ్డి

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో** పాలకులను ఎప్పటికప్పుడు ప్రశ్నించకపోవడం వల్లే రాయలసీమ వెనుకబడిందని, కరువు పరిస్థితులు వస్తున్నాయని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు నాగార్జున రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ సమస్యలపై స్పందించాలని, రాయలసీమ ఉద్యమానికి సోషల్ మీడియా వేదికగా యువత, విద్యార్థులు స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలోని "ఫార్మసీ సెమినార్" హాల్‌లో సోమవారం "రాయలసీమ కరవునీటి సవాళ్లు, పరిష్కార మార్గాల సాధ్యాసాధ్యాల" పై సదస్సు జరిగింది. విద్యార్థులతో నిర్వహించిన సదస్సుకు విశిష్ట అతిథిగా పాల్గొన్న రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి గారు మాట్లాడుతూ.. రాయలసీమ ప్రాంత కరవుపై అనునిత్యం మొసలికన్నీరు కార్చే రాయలసీమ ప్రాంత నాయకులు రాని వర్షాలు కురిపిస్తామని "మేఘమధనం" చేయడం, నీళ్లే లేని సీమలో రెయిన్ కన్నులతోను, ట్యాంకర్లతోను రాయలసీమ ప్రాంత రైతుల పంటలకు నీళ్లు అందించి పంటలు పండిస్తామని పనికిమాలిన పథకాలను మన పాలకులు సీమలో ప్రయోగం చేయడాన్ని కూడా మన రాయలసీమ ప్రాంత ప్రజలుగా మనము ఏ రోజు ప్రశ్నించడం లేదు అన్నారు. అలా రాయలసీమ ప్రాంత ప్రజలు ప్రశ్నించడం లేదు కాబట్టి మన రాయలసీమ ప్రాంతానికి తీరని ద్రోహాలు నేటికి చేస్తూనే ఉన్నారు అని ఆందోళన చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న మన ముఖ్యమంత్రులు సిద్దేశ్వరం దగ్గర క్రిష్ణనదిపై కేంద్రం నిర్మిస్తున్న నేషనల్ హైవే లో బాగంగా తీగెల వంతెన నిర్మాణం బదులుగా బ్రిడ్జ్ కమ్ బ్యారేజీ నిర్మించాలని ఈ రోజుకు కోరక పోగా కర్ణాటక రాష్ట్రంలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర నిర్మాణాన్ని మన పాలకులు ఆపలేక పోవడంతో రాయలసీమ పశ్చిమ ప్రాంతానికి జీవనాధారమైన హెచ్ ఎల్ సి,ఎల్ ఎల్ సి ఆయకట్టు పూర్తిగా ఎడారి కాబోతోంది అన్నారు .ఇప్పుడు కూటమి ప్రభుత్వం 53వేల ఎకరాల అమరావతి రాజధాని ప్రాంతంలో మరో 44వేల ఎకరాలకు విస్తరింప చేసి మరోసారి నిర్బంధ అభివృద్ధి కేంద్రీకరణ కోసం రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీవ్రమైన అన్యాయము చేస్తున్నారు అన్నారు. గోదావరిబనకచర్ల అనుసంధానం చేస్తామ్ రాయలసీమ శశ్యసామలం చేస్తామని చెప్పే ఈ ప్రభుత్వం కేంద్రంలో కీలకమైన భాగస్వామ్యం ఉన్నప్పుడు రాయలసీమ ప్రాంతంలో ఉన్న తుంగభద్ర కృష్ణా నదులపైనే ప్రాజెక్టులను చంద్రబాబు నాయుడు నిర్మించవచ్చు కదా ఆయన నిలదీశారు. ఈ రోజు విద్యార్థుల శక్తి మేల్కొనకపోతే మన రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైతాంగం సర్వనాశము అవుతుంది,, సోషియల్ మీడియా పవర్ ను రాయలసీమ ఉద్యమానికి ఉపయోగించాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే ఈ మద్య కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని ఈ ప్రభుత్వ అధికారులు కూల్చి వేసినప్పుడు నేను వెంటనే సోషియల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఎంత భూములలో కాశినాయన జ్యోతి ఆశ్రమం ఉందో అంత అటవీశాఖ భూమికి బదులుగా నా స్వంత భూమిని ఇవ్వడానికి సిద్దం అని నేను పెట్టిన పోస్టు ఏకంగా 698మంది షేర్ చేయడంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలామంది నాకు ఫోన్లు చేసి ఏ రాజకీయ నాయకుడు కూడా మీ మాదిరిగా స్పందించలేదు కాబట్టి మీ వెనుక మేము కూడా ఉన్నాం అంటూ విపరీతంగా వైరల్ చేయడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి కాశినాయన జ్యోతి ఆశ్రమాన్ని పునర్నిర్మాణం చేయడం జరుగుతోందని ఆయన విద్యార్థులకు వివరించారు.

# టిడిపి నేత కెఎం.జకీవుల్లా అంత్యక్రియలకు తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు

**అనంతపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం టిడిపి నేత మాజీ రాజ్య సభ సభ్యుడు కెఎం.సైఫుల్లా కుమారుడు కెఎం.జకీవుల్లా అంత్యక్రియలకు పెద్ద ఎత్తున టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి నివాళులు అర్పించారు. రామ్‌నగర్‌లోని మాజీ ఎంపి సైఫుల్లా నివాసానికి టిడిపితోపాటు వైసిపి నాయకులు కూడా తరలివచ్చి కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. రాష్ట్ర మంత్రి సవిత హిందూపురం ఎంపి బికె.పార్థసారధి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, జెసి ప్రభాకర్‌రెడ్డి, పల్లె సింధూర రెడ్డి, దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర ముతవల్లి అసోషియేషన్ అధ్యక్షులు కెఎం.షకీల్ షఫీ, ఆయన తండ్రి కెఎం.షఫీవుల్లా తదితర బంధువులు కూడా కెఎం.జకీవుల్లా మృతదేహానికి నివాళులు అర్పించారు. టౌన్ బ్యాంక్ అధ్యక్షులు జెఎల్.మురళీధర్, టిడిపి నేతలు గడ్డం సుబ్రహ్మణ్యం, జయరామ్ నాయుడు, ఆలం నరసనాయుడు, రాయల్ మురళీ, సరిపూటి రమణ, బుగ్గయ్యచౌదరి, ఆదినారాయణ, తదితర టిడిపి నాయకులు కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ రాజ్య సభ [illegible] కె.ఎం.సైఫుల్లాను కూడా ఓదార్చి ధైర్యం చెప్పాడు. అదే విధంగా వైఎస్ఆర్‌సిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.విశ్వేశ్వర్‌రెడ్డి తదితర నాయకులు కూడా మాజీ ఎ ంపి సైఫుల్లా ఇంటికి వెళ్లి కె.ఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఇదే సమయంలో మాజీ ఎంపి కె.ఎం.సైఫుల్లా ఇంటి వద్దకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అభిమానులు తరలివచ్చారు. కెఎం.జకీవుల్లా మృతదేహానికి టిడిపి నేతలు ప్రత్యేకంగా టిడిపి జెండాను కప్పి నివాళులు అర్పించారు. కెఎం.జకీవుల్లా ఇంటి వద్ద నుంచి కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని ముస్లింల స్మశాన యాత్ర వరకు అంతిమ యాత్రను నిర్వహించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ తదితరులు పాడె మోయడం విశేషం. ముస్లిం సాంప్రదాయ పద్దతుల్లో ముస్లిం స్మశాన వాటికలో జరిగిన టిడిపి నాయకుడు కె.ఎం.జకీవుల్లా అంత్యక్రియలకు భారీగా నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నేతలు మాట్లాడుతూ.. కెఎం.జకీవుల్లా అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరం, పార్టీ కోసం జకీవుల్లా కుటుంబం ఎంతో చేసింది. గత ఎన్నికల్లో జకీవుల్లా అనంతపురం అర్బన్‌లో తిరిగి సీఎంగా చంద్రబాబును చూడాలని సైనికునిగా పని చేసినట్లు వారు తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉంటూ టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారన్నారు. కెఎం.జకీవుల్లా పార్టీకి చేసిన సేవలను గుర్తు పెట్టుకుంటామని చెబుతూ కెఎం.జకీవుల్లా కుటుంబ సభ్యులను నేతలు ఓదార్చారు.



కెఎం.జకీవుల్లా మృతదేహం వద్ద నివాలులు అర్పిస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యేలు

# శ్రీకూర్మం క్షేత్రంలో నక్షత్ర తాబేళ్ల మృత్యువాత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త ప్రతినిధి** ప్రపంచంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విష్ణు అవతారాల్లో రెండవది అయిన కూర్మావతారంతో వెలసిన ఏకైక దేవాలయం. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రెండు ధ్వజస్తంభాలతో శ్రీచక్ర యంత్రం స్థాపనతో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మంలో తాబేళ్ల మృత్యువాత సంచలనం రేకెత్తించింది. కూర్మావతారానికి ప్రతీకగా నిలిచిన నక్షత్ర తాబేళ్లను ఆలయం ఆవరణలో సంరక్షిస్తున్నారు. గ్రీన్ మెర్సి అనే సంస్థ ఈ తాబేళ్లను సంరక్షిస్తుంది. ఆదివారం ఈఓ కార్యాలయం వెనుక సుమారు 15 వరకు మృతి చెందిన తాబేళ్లను దహనం చేసి పుష్కరిణిలో నిమజ్జనానికి పాల్పడుతున్న సంఘటనను గమనించిన స్థానికులు ఆందోళన చెందడంతో ఒక్కసారిగా వెలుగు చూసింది. విశ్వహిందు పరిషత్ సభ్యులు, భక్తులు సోమవారం ఆలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఈఓ కార్యాలయం వెనుక గల సంఘటన స్థలాన్ని పరిశీలించారు. 212 తాబేళ్లు లెక్కల ప్రకారం ఉండాలని ప్రస్తుతం అన్నే ఉన్నాయని ఎమ్మెల్యే తెల్పడం విశేషం. దహనం చేసిన తాబేళ్ల అవశేషాలను పశుసంవర్ధకశాఖ అధికారులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఫారెస్ట్ అధికారులు అక్కడకు చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న తాబేళ్లకు వ్యాధులు ఉన్నది లేనిది పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బారువలో శనివారం బీచ్ ఫెస్టివల్ పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టారు. తాబేళ్ల గురించి చెప్పి 24 గంటలు గడవక ముందే మహావిష్ణువు అవతారమైన తాబేళ్లమృత్యువాత పడడం భక్తుల మనసు కలచి వేసింది.

# ముగిసిన చంద్రబాబు యూరప్ పర్యటన, నేడు ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో బేటీ

**విజయవాడ,ఏప్రిల్21,ప్రభాతవార్తప్రతినిధి:** యూరప్ వ్యక్తిగత పర్యటనపై వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు సోమవారం స్వదేశానికి తిరిగి రానున్నారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలోను,లేదా బుధవారం తొలిగంట తరువాత సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకోనున్నట్లు తెలుస్తోంది.తన 75వ పుట్టిన రోజు సందర్భంగా సీఎం నారా చంద్రబాబునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ దేశాల పర్యటనకు వెళ్లారు. మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసే అవకాశం ఉందని ఆ తర్వాత సీఎం షెడ్యూల్ ఖరారు కావల్సి ఉంది. కేంద్రమంత్రులను కలవనున్న సీఎం: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు, జలవనరుల శాఖ మంత్రి, న్యాయ శాఖ మంత్రితో సీఎం భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్నందున, సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కీలకం కానుంది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు సత్వర పూర్తి, పోలవరం బనకచర్ల అనుసంధాన

ప్రాజెక్టుపైనా ఢిల్లీలో మంతనాలు జరపనున్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగత పర్యటన నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 17వ తేదీన విదేశాలకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇవాళ అర్ధరాత్రి ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు.

అక్కడి నుంచి ఢిల్లీలో ముఖ్యమంత్రి అధికారిక నివాసం అయిన 1 జన్ పథ్ కు వెళ్లి అక్కడే బస చేయనున్నారు.

# క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచారం

**విజయవాడ,ఏప్రిల్ 21,ప్రభాతవార్తప్రతినిధి:** క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మరణవార్త తనను ఎంతో కలచివేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన సంతాపాన్ని తెలియజేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. పోప్ ఫ్రాన్సిస్ క్యాథలిక్ చర్చికి అధినేతగా విశేషమైన సేవలు అందించారని జగన్ కొనియాడారు. ఆయన హయాంలో చర్చి వ్యవస్థలో పరివర్తనాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది క్రీస్తు విశ్వాసులపై ఆయన చెరగని ముద్ర వేశారని తెలిపారు. లాటిన్ అమెరికా ప్రాంతం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎన్నికైన తొలి వ్యక్తిగా పోప్ ఫ్రాన్సిస్ చరిత్ర సృష్టించారని జగన్ కీర్తించారు. పోప్ ఫ్రాన్సిస్ కేవలం మత పెద్దగానే కాకుండా, ఒక నిజమైన మానవతావాదిగా నిలిచారని వైఎస్ జగన్ అభివర్ణించారు. ప్రపంచ శాంతి కోసం... పేదలు, అణగారిన వర్గాల పట్ల కరుణ చూపడంలో ఆయన ఎల్లప్పుడూ ముందున్నారని కొనియాడారు. ఆయన వినయం, మానవత్వం ప్రపంచాన్ని ఎంతగానో స్పృశించాయని పేర్కొన్నారు. శాంతి, కరుణ కోసం ఆయన గొంతుక ప్రపంచవ్యాప్తంగా వినిపించిందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను ప్రార్థిస్తున్నట్లు వైఎస్ జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచానికి, ముఖ్యంగా క్యాథలిక్ సమాజానికి ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు.

# మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల కుటుంబం ఆత్మ హత్యాయత్నం..

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో , ఏప్రిల్ 21 ప్రభాతవార్త** పెద్దాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మండపేట స్వీట్ స్టాల్ అధినేత కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు కుటుంబం సోమవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు ఈ సంఘటన పట్నంలో తీవ్ర కలకలం రేపింది. కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావ్ భార్య కనకాల మహాలక్ష్మి ౖ ప్రస్తుతం పెద్దాపురం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా వ్యవహరిస్తుండడం, పట్నంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన నేపథ్యం కలిగిన కనకాల కుటుంబం ఆత్మహత్యకు ప్రయత్నించడం తీవ్ర సంచలనంగా మారింది. గత కొంతకాలంగా తమ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద తీసుకున్న రూ 50 లక్షల రుణ భారం అధికం కావడం, వడ్డీలు కట్టమని సదరు వ్యక్తులు వేధిస్తుండడం తట్టుకోలేక తీవ్ర మనస్థాపనతో కనకాల కుటుంబం సోమవారం ఉదయం నిద్ర మాత్రల మింగి సామూహిక ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. తండ్రి సుబ్రమణ్యం, భార్య మహాలక్ష్మి ౖ, కుమారుడు గోవిందు ముగ్గురు సూసైడ్ నోట్ రాసి పురుల మందు సేవించిన ఘటన బయటకి తొక్కడంతో చుట్టుపక్కల వారు హుటాహుటిన వారిని స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు పలువురు టిడిపి వైసిపి శ్రేణులు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని ప్రత్యేక వాహనంలో కాకినాడ తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య స్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కనకాల సుబ్రహ్మణ్యేశ్వర రావు గతంలో మున్సిపల్ కౌన్సిలర్ గా వ్యవహరించారు. ప్రస్తుతం అతన్ని సతీమణి కనక మహాలక్ష్మి ౖ మున్సిపల్ వైస్ చైర్మన్గా వ్యవహరిస్తున్నారు. వైసిపి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇటీవల వైసిపికి పార్టీకి సభ్యత్వాలకు రాజీనామాలు చేశారు. నాటినుండి రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. వీరి కుటుంబం ఆత్మహత్యయత్నానికి పాల్పడం చర్చనీయాంశంగా మారింది.

## యూపీ సీఎంకు ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరించిన మంత్రి సత్య కుమార్ యాదవ్



**అనంతపురం,ఏప్రిల్ 22 , (ప్రభాతవార్త బ్యూరో)** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రసిద్ధిగాంచిన ధర్మవరం పట్టు వస్త్రం, నిమ్మలకుంట తోలుబొమ్మను బహుకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రివర్యులు సోమవారం యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన ధర్మవరం పట్టు వస్త్రాన్ని, నిమ్మలకుంట కళాకారులు రూపొందించిన శ్రీ కృష్ణుని తొలుబొమ్మను ఆయనకు బహూకరించి, ధర్మవరం పట్టు గురించి, నిమ్మలకుంట తోలుబొమ్మల విశిష్టత గురించి ఆయనకు వివరించారు. యోగి ఆదిత్యనాథ్ గారు సత్యకుమార్ ని సాదరంగా ఆహ్వానించి మథుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవాలని, అలాగే ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని మంత్రి సత్యకుమార్ ప్రత్యేకంగా సీఎం యోగి ఆదిత్యనాథ్ ని కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలి

### సిఐ పి వెంకటేశ్వర్లు

**జగ్గయ్యపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సైబర్ నేరాలపట్ల ప్రతిఒక్క పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, మోసగాళ్ళు రకరకాల ప్రలోభాలు, మార్గాల్లో ఖాతాల్లోని నగదును అపహరించే విధానాలపట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని పోలీసులు సూచించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో సోమవారం పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో పోలీసు అధికారులు, బ్యాంకర్లు పలుసూచనలిచ్చారు. విజయవాడ సిటి కమిషనర్ ఉత్తర్వులతో నందిగామ ఏసిపి ఆదేశాలతో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని 15 బ్యాంకుల అధికారులతో కలిసి సిఐ పి వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ బి రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ మీడియా సమావేశంలో అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు ఎక్కువగా బ్యాంకుల ఖాతాల ద్వారా జరుగుతున్నాయన్నారు.

## సీఎం చంద్రబాబునాయుడ్ని దూషించిన వైసిపి నేత అరెస్టు


**చేజర్ల (నెల్లూరు), ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు కూటమి నేతలను అసభ్యంగా దూషించిన చేజర్ల మండలం పాతపాడు గ్రామానికి చెందిన కాకుమూరి రాజీవ్‌రెడ్డిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.సిఎం చంద్రబాబుతోపాటు మరి కొందరు టిడిపి నేతలను తిడుతు వీడియో పోస్టు చేయడంతోపాటు వాట్సప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడు.నన్నుఎవ్వరు ఏమి చెయ్యలేరు. ఏమి పీకలేరు అంటు దురుసుగా మాట్లాడాడు.ఈ వీడియో బాగా వైరల్ అయింది.దీంతో కొందరు చేజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం.

# కొనుగోలు కేంద్రాలు తెరిచారు.. రైతన్న ఇబ్బందులు మరిచారు

## ధాన్యం ఏ మిల్లుకు కేటాయించాలో రాని స్పష్టత

### రైతులపై హమాలీ భారం

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం7337 కొనుగోలు కేంద్రాలను కేంద్రాలను ప్రారంభించామని పౌరసఫరాలశాఖ, కార్పొరేషన్ గణాంకాలు వండివార్చుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ధాన్యం సేకరణ రైతుకు శాపంగా మారింది. తేమకొలిచే యంత్రాలు మొరాయించడం, ప్రభుత్వ గోదాముల్లో భద్రపరిచే ధాన్యం హమాలీచార్జీల భారం రైతుపై వేయడం,హమాలీల కొరత వంటి బాలారిష్టాలు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాచేలా చేస్తున్నాయి. తెలంగాణలో ఏప్రిల్ నెల ఆరంభం నుంచి నిత్యం ఈదురుగాలులు,అకాలవర్షాలు, వడగండ్ల వానలు కురిసి ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంటను కళ్ళాల వద్ద వర్షార్పణం అవుతుండటంతో రైతులు కంట తడిపెడుతున్నారు. రబీసీజన్‌లో ఐకెపి,ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ఇతర ఏజెన్సీలతో కలిసి 8329 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరణ చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. ఇందులో 91శాతం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా అందులో అనేక సమస్యలు ఉండటంతో తూకం వేయడంలేదు. అనేక కొనుగోలు కేంద్రాలలో పక్షం రోజులకు పైగా ధాన్యం విక్రయానికి తెచ్చి కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు కాస్తున్నారు. ధాన్యంలో తేమ కొలిచే యంత్రాలు సరిగా పనిచేయకపోవడం కూడా ఇందుకు ఒక కారణంగా మారింది. అకాలవర్షాలు, వడగండ్ల కారణంగా రబీ సీజన్‌లో కూడా తేమను నిర్ధారించుకొని ధాన్యం కొనుగోలు చేయాల్సి వస్తున్నది. సగటు నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యంకు 14శాతం తేమ ఉండాల్సి ఉంటుంది. అంతకంటే ఎక్కువైతే కనీస మద్దతు ధరలో ఒక్కొక్క శాతానికి నిర్ధారించి పద్దతిలో ధరను తగ్గిస్తారు. తేమ యంత్రాలు సరిగా లేకపోవడంతో వేసవిలో కూడా ధాన్యంలో తేమ కొన్ని చోట్ల 29శాతం మించి చూపుతున్నాయి. మండే ఎండలో అంత తేమ ఉండదని రైతులు చెబుతున్నా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు మళ్ళీ ధాన్యం ఆరబోసి ఎండిన తరువాత తీసుకొని రమ్మంటున్నారు. పనిచేయని యంత్రాలు ఎంత ఎండబోసినా తప్పుడు తేమనే చూపుతున్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం ఖండెబల్లూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమను ఒక్కో యంత్రం ఒక్కో విధంగా చూపుతుండటంతో రైతులు సహకార సంఘం కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట,గోపురపల్లి, కాల్వాశ్రీరాంపూర్ గంగారం, తారుపల్లిలో కూడా తేమకొలిచేయంత్రాలు, ధాన్యంలోని మట్టి,ఇతరాలను వేరు చేయడానికి ఉండాల్సిన జల్లెడలు, ఆరబోత మిషన్లు సరిగా లేకపోవడం దీనికి తోడు హమాలీలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. రైతులు దొడ్డు రకాన్ని ట్రేడర్లకు విక్రయించి సన్నరకాలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని రైతులు భావించినప్పటికి కొనుగోలు కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో ఇక ఎంతకో కొంతకు అన్ని ప్రైవేట్‌కు విక్రయించు కొంటున్నారు. పక్షం రోజులుగా వర్షాలు పడుతుండటంతో అకాల వర్షంలో ధాన్యం తడవకుండా కాపాడుతోకోవడానికి ఎక్కడ కూడా టార్పాలిన్లు రైతులకు అందుబాటులో లేవు. హమాలీలు కూడా కొనుగోలు కేంద్రాలలో కొరతగా ఉండటంతో తూకం వేయడంలో కూడా జాప్యం జరగడానికి కారణమైంది. బీహార్ ఉత్తర్ ప్రదేశ్ నుంచి కూలీలు రావడం ఆలస్యం అవుతుండటంతో మెదక్ జిల్లా చేగుంట, హావేలి ఘనపూర్, వెల్దుర్తి, దౌంతి, మక్కరాజ్‌పేటలో రహదారులు, కళ్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు కుప్పలు,తెప్పలుగా పేరుకొని పోయాయి. మెదక్ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలోని 15 కొనుగోలు కేంద్రాలు, ఐకెపి ఆధ్వర్యంలోని ఐదుకొనుగోలు కేంద్రాలు మాత్రమే ధాన్యం సేకరణ చేస్తున్నాయి. మిగితా చోట్ల అనేక సమస్యలు సేకరణకు అడ్డుగ నిలుస్తున్నాయి. కాంటా వేసిన ధాన్యం బస్తాలను ఏ మిల్లుకు పంపాలో ప్రభుత్వం నిర్వహకులకు తెలపకపోవడంతో రైతుపై భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో సేకరణ చేసిన ధాన్యం బస్తాల దిగుమతి కేటాయించిన మిల్లు యజమానులు గతంలో భరించేవారు. ఇప్పుడు మిల్లులపై స్పష్టత రాకపోవడంతో రైతుపై భారం పడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో సేకరించి ధాన్యం ఏ మిల్లుకు కేటాయించాలో స్పష్టత లేకపోవడంతో గోదాముల్లో నిల్వచేసే ధాన్యం హమాలి కూలీ వ్యయం రైతుకు ఆర్థికభారంగా మారింది. మిల్లులకు కేటాయిస్తే రాష్ట్రవ్యాప్తంగా గతంలో దిగుమతి హమాలి వ్యయం మిల్లర్లు భరించేవారు. రైతుల నుంచి ఇప్పుడు కొన్ని చోట్ల రూ.8 నుంచి రూ.10 బస్తాకు వసూలు చేస్తున్నారని కొంత మంది రైతులు వాపోతున్నారు. కొన్ని చోట్ల 40కిలోల బస్తాకు 5రూపాయలు హమాలీ చొప్పున రైతుపై భారం వేస్తున్నారు. క్వింటాల్‌కు 12.5రూపాయలు హమాలీ ఖర్చు రైతుపై పడుతోన్నది. తుంగతుర్తి మండల కేంద్రంలో ధాన్యం రాశులతో కొనుగోలు కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి పదిరోజులైనా అక్కడ కాంటా మొదలు కాలేదు. ఎఇఓ తేమ శాతం కొలిచి కాంటా వేసేందుకు జాప్యం జరుగుతోంది. సూర్యాపేట జిల్లాలో సహకార సంఘాల ద్వారా కొనుగోళ్ళు మొదలయ్యాయి. కాంటా వేసిన బస్తాలు మిల్లులకు తరలించగా మిల్లర్లు సాకులు చూపుతూ బస్తాలు దింపుకోవడంలేదు. రైతులు మిల్లరు విధించే కోతలకు ఒప్పుకోవాల్సి వస్తున్నది. దీనికి తోడు ఒక్కో మిల్లుకు కేవలం వెయ్యి ,పదిహేను వందల క్వింటాళ్ళమేరకు ధాన్యం దిగుమతికి అనుమతి ఇవ్వగా వారి లక్ష్యం రెండురోజుల్లో కేటాయింపుల పరిమితి పూర్తికావడంతో మిల్లర్లు చేతులు ఎత్తేస్తున్నారు.



# చెన్నమనేని రమేష్ జర్మనీ పౌరుడే!

## హైకోర్టు తీర్పు.. పదేళ్ల క్రితం ఎమ్మెల్యే అయ్యేవాడిని : ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ భారత పౌరుడు కాదని, జర్మన్ పౌరుడని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ఆయన పౌరసత్వంపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేయగా తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు సోమవారం తీర్పును వెల్లడించింది. తప్పుడు పత్రాలతో 15 ఏళ్ల పాటు ప్రభుత్వ అధికారులు, న్యాయస్థానాలను చెన్నమనేని రమేశ్ తప్పుదోవ పట్టించారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చెన్నమనేని పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం సమర్థించింది. అలాగే ఆయనను రూ.30 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఇందులో పిటిషనర్ ఆది శ్రీనివాస్‌కు రూ.25 లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి రూ.5 లక్షలు చెల్లించాలని తెలిపింది. న్యాయస్థానం తీర్పుపై అప్పీల్ చేయకుండా తన తప్పును ఒప్పుకుని చెన్నమనేని రమేశ్ రూ. 30 లక్షల ఫైన్ చెల్లించారు. చెన్నమనేని రమేష్ తప్పుడు పత్రాలు సృష్టించి ఎన్నికల్లో పోటీ చేయకుంటే పదేళ్ల క్రితం ఎమ్మెల్యే అయ్యేవాడినని అంటూ వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ తీర్పుపై వ్యాఖ్యానించారు. వేములవాడ నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన రమేష్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆది డిమాండ్ చేశారు. చెన్నమనేని భారతీయుడు కాదని నేను మొదటి నుంచి చెబుతూనే ఉన్నాను పదిహేనేళ్ళ సుదీర్ఘ పోరాటంలో న్యాయం గెలిచిందని అన్నారు. కోర్టులపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

# పని చేస్తేనే గుర్తింపు

## ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** గుర్తింపు కోసం మనం ఎవరి వెంట పడాల్సిన అవసరం లేదని మనం చేసే పనిని సక్రమంగా చేస్తే గుర్తింపు దానికదే వస్తుందని,ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టర్ కమలాహసన్ రెడ్డి అన్నారు. సోమవారం అబ్కారీ భవన్‌లోని సమావేశ మందిరంలో 50 మంది సిబ్బందికి డైరక్టర్ చేతుల మీదుగా క్యాష్ రివార్డులను అందచేశారు. ప్రధానంగా కేసుల డిటెక్షన్, నిందితులను రికవరీ చేసిన సొమ్మును డిస్పోజల్ చేయడం, నిందితులకు కన్విక్షన్ పడే విధంగా చార్జి షీట్‌ను దాఖలు చేయడం, మంచి కేసులను పట్టుకోవడం,ఇతర రాష్టాల్లో కేసుల్లో ఉన్న నిందితులను పట్టుకోవడం చేసినప్పుడే ప్రతి ఒక్కరికి మంచి పేరు వస్తుందన్నారు. ఎక్సైజ్‌శాఖలో ప్రతిభ కనదరిచిన వారికి చేయూత అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వంతో పలుమార్లు మాట్లాడి క్యాష్ రివార్డులకు కావాల్సిన నిధులను తీసుకవచ్చామన్నారు. మరింతగా మరింతగా శ్రమించి మంచి కేసులను పట్టుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. సంగారెడ్డిలో వరుసగా నిందితులకు శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టడం, సంగీతా సాహు లాంటి గంజాయి డాన్‌తోపాటు ఒరిస్సా నిందితలను పట్టుకొని అరెస్టు చేయడం బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, మెదక్ అసిస్టెంట్ కమిషనర్ జి. శ్రీనివాసరెడ్డి,టీం లీడర్లు నంద్యాల అంజిరెడ్డి, ప్రదీప్‌రావు, తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్‌లు పాల్గొన్నారు.

# వేములవాడ అభివృద్ధికి నిధులు తెస్తా

## కరీంనగర్ అభివృద్ధి కోసం పట్టుదలతో పనిచేస్తున్నా

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

**వేములవాడ, ప్రభాతవార్త :** వేములవాడ ఆలయ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, ఈ ఏడాది ఖచ్చితంగా కేంద్రం నుంచి నిధులు తీసుకొని అభివృద్ధి చేస్తానని, ఈ విషయంలో మొండి పట్టుదలతో ఉన్నానని, అంతేగాకుండా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం అహర్నిషలు కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో ప్రతి గ్రామానికి రూ.5లక్షల చొప్పున ఉపాధి హామీలిచ్చామని, సిఎస్ఆర్ ఫండ్స్ కింద వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన కొందరు కావాలని తాను నయా పైసా కూడా తేలేదని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. వాటిని జనం నమ్మే పరిస్థితి లేదని, జిల్లాకు నవోదయ స్కూల్ మంజూరు చేయించిన, సైనిక్ స్కూల్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నాని, ఏ ఉద్యమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేయక పోయిన కాంగ్రెస్‌కు అధికారం లభించడంతో ప్రజలను పట్టించుకోవడం లేదని, గత 17 నెలలుగా కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయక పోవడంతో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ, చెన్నమనేని వికాస్ రావు, జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, సీనియర్ న్యాయకులు రేగుల మల్లికార్జున్, దళిత మోర్చ నాయకులు, కార్యకర్తలున్నారు.



కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు సన్మానం చేసిన దృశ్యం

# విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

## 29న రాష్ట్రవ్యాప్తంగా చలో కలెక్టరేట్ల ముట్టడి

### ఎంపి ఆర్.కృష్ణయ్య పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజులు చెల్లిందాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ముట్టడికి జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు,రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో జరిగిన బిసి విద్యార్థుల కోర్ కమిటీ సమావేశానికి నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ ఉద్యమాన్ని తీవ్ర తరం చేయాలని నిర్ణయించారు. మూడేళ్లుగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు చెల్లించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి స్కాలర్‌షిప్‌లకు కూడా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. గత నాలుగు నెలలుగా విద్యార్థులు రోడ్లమీద వచ్చి ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం పెట్టించుకోవడంలేదని, కాంట్రాక్టర్లకు వేలకోట్ల రూపాయలు బిల్లులు మాత్రం చెల్లిస్తున్నారన్నారు. ఒక కాంట్రాక్టుకు ఇచ్చే బిల్లులతో 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు చెల్లించవచ్చన్నారు. ఆర్థిక శాఖ మంత్రికి కాంట్రాక్టర్లు అంటే చాలా ప్రేమ ఉంది. కానీ విద్యార్థులు అంటే పట్టించుకోవడం లేదు. తన వైఖరి మార్చుకోకపోతే తీవ్రంగా తిరుగుబాటు జరుగుతుందని హెచ్చరించారు. గతంలో స్కాలర్ షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు నాలుగు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కాలేజీ బంద్ చేస్తే విద్యార్థుల చదువు దెబ్బ తింటుందని కాలేజీ యాజమాన్యాలకు నచ్చజెప్పి పునఃప్రారంభం చేశామని చెప్పారు. ఫీజులు, స్కాలర్‌షిప్ చెల్లించకపోవడంతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సటీ పరిధిలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ విద్యార్థులు పరీక్షలకు బహిష్కరించాలని ప్రస్తుతం నిర్ణయించుకున్నారని తెలిపారు. ఎంత ఆందోళన జరుగుతున్న ప్రభుత్వానికి బుద్ధి రావడంలేదని విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో ప్రభుత్వం తెచ్చిన అప్పులు లక్ష40 వేల కోట్లు. వస్తున్న ఆదాయ ఎంత..అందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లిందారు? ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో శ్వేతపత్రం విడుదల చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు ఇప్పటికైన ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు,ఫీజుల బకాయిలు 4వేల కోట్లు తక్షణమే చెల్లిందాలని డిమాండ్ చేశారు. . ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సులలో సీట్లు వచ్చిన చదవలేక పోతున్నారు. అలాగే ఉద్యోగాలు వచ్చిన సర్టిఫికెట్లు లేక ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఈ సమావేశంలో నీల వెంకటేష్, అంజి, రాందేవ్ మోదీ, గొరిగే మల్లేశ్, అనంతయ్య, రాజునేత, రాజేందర్, రవికుమార్ యాదవ్ తదితరులు మాట్లాడారు.

# వజ్రోత్సవాలకు పాలపర్రు ఎస్. ఎన్. ఎచ్ స్కూల్ సిద్ధం !

**ప్రత్తిపాడు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని పెదనందిపాడు మండలం పాలపర్రు గ్రామంలో 1950 సంవత్సరములో ప్రారంభించిన కీర్తిశేషులు ముద్దన చెంచయ్య గారి ఆధ్వర్యంలో ఏర్పాటైన శ్రీ నారసింహ ఉన్నత పాఠశాల మే 10 వ తారీఖున వజ్రోత్సవాలకు సిద్ధం కానుంది. ఈ కార్యక్రమానికి ముందుగా ఈ పాఠశాలలో చదువుకున్న




అనేకమంది విద్యార్థినీ విద్యార్థులు అనేక ప్రాంతాల్లో చదువుకున్నటువంటి వారు ఉద్యోగాలు చేసే వారు వృత్తి వ్యాపార ఉద్యోగాలతో ఆయా ప్రాంతాల్లో ఉన్నట్టు వంటి పూర్వపు విద్యార్థులు అందరూ మే 10న జరుగుతున్న పూర్వపు




విద్యార్థుల వజ్రోత్సవ వేడుకలకు ముందుగా అనేకమందిని విద్యార్థులను సమీకరణ నిమిత్తం బహుబక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిన్నటి దినాన గుంటూరులోని కాటన్ కార్పొరేషన్ కార్యాలయము నందు వజ్రోత్సవాల లోగోను మాజీ మంత్రివర్యులు డాక్టర్ మాకినేని ఫెదరత్తయ్య గారి ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులైన ఆయా రంగాల్లో నిష్టాతులై మేధావులైన ప్రముఖులు పాల్గొన్నారు.

# సెర్ప్‌లో సాధారణ బదలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** సెర్ప్‌లో 10 గత పది సంవత్సరాల నుంచి పని చేస్తున్న ఉద్యోగుల బదిలీకి రంగం సిద్దమైంది. ఈ మేరకు పంచాయితీ రాజ్‌శాఖ వంత్రి సీతక్క ఆదేశాల మేరకు 3974 మంది సాధారణ ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గత పది సంవత్సరాలుగా బదిలీలు లేక పోవడంతో తమను బదిలీ చేయాలని సెర్ప్ ఉద్యోగులు అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను జారీ చేసింది. అనేక మంది సిబ్బంది సంవత్సరాలుగా ఒకే చోట ఉండిపోడంతో సంబంధిత పనుల్లో వేగం తగ్గింది. దీన్ని దృష్టిలో పెట్టకున్న పనుల్లో స్పీడ్ పెంచడమే కాకుండా నాణ్యవంతమైన సేవలు పొందేందుకు వారిని బదలీ చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సెర్ప్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా శక్తి పాలసీ, మహిళా సంఘాలకు స్వయం ఉపాధి నుంచి ఉపాధి కల్పిన, సంపద సృష్టి దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సెర్ప్‌లో ఒకే సారి పెద్ద సంఖ్యలో బదిలీల చేయడం ద్వారా సెర్ప్‌లో నూతన ఉత్సాం నింపినట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# టూరిజం హబ్‌గా నిర్మల్ జిల్లా

## ప్రణాళికలు సిద్ధం చేస్తున్న అధికారులు

**హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** తెలంగాణను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. చారిత్రక కోటలు, జల పాతాలు, అభయారణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. బాసర నుంచి కవ్వాల్ వరకు టూరిజం కారిడార్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. దీని ద్వారా స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణను పర్యాటకానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వతం కృషి చేస్తున్న సంగతి తెలిసిందే.

చార్మిత్రక నేపథ్యం ఉన్న ప్రాంతాలతో పాటు కట్టిపడేసే ప్రకృతి అందాలను ఆస్వాధించేలా పర్యటక రంగానికి సరికొత్త సొబగులు అద్దేందుకు అధికారుల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణలో ఆయా ప్రాంతాలను టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతూ పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తోంది.

ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాకు కూడా రాష్ట్ర పర్యాటక పటంలో ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించనున్నారు. చారిత్రక వైభవం ఉట్టిపడే కోటలు, బురుజులు,కనువిందు చేసే సహజ సిద్ధమైన జలపాతాలు, అద్భుతమైన వన్యప్రాణులతో కూడిన అభయారణ్యాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, జిల్లాను టూరిజం హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ కృషి చేస్తోందని అధికారులు చెబుతున్నారు. గత కొద్ది రోజులు క్రితం టూరిజం శాఖ కార్పోరేషన్ ఎండి పటేల్ రమేశ్ రెడ్డి స్వయంగా నిర్మల్‌లోని చారిత్రాత్మక బంగల్‌పేట చెరువు నడిబొడ్డున కొలువై ఉన్న బురుజును, శతాబ్దాల చరిత్రను తనలో నింపుకున్న శ్యామ్‌గడ్ కోటను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అర్జుమంద్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల చారిత్రక ప్రాధాన్యతను, అభివృద్ధికి ఉన్న అవకాశాలను ఆయన అధికారులతో చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పటేల్ రమేశ్ రెడ్డి.. నిర్మల్ జిల్లా ఒక అద్భుతమైన చారిత్రక, సహజ సంపదలకు నిలయమని కొనియాడారు. శిథిలావస్థలో ఉన్న కోటలు, బురుజులకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.

ముఖ్యంగా విద్యాక్షేత్రంలో ప్రసిద్ధి గాంచిన బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం నుంచి ప్రకృతి అందాలకు నెలవైన కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ వరకు ఒక ప్రత్యేకమైన టూరిజం కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీనికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమవుతున్నాయన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత్తు బాధితుడు

# మత్తు కోసం మెడికల్ డ్రగ్స్ వినియోగం

## మైనర్ మృతి.. మరో ఇద్దరు ఆస్పత్రి పాలు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మత్తు రావడం కోసం మెడికల్ షాపులో విక్రయించే మత్తుకు సంబంధించి డ్రగ్స్ (టాబ్లెట్లు)తో పాటు ఇంజక్షన్‌లను అధిక మోతాదులో తీసుకున్న ముగ్గురిలో ఒకరు మృత్యువాత పడగా మరో ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. మత్తుకు బానిసై ప్రాణాలు కోల్పోయిన బాధితుడు మైనర్ కావడం గమనార్హం. ఆస్పత్రి పాలైన ఇద్దరిలో మరో మైనర్ బాలుడు, ఓ యువకుడు ఉన్నాడు. ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపు ఓనర్ మత్తును కలిగించే ఔషధాలను వారికి విక్రయించడం వల్లే ఈ అనర్థం జరగడం కలకలం రేపింది. హైదరాబాద్ నగర శివార్లలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. స్థానిక సులా _న్‌పూర్ టౌన్‌షిప్‌కు చెందిన మైనర్ బాలుడు, కొత్తపేట్‌కు చెందిన మరో మైనర్ బాలుడు, బాలాపూర్ రాయల్ కాలనీకి చెందిన షాబాజ్ (22)లు స్నేహితులు. మత్తుకు అలవాటు పడిన వీరు మెడికల్‌కు సంబంధించిన కొన్ని రకాల డ్రగ్స్ తీసు కుంటుంటారు. ఈ క్రమంలో మూడురోజుల క్రితం టాబ్లెట్లతోపాటు ఇం జెక్షన్‌లను కొనుగోలు చేసిన వారు నిర్మానుష్య ప్రదేశం వాటిని తీసుకొని అప స్మారక స్థితిలోకి వెళ్లారు. పరిస్థితి గమనించిన వారు ఆసుపత్రికి ముగ్గురిని తరలించారు. అయితే చికిత్స పొందుతూ మైనర్ బాలుడు ఉస్మానియా ఆసుపత్రిలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మరో మైనర్ బాలుడు, యువకుడు పిసల్‌బండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. మృతి చెందిన బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలాపూర్ షాహిన్‌నగర్ ప్రాంతానికే చెందిన సాహిల్ అనే వ్యక్తి మెడికల్ డ్రగ్స్‌ను వారికి విక్రయించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. దీంతో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొన్నట్లు సమాచారం. ఈ ఉద ంతంపై బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎసిబికి పట్టుబడిన మణుగూరు సిఐ

## సహకరించిన ఛానల్ రిపోర్టర్‌పై కూడా కేసు నమోదు

### లక్ష నగదు స్వాధీనం చేసుకున్న అధికారులు

**మణుగూరు, ప్రభాతవార్త, ఏప్రిల్ 21 :** ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడిలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌తో పాటు ఓ ఛానల్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోపీ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికారు. ఈ మేరకు సోమవారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని గుట్టమల్లారం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 49, 33లలో పలువురు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా భూవ్యాపారం నిర్వహించినందున సదరు వ్యక్తులపై ల్యాండ్‌గ్రాబింగ్ కేసు నమోదుచేయవలసిందిగా ఇటీవల మణుగూరు తహశీల్దార్ ఎస్‌హెచ్‌వో మణుగూరుకు ఓ వ్రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు. ఈ కేసుకు సంబంధించి వివాదాస్పద ప్రభుత్వ భూమిని అమ్మిన వ్యక్తుల పేర్లు బహిర్గతమవడంతో వారిపై కేసు నమోదు కాకుండా చూసేందుకు జరిగిన తంతులో భాగంగా ఈ అవినీతి నిరోధకచట్టం అధికారులు పక్కా సమాచారంతో మణుగూరు పోలీస్‌స్టేషన్‌పై దాడులు నిర్వహించారు. మణుగూరు తహశీల్దార్ ఇచ్చిన ఫిర్యాదును ఆసరగా చేసుకొని ప్రభుత్వ భూమిని అమ్మి సొమ్ముచేసుకున్న వ్యక్తులపై కేసులు నమోదుచేయకపోగా అందుకు పరిహారంగా లంచం ఇవ్వాలంటూ మణుగూరు సీఐ సతీష్‌కుమార్ డిమాండ్ చేసిన నేపథ్యంలో ఆర్థిక లావాదేవాల నిర్వహణ కోసం గోపీ అనే వ్యక్తిని సతీష్‌కుమార్ మధ్యవర్తిగా వాడుకున్నారని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా బేతం చర్ల వెంకటేశ్వర్లు, కూరాకుల శ్రీనివాసరావు అనే వ్యక్తులను రూ.4లక్షలు సీఐ డిమాండ్ చేసినట్లుగా తమకు స్పష్టమైన సమాచారం ఉందని తెలిపారు. రూ.3లక్షలు తాను చెల్లించవలసిన బాకీకి బదలాయింపు చేయాలని, రూ.1లక్ష నగదు ఇవ్వాలని సీఐ కోరిన మేరకు మధ్యవర్తి గోపీకి సోమవారం నగదు అందజేస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా దాడిచేసి గోపీని అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. గోపీ ఇచ్చిన వాగ్మూలం ఆధారంగా మణుగూరు సీఐ సతీష్‌కుమార్‌ను స్టేషన్‌లో విచారించిన మీదట ఇరువురిపై భారత న్యాయసంహిత చట్టంలోని 318(4), 329(3) సెక్షన్లతో పాటు తెలంగాణ స్టేట్ గేమింగ్‌యాక్ట్ సెక్షన్ 5 వీరిపై వినియోగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

## ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా

### మూడు పైసలు తేలే : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**భద్రాచలం, ప్రభాతవార్త :** తెలంగాణకు బిఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను ఉద్దేశించి కార్యకర్తలను స్వయంగా కలిసి పిలుపునిచ్చే కార్యక్రమంలో భాగంగా సోమవారం భద్రాచలం చేరుకున్నారు. ఉదయం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం హరిత హోటల్‌లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్‌కు, కార్యకర్తలకు మధ్య వారిధిగా ఉంటానని, కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి నేను తీసుకెళ్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని, ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని దుయ్యబట్టారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. అప్పులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విపరీతమైన అబద్ధాలు చెబుతున్నారని, 2004లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని, 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్ళ ప్రజలను ఏడిపించిందని, వందలాది మంది బిడ్డలను పొట్టన పెట్టుకొని తెలంగాణ ఇచ్చారు తప్పా ఉట్టిగా ఇవ్వలేదు పేర్కొన్నారు. లక్షా 60 వేల కోట్లుపైగా అప్పు తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని, తెచ్చిన రుణాన్ని ఏం చేశారని అడిగితే చెప్పబోమని చెబుతున్నారని అన్నారు. తెచ్చిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ప్రస్తుత పాలకులు చూడడానికి తెలంగాణ వ్యక్తుల్లా ఉంటారు... కానీ పనిచేసేది తెలంగాణకు వ్యతిరేకంగా అని, కాంగ్రెస్ పార్టీ అనేక కల్లిబొల్లి మాటలు చెప్పిందని, లేనిపోని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్ గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దని, సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్ల అందించారని గుర్తు చేశారు.

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు బీఆర్ఎస్ పార్టీ బీఫామ్‌పై నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని, భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదేనని జోష్యం చెప్పారు. ఇలాంటి ద్రోహులను చాలా చూశామన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవి చంద్ర, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తాత మధు, రేగా కాంతరావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, వైరా మాజీ ఎమ్మెల్యే చందనవతి, భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, బోదబోయిన బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోట్లతో కొన్నా రిజల్ట్ సున్నా

## ఖరీదైన ఆటగాళ్లు ఫెయిల్యూర్ లిస్ట్‌లో రిషబ్, మాక్స్‌వెల్, వెంకటేష్, స్టొయినిస్


రిషబ్ పంత్


గ్లెన్ మాక్స్‌వెల్


వెంకటేష్ అయ్యర్


మార్కస్ స్టోయినిస్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, సీజను 18 రసతవత్తరంగా సాగుతోంది. రోజురోజుకూ అభిమానుల్లో ఉత్సాహం పెరుగుతూ వస్తోంది. ఈ సీజన్లో చాలా మంది ఆటగాళ్ల తమ ప్రదర్శనతో అభిమానుల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారు. కానీ మంచి ప్రదర్శన ఇస్తా రని భావించిన కొంత మంది ఆటగాళ్ల మాత్రం నిరాశ పరుస్తున్నారు. వీళ్లను భారీ మొత్తంలో డబ్బులు వెచ్చించికొన్నా వీరి ప్రదర్శన ఇప్పటివరకు పేలవంగా ఉంది. ఫ్రాంఛైజీలు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన ఇలాంటి ఆటగాళ్ల గురించి తెలుసు కుంటే ఈ సీజన్ రిషబ్ పంత్ చాలా దారుణంగా ఆడుతున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్‌ను రూ.27 కోట్లకు కొనుగోలు చేశారు. ఐపిఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా పంత్ రికార్డు సృష్టించాడు. కానీ 7 మ్యాచ్‌ల్లో కేవలం 17.17 సగటు, 100 స్ట్రైక్ రేట్‌తో 103 పరుగులు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్‌పై 63 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. అయినా ఆ మ్యాచ్‌ల్లోన జట్టు ఓడిపోయింది. ఆ తర్వాత దారుణమైన ప్రద ర్శన సాగించాడు. పంత్ కెప్టెన్సీ కూడా ప్రశ్నా ర్థకంగా మారింది. ఇక గ్లెన్ మాక్స్‌వెల్ ఐపిఎల్లో స్టార్‌గా నిలిచేవాడు. అందుకే జట్లు అతన్ని తమ తోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాయి. పంజాబ్ కింగ్స్ జట్టు మాక్స్‌వెల్ రూ.4.2 కోట్లకు నిలుపు కుంది. కానీ ఇప్పటివరకుఆడిన 6మ్యాచ్‌ల్లో మాక్స్ వెల్ కేవలం 41రన్స్ మాత్రమే సాధించాడు. లాంగ్ ఫోర్లు, సిక్సర్లు కొట్టడంలో ప్రసిద్ధిచెందిన మాక్స్ వెల్ ఈ సీజన్లో కేవలం 4 ఫోర్లు, ఒక సిక్సర్ మాత్రమే కొట్టాడు. అలాగే కోల్‌కతా నైట్ రైడర్స్ వెంకటేష్ అయ్యర్‌ను రూ.23.75కోట్ల భారీ మొత్తా నికికొంది. కానీ అయ్యర్‌మాత్రం ఇప్పటి వరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 24.5 సగటు, 155. 05 స్ట్రైక్ రేట్‌తో 121పరుగులు మాత్రమేచేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 29 బంతుల్లో 60పరుగులుచేసి అత్యుత్తమ ప్రదర్శన కనబరి చాడు. తర్వాత చతికిలపడ్డాడు. మార్కస్ స్టోయి నిస్‌ను పంజాబ్‌కింగ్స్ రూ.11 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ సీజన్ 6మ్యాచ్‌లు ఆడిన స్టోయి నిస్ 66పరుగులు మాత్రమేచేశాడు. సన్‌రైజర్స్ హైదరా బాద్‌తో ఆడిన ఇన్నింగ్స్‌లో 11 బంతుల్లోనే 34 పరుగులు చేశాడు. ఇదే అత్యధిక స్కోరు. మరోవైపు బౌలింగ్‌లోనైతంఫలితంశూన్యం. ఇప్పటి వరకు ఆడిన 6మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్‌కూడా పడగొట్టలేదు.


కోనేరు హంపి


ద్రోణవల్లి హారిక


దివ్య దేశ్‌ముఖ్

## మహిళల గ్రాండ్‌ప్రిలో.. హంపి మూడో విజయం

### హారిక-దివ్య మధ్య డ్రా

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ చెస్ సమాఖ్య మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత్ స్టార్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి మూడో విజయం నమోదు చేసింది. మంగోలియాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ బత్కుయాగ్ మున్‌గున్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 33 ఎత్తుల్లో గెలుపొందింది. దీంతో హంపికిది మూడో విజయం కావడం విశేషం. మరో మూడు గేమ్‌లను డ్రా చేసుకన్న హంపి 4.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఇక భారత్‌కే చెందిన మరో స్టార్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, ప్రపంచ జూనియర్ ఛాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌ల మధ్య జరిగిన ఆరో రౌండ్ గేమ్ డ్రాగా ముగిసింది. 27 ఎత్తులయ్యాక గేమ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్ మాస్టర్ వైశాలి రెండో పరాజయాన్ని చవి చూసింది. చైనాకు చెందిన జు జినెర్‌తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో వైశాలి 41 ఎత్తుల్లో ఓడిపోయింది. కాగా జార్జియాకు చెందిన మేలియా సలోమితో జరిగిన మరో గేమ్‌లో రష్యాకు చెందిన పొలీనా షువలోవా 45 ఎత్తుల్లో గెలిచింది. బల్గేరియాకు చెందిన నుర్గుల్ సలీమోవా, పోలాండ్‌కు చెందిన అలీనా కష్లిన్‌స్కాయా మధ్య జరిగిన మరో గేమ్ 67 ఎత్తుల్లో డ్రా గా ముగిసింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్ల పాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత జినెర్ 5 పాయింట్లతో అగ్రస్థానంలోను, 4 పాయింట్లతో దివ్య దేశ్‌ముఖ్ మూడో స్థానంలో, హారిక 3 పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు.

## బిసిసిఐ కాంట్రాక్టు జాబితాలో.. టాప్ గ్రేడ్‌లో రోహిత్, విరాట్



**న్యూఢిల్లీ:** టీమిండియా క్రికెటర్ల వార్షిక కాంట్రాక్టు జాబితాను విడుదలైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు టాప్ కేటగిరీని రిటేన్ చేసుకున్నారు. 34 మందితో కూడిన కాంట్రాక్టు ఆటగాళ్ల జాబితాను సోమ వారం బిసిసిఐ విడుదల చేసింది. శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషణ్ కూడా కాంట్రాక్టు జాబితాలో చోటు దక్కింది. ఎ+ గ్రేడ్ క్యాటగిరీలో మొత్తం నలుగురు క్రికెట్లు ఉన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా ఆ లిస్టులో ఉన్నారు. ఎ+ గ్రేడ్ ఆటగాళ్లకు రిటేన్ ఫీజు 7 కోట్లు చెల్లించనున్నారు. ఇక ఇటీవల ఛాంపియన్స్ ట్రోఫీలో హీరోగా నిలిచిన శ్రేయాస్ అయ్యర్ మళ్లీ కాంట్రాక్టు జాబితాలో చోటు సంపాదించాడు. అయితే అతనికి గ్రూపు బీలో స్థానం కల్పించారు. ఆ గ్రూపు ఆటగాళ్లకు మూడు కోట్ల రూపాయలు చెల్లించనున్నారు. గత ఏడాది అయ్యర్‌ను కాంట్రాక్టు లిస్టును తొలగించారు. ఐపిఎల్ కోసం స్వదేశీ క్రికెట్‌ను ఆడకపోవడం వల్ల గత ఏడాది అయ్యర్‌ను ఆ జాబితా నుంచి తప్పించారు. ముంబై బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా గత ఏడాది ఇదే సమస్యను ఎదుర్కొన్నాడు. అయితే ఈ సారి అతనికి గ్రూపు సి కేటగిరీలో చోటు కల్పించారు. గ్రూపు సి క్యాటగిరీలో ఆటగాళ్లు కాంట్రాక్టు కింద కోటి ఇవ్వనున్నారు. గత ఏడాది గ్రూపు ఏ లో ఉన్న రిషబ్ పంత్ ఈసారి గ్రూపు ఏ కేటగిరీలో చోటు దక్కించుకున్నాడు. రిటైర్ అయిన అశ్విన్ స్థానంలో పంత్‌కు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది.

## బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్.. తొలి ఇన్నింగ్స్‌లో 273 రన్స్‌కు జింబాబ్వే ఆలౌట్



**న్యూఢిల్లీ:** రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా బాంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో పర్యాటక జింబాబ్వే కీలకమైన 82 పరుగల తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 67/1 వద్ద సోమవారం రెండో రోజు ఆటను ప్రారంభించిన జింబాబ్వే మరో 206 పరుగులు జోడించి 273 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్ట్ నగరవ (28 నాటౌట్) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. మిగిలిన బ్యాటర్లలో బెన్ కర్రన్ 18, నిక్ వెల్చ్ 2, కెప్టెన్ క్రెయిగ్ ఎర్విన్ 8, వెల్లింగ్టన్ మసకడ్జ 6, ముజరబానీ 17, న్యాయుచి 7 పరుగులకు ఔటయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 5 వికెట్లుతో చెలరేగగా, నహీద్ రాణా 3 వికెట్లు, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. అంతకు ముందు జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద తలో 3 వికెట్లు, న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బాంగ్లాదేశ్ సొంతగడ్డపై భారీ దెబ్బకొట్టారు. బంగ్లాదేశ్‌కు సొంత గడ్డపై ఇది నాలుగో అత్యల్ప స్కోర్ కావడం విశేషం. బంగ్లా ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్ (56) అర్ధ సెంచరీతో రాణించగా, కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో (40), జాకీర్ అలీ (28), మహ్మదుల్ హసన్‌రాయ్ (14), షద్మాన్ ఇస్లాం (12), హసన్ మహమూద్ (19) రెండంకెల స్కోర్లు చేశారు. స్టార్ ప్లేయర్ ముష్ఫికర్ రహీం 4, మెహిది హసన్ మిరాజ్ 1, తైజుల్ ఇస్లాం 3, నహీద్ రాణా డకౌటయ్యారు. ఖలీద్ అహ్మద్ 4 పరుగులతో అజేయంగా నిలిచాడు.

## వరల్డ్ కప్ షూటింగ్‌లో.. భారత్‌కు రెండు రజతాలు




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య రెండో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ షూటర్లు అద్భుత ప్రదర్శనను కనపరుస్తున్నారు. పెరూలో భారతీయ కాలమాన ప్రకారం సోమవారం జరిగిన టోర్నీలో భారత్ షూటర్లు రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నారు. దీంతో ఇప్పటి వరకూ భారత్ ఖాతాలో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి 6 పతకాలతో మూడో స్థానంలో ఉంది. ఇక పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో అర్జున్ బాబుటా, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్-ఆర్య బోర్సె రజత పతకాలు సాధించారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అర్జున్ బాబూటా 252.3 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో 253.4 పాయింట్లతో చైనా షూటర్ షెంగ్ లీహావో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. హంగేరీకి చెందిన పెనీ మార్టన్ 229.8 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించాడు. ఇక ఫైనల్‌కు చేరిన మరో భారత్ షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ 104.8 పాయింట్లతో చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో పాటిల్- ఆర్య ద్వయం 11-17తో నార్వేకు చెందిన జంట జెనెట్ హెగ్-జాన్ హెర్మన్ హెగ్ చేతిలో ఓడిపోయింది.

# వాణిజ్యం

## సెన్సెక్స్, నిఫ్టీలకు ఎఫ్ఐఐల ఊతం

**ముంబై, ఏప్రిల్ 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఐదో ట్రేడింగ్ సెషన్‌లోనూ లాభాలు ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ మన మార్కెట్లు మాత్రం పరుగులు పెడుతున్నాయి. అమెరికా టారిఫ్‌ల ఆందోళనల ప్రభావం తగ్గుముఖం పట్టడం, సాను కూల త్రైమాసిక ఫలితాలు, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు తిరిగి రావడం సానుకూల సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో సెన్సెక్స్ మళ్లీ 79వేల మార్కు దాటగా, నిఫ్టీ 24వేల ఎగువన ముగి సింది. బ్యాంకింగ్ రంగ షేర్లు రాణిస్తుండటంతో బ్యాంక్ నిఫ్టీ 55 వేల మార్కు దాటింది. 55,304 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేసింది. సెన్సెక్స్ ఉదయం 78,903.09 పాయింట్ల తో లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రా డే 79,635.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి చివరకు 855 పాయింట్ల లాభంతో 79,408.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 273.90 పాయింట్ల లాభంతో 24,125.55 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.13గా ఉంది. టెక్‌మహీంద్రా, ఇండస్‌ఇండ్‌బ్యాంక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, మహీంద్రాఅండ్‌మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు రికార్డు స్థాయిలో 3397 డాలర్ల వద్ద కొనసాగుతోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ సానుకూల త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ స్టాక్స్ రాణించాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరిగాయి. గత వారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు రూ.8,472 కోట్ల పెట్టుబడులు పెట్టారు. భారత్, అమెరికా మధ్య త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పం దం కుదిరే అవకాశం ఉన్నట్లు వస్తున్న కథనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపర్చాయి. ఏప్రిల్ 23 నుంచి ఇరు దేశాల మధ్య దీనిపై చర్చలు జరగనున్నా యి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలపడుతోంది. నేటి ట్రేడింగ్‌లో రూపాయి 25 పైసలు బలపడి 85.05గా కొనసాగుతోంది. అటు చమురు ధరలు క్షీణించడం కూడా మార్కెట్ ర్యాలీకి ఓ కారణమైంది.



## నకిలీ రూ.500 నోట్లతో జాగ్రత్త: హోంశాఖ హెచ్చరికలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అత్యాధునిక టెక్నాలజీ వాడి తయారు చేసిన రూ.500 దొంగనోట్లు చెలామణిలోకి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు వీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఈ సమాచారాన్ని డిఆర్ఐ, ఎఫ్ఐయు, సిబిఐ, ఎన్ఐఎ, సెబీతో కూడా పంచుకొంది. ఆ దొంగనోట్ల ప్రింటింగ్, నాణ్యత చాలా వరకు అసలు నోట్లు లాగే ఉన్నట్లు వెల్లడిం చింది. వాటిని గుర్తించడం కూడా చాలా క్లిష్టంగా మారిందని వెల్లడించింది. కాకపోతే ఈ నోట్లలో ఒక చిన్న స్పెల్లింగ్ తప్పు ఉందని, దీనిని గుర్తించడంలో అదే కీలకమని పేర్కొంది. రిజర్వ్ పదంలో 'ఇ' బదులు 'ఎ' పడినట్లు వెల్లడించింది. ఈచిన్న తప్పును గుర్తించాలంటే ఆ నోటును క్షుణ్ణంగా పరీక్షించాల్సి ఉంటుంది. ఇలాంటి నకిలీ నోట్లు అత్యంత ప్రమాదకరమని వెల్లడించింది. వీటి విషయంలో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఏజెన్సీలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఇవి మార్కెట్లో ఉన్నాయని హెచ్చ రించారు. మార్కెట్లో మొత్తం ఎన్ని ఉన్నాయో గుర్తిం చడం కష్టమని ఉగ్ర ఫైనాన్స్‌పై దర్యాప్తు చేస్తున్న ఓ అధికారి చెప్పారు. ప్రజలు, వ్యాపార సంస్థలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.




## లక్షకు చేరువలో బంగారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 21:** అంతర్జాతీయంగా నెలకొన్న డిమాండ్ కారణంగా బంగారం ధరకు మళ్లీ రెక్కలు వస్తున్నాయి. అమెరికా, చైనా మధ్య వాణిజ్య పోరు, డాలర్ బలహీన పడడం వంటి కారణాలతో ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతుండడంతో అంతర్జా తీయ మార్కెట్లో బంగారం ధర పెరుగుతూనే ఉంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ పసిడి ధర పరుగులు పెడుతోంది. బులియన్ మార్కెట్లో 10గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.99,600 పైనే పలుకుతోంది. రూ.లక్షకు కాస్త దూరంలో నిలిచింది. అటు వెండి సైతం కిలోరూ.98 వేలుగా ఉంది. అటు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96వేల మార్కు దాటింది. జూన్‌నెల డెలివరీ కాంట్రాక్ట్స్‌లో 10గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1493 మేర పెరిగి ఇంట్రాడేలో 96,747 రూపాయల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 3,393 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంత వరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని అనలిస్టులు చెబుతున్నారు.

## షాంఘై షాపింగ్ మాల్‌లో గోల్డ్ ఏటిఎం

**ముంబై, ఏప్రిల్ 21:** భారతదేశంలో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశం కూడా ఆవిష్కరణ పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. సాధారణం గా జ్యుయెలరీ షాపుల్లో, ఇతర రుణ సంస్థలలో బంగారం ఇచ్చి డబ్బులు తీసుకోవడం వంటివి చూసే ఉంటారు. కానీ మీరు ఎప్పుడైనా బంగారు ఎటిఎం గురించి విన్నారా లేదా చూశారా? చైనాలోని అతిపెద్ద నగరమైన షాంఘైలోని ఒక పెద్ద షాపింగ్ మాల్‌లో ఇలాంటిదే కనిపించింది. ఇది షాంఘైలో మొట్టమొదటి బంగారు ఏటీఎం. ఈ ఎటీఎం ప్రజలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఈ ఎటిఎం 1,200 డిగ్రీల సెల్సియస్ వద్ద బంగారాన్ని కరిగించి, బంగారం స్వచ్ఛతను దాని ప్రత్యక్ష ధరతో పాటు చూపిస్తుంది. దీని తరువాత రేటు ప్రకారం తిగిలీ నుండి నగదు బయటకు వస్తుంది. దీని ద్వారా మీరు బ్యాంకు నుండి డబ్బును కూడా బదిలీ చేయవచ్చు. ఈ ఏటీఎంను వినియోగదారులు ఎంతగానో ఇష్టపడుతున్నారు. ఈ ఎటీఎం నుండి బంగారం లావాదేవీ చాలా సులభం. ముందుగా ఈ యంత్రం బంగారాన్ని తూకం వేస్తుంది. ఇది బంగారం 99.99 శాతం స్వచ్ఛమైనదా కాదా? అని తనిఖీ చేస్తుంది. కానీ దీని నుండి ఒక చిన్న సర్వీస్ ఛార్జీ కూడా కట్ అవుతుంది. భారతదేశంలో బంగారాన్ని శ్రేయస్సు, భద్రతకు చిహ్నంగా పరిగణించినట్లే, చైనాలో కూడా దీనిని అలాగే పరిగణిస్తారు. ప్రజలు బంగారాన్ని పెట్టుబడిగా కూడా ఉపయోగిస్తారు. మీడియా నివేదికల ప్రకారం, ఈ ఏటీఎం ను షెన్‌జెన్‌కు చెందిన కంపెనీ కింగ్‌హుడ్ గ్రూప్ తయారు చేసింది. ఈ ఎటిఎం చైనాలోని 100కి పైగా నగరాల్లో ఏర్పాటు చేయబడింది. ఇది మాత్రమే కాదు. షాంఘైలో కూడా మరో బంగారు ఎటీఎం ఏర్పాటు చేయబోతున్నారు. ప్రజలు దీన్ని చాలా ఇష్టపడుతున్నారని ఇది స్పష్టంగా చూపిస్తుంది. ఇప్పుడు కస్టమర్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా బంగారాన్ని సులభంగా అమ్మవచ్చు. ఈ బంగారు ఎటీఎం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ వీడియోపై జనాలు ఒకరి తర్వాత ఒకరు వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై ఒక యూజర్, వావ్, త్వరలో భారతదేశంలో గోల్డ్ ఎటిఎం చూస్తామని ఆశిస్తున్నాను" అని అన్నాడు.



## కొత్తగా 84 లక్షల డీమ్యాట్ అకౌంట్లు

**ముంబై, ఏప్రిల్ 21:** గత ఆర్థిక సంవత్స రంలో దేశీయ కేపిటల్ మార్కెట్లు జోరు చూపడం పలువురు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చింది. దీంతో స్టాక్ ఎక్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఇలో నికరంగా 84 లక్షల డీమ్యాట్ ఖాతాలు కొత్తగా జమయ్యాయి. వెరసి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లకు చేరింది. ఇందుకు ప్రధానంగా మార్కెట్లు జోరందు కోవడానికి తోడు డిజిటల్ బ్రోకరేజీ సంస్థలు దోహదం చేశాయి. కొత్తగా జత కలిసిన ఖాతాలలో గ్రో, ఏంజెల్‌వన్ నుంచే 57శాతం నమోదయ్యాయి. 34 లక్షల డీమ్యాట్ ఖాతాలు గ్రో నుంచి ఓపెన్ కాగా, ఏంజెల్ వన్ నుంచి 14.6 లక్షల ఖాతాలు జమయ్యాయి. అంటే 84 లక్షల కొత్త ఖాతాలలో ఈ రెండు సంస్థల నుంచే 48.6 లక్షల ఖాతాలు జత కలిశాయి. ఈ బాటలో ఇన్వె స్టర్లు మరో బ్రోకింగ్ సంస్థ జిరోధా నుంచి 5.4 లక్షల ఖాతాలు తెరిచినట్లు ఎన్ఎస్ఇ గణాంకాలు వెల్లడించాయి. మొబైల్ ఆధా రిత సరళీకృత లావాదేవీల కారణంగా ఇన్వెస్టర్లు డిజిటల్ బ్రోకరేజీలను ఆశ్రయిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల నుంచి ఇన్వెస్టర్లు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా లావా దేవీలకు ఆసక్తి చూపుతు న్నట్లు వివరించారు.




## ఎఐతో నిరుద్యోగ ఉపద్రవం: బిల్‌గేట్స్, ఒబామా

**వాషింగ్టన్, ఏప్రిల్ 21:** ఈ సాంకేతిక యుగంలో కృత్రిమ మేధ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీ సెస్ వంటి విభాగాల్లో ఇప్పటికే ఎఐ ఆధారిత ఆటో మేషన్ అందుబాటులోకి వచ్చింది. దీంతో వేగంగా పనులు పూర్తవుతున్నా, కొన్ని సమస్యలూ లేకపో లేదు. ముఖ్యంగా ఎఐ రాకతో ఉద్యోగ భద్రతపై ఆందోళన నెలకొంది. తాజాగా అమెరికా మాజీ అధ్య క్షుడు బరాక్ ఒబామా, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాప కుడు బిల్‌గేట్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్త పర్చారు. కృత్రిమ మేధతో రాబోయే రోజుల్లో కోట్లాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడనున్నాయని అన్నారు. ఫలితంగా నిరుద్యోగం భారీగా పెరిగే అవ కాశం ఉందన్నారు. ఇది ఏఐ యుగం.. జ్ఞానంపై



సమాజం దృక్కోణాన్ని సమూలంగా మార్చే శకం. ఇప్పటి వరకు గొప్ప గొప్ప డాక్టర్లు, టీచర్ల మేధ అద్భుతం అని కొనియాడాం. కానీ, ఎఐ రాకతో రాబోయే దశాబ్దకాలంలో వీరికి ఉండే జ్ఞానం ఉచి తంగా, అందరికీ అందుబాటులోఉంటుంది. ప్రస్తుతం మన జనాభాకు సరిపడావైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉంది. దీంతో ఎఐతో లభించే మెడి కల్ సలహాలు, టీచింగ్‌క్లాస్‌లు అందరికీ నచ్చుతాయి. కానీ, ఇది కాస్త భయానకమైన విషయం. ఇదంతా పక్కనబెడితే.. మరి ఉద్యోగాల సంగతేంటీ? కనీసం వారానికి రెండు,మూడురోజులైనా పని చేయగలమా? అని బిల్‌గేట్స్ అన్నారు. అయితే, కొన్ని విషయాల్లో ఎఐ సమస్యలను పరిష్కరిస్తోందని టెక్ దిగ్గజం తెలి పారు. కృత్రిమ మేధతో కొత్త ఆవిష్కరణలు వస్తున్నా యని, పనులు వేగవంతమవుతున్నాయని పేర్కొన్నా రు. ఎఐ మరింత ప్రభావవంతంగా, వేగంగా అందు బాటులోకి వస్తోంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఆటోమేషన్‌కు అడ్వాన్స్‌డ్ వెర్షన్. అయితే, కేవలం తయారీరంగాన్ని మాత్రమే ఆటోమేటిక్ చేయట్లేదు. రోబో చేతులను ఉపయోగించినట్లు కాదు. ఉన్నత స్థాయి మేధోపరంగానూ అనేక పనులు చేస్తోంది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ డెవలపర్లు చేసే 70శాతం పను లను ఎఐ చేయగలదు. నిపుణులైన ఉద్యోగులు, మంచి జీతభత్యాల గురించి మాట్లాడు కునేటప్పుడు ఎఐ రాక కాస్త గందరగోళానికి గురిచేస్తుంది. కృత్రిమ మేధ వినియోగం పెరిగితే చాలాఉద్యోగాలు గల్లంతే.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14